రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★

ఖమ్మం, వరంగల్, కరీంనగర్
## కార్పొరేషన్లకు ఒఆర్‌ఆర్‌లు

10


సంపుటి 09, సంచిక: 164 | గురువారం | 14-05-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# వరి @ రూ.2,441

**ఖరీఫ్ సీజన్‌కు మద్దతు ధర రూ.72 పెంచిన కేంద్రం**

- క్వింటా జొన్నలు ఎంఎస్‌పి ధర రూ.4,023
- మొత్తం పది పంటలకు మద్దతు ధరల పెంపు
- ఖరీఫ్ పంటలను కొనుగోలుకు రూ.2.6 లక్షల కోట్లు
- బొగ్గు గ్యాసిఫికేషన్ కోసం రూ.37,500 కోట్లతో ప్రోత్సాహక పథకం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

| | |
|---|---|
| వరి | : రూ.2,441 |
| జొన్నలు | : రూ.4,023 |
| సజ్జలు | : రూ.2,900 |
| రాగులు | : రూ.5,205 |
| మొక్కజొన్న | : రూ.2,401 |
| కందులు | : రూ.8,415 |
| పెసలు | : రూ.8,780 |
| మినుములు | : రూ.8,200 |
| పత్తి (మధ్యశ్రేణి) | : రూ.8,267 |
| పల్లి | : రూ.7,517 |
| ప్రొద్దుతిరుగుడు | : రూ.8,343 |
| సోయాబీన్ (ఎల్లో) | : రూ.5,708 |



**న్యూఢిల్లీ :** కేంద్ర కేబినెట్ బుధవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వరితో పాటు పలు పంటలకు కనీస మద్దతు ధర పెంపును ఆమోదించింది. బొగ్గు గ్యాసిఫికేషన్ కోసం రూ.37,500 కోట్లతో ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం, గుజరాత్‌లోని అహ్మదాబాద్, ధోలేరా మధ్య సుమారు రూ. 20,667 కోట్ల అంచనా వ్యయంతో 134 కిలోమీటర్ల సెమీహైస్పీడ డబుల్ రైలు మార్గం నిర్మాణానికి, నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) ద్వారా ఆధునీకరించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. మిహాన్ ఇండియా లిమిటెడ్ సంస్థకు కేటాయించిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన భూమి లీజు గడువును ఆగస్టు 6, 2039 తర్వాత కూడా పొడిగించడానికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఖరీఫ్ పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రూ.2.6 లక్షల కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. అగ్రికల్చర్ కాస్ట్ ప్రైసెస్ కమిషన్ సిఫార్సుల మేరకు వివిధ పంటలకు కనీస మద్దతు ధరలను కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. క్వింటా వరికి కనీస మద్దతు ధరను రూ.72 పెంచి రూ.2,441 చెల్లించాలని నిశ్చయించింది. క్వింటా జొన్న కనీస మద్దతు ధరను రూ.4,023కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 'ఏడాదికి 824.41 లక్షల మిలిటన్ టన్నుల పంట సేకరణ చేస్తున్నాం. పంట ఖర్చుకు అదనంగా 50 శాతం కనీస మద్దతు ధరగా నిర్ణయం చేశాం. 2014–26 మధ్య ఖరీఫ్ పంటలకు రూ.19 లక్షల కోట్ల కనీస మద్దతు ధర చెల్లించాం. 2014–26 మధ్య 8,746 లక్షల మిలిటన్ టన్నుల ఖరీఫ్ పంట తరువాయి 8లో



# పార్కింగ్ సమస్యపై దృష్టిపెట్టండి

- ఉబెర్ సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని విజ్ఞప్తి
- హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విస్తరిస్తున్నట్లు సంస్థ సిఇఒ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) దారా ఖోస్రో షాహి ప్రకటించారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఈఓ) దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రో షాహి వివరించారు. ప్రధాన నగరాల్లో తరువాయి 8లో

# బలపరీక్షలో 'విజయ్'డు

**144–22 ఓట్లతో అసెంబ్లీలో నెగ్గిన టివికె సర్కార్**

- డిఎంకె శాసనసభ్యులు వాకౌట్, తటస్థంగా ఉన్న ఐదుగురు ఇతరులు
- ఎఐఎడిఎంకె సభ్యుల్లో చీలిక : విజయ్‌కు అనుకూలంగా 24 మంది ఓటు



**చెన్నై :** తమిళనాడులో నాలుగు రోజుల క్రితం అధికారంలోకి వచ్చిన టివికె ప్రభుత్వం బుధవారం ఒక కీలక అడ్డంకిని అధిగమించింది. ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకె, అన్నా డిఎంకెలోని ఒక వర్గం వాకౌట్ చేసినప్పటికీ, 144:22 మెజారిటీతో బలపరీక్షలో విజయం సాధించింది. 234 మంది సభ్యులున్న సభలో సాధారణ మెజారిటీకి 118 ఓట్లు అవసరం. ఎఐఎడిఎంకె అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామికి మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ముఖ్యమంత్రి విజయ్ తన పార్టీలోని ఒక వర్గానికి వత్తాసు పలకడం సరైనదేనా అని అసెంబ్లీలో ఎడప్పాడికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎఐఎడిఎంకె అధినేత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బిజెపి తన ఏకైక ఎమ్మెల్యేతో తటస్థంగా ఉండగా, ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షమైన పిఎంకె (నలుగురు సభ్యులు) కూడా ఓటింగ్‌కు దూరంగా ఉంది. అసెంబ్లీ ఫలితాల తరువాత మెజారిటీ లేకపోవడంతో ప్రభుత్వ స్థిరత్వంపై ప్రశ్నలు తలెత్తాయి. దాదాపు ఆరు రోజుల తరువాత రాష్ట్రంలో ఏర్పాటు కాగా, బలపరీక్షలో విజయ్‌కి భారీ మెజారిటీ లభించింది. ఈ విజయం తొలి టవికె ప్రభుత్వానికి కుదురుకుని, పరిపాలనను కొనసాగించడానికి ఎంతో అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. కాంగ్రెస్, విసికె, వామపక్షాలు, ఎఎంఎంకె, అలాగే నాయకులు ఎల్‌పి వేలుమణి, సి.వి. షణ్ముగం నేతృత్వంలోని ఎఐఎటిఎంకె తిరుగుబాటు వర్గం మద్దతుతో విజయ్ నేతృత్వంలోని టివికె ప్రభుత్వం విశ్వాస తీర్మానాన్ని గెలుచుకుంది. ఉదయం 9.30 గంటలకు సభ సమావేశమైన వెంటనే, తరువాయి 8లో

# బంగారం, వెండి ధరలకు రెక్కలు

దిగుమతి సుంకం 15 శాతానికి పెంపు

తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్రం ప్రకటన




**న్యూఢిల్లీ :** భారత్‌లో బంగారం, వెండికి రెక్కలొచ్చాయి. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచింది. దీంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. సామాన్యుడికి అందనంత దూరానికి వెళ్లాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం బుధవారం బంగారం, వెండిపై సుంకాలను 6శాతం నుంచి 15శాతానికి భారీగా పెంచింది. దేశీయ కరెన్సీకి సహాయపడేందుకు, బంగారం కొనుగోళ్లను, అనవసరమైన విదేశీ ప్రయాణాలను మానుకోవాలని, చమురును పొదుపుగా వాడుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వారాంతంలో చేసిన అరుదైన విజ్ఞప్తి నేపథ్యంలో ఈ పెంపు జరిగింది. ప్రపంచంలో విలువైన లోహాలను అత్యధికంగా వినియోగించే దేశాలలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది. పెట్టుబడి ప్రయోజనాలు సహా డిమాండ్ తరువాయి 12లో

ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో
# పరిమితులు ఆక్షేపణీయం

- న్యాయ తీర్పుల భాష్యాలు చట్టాలను పటిష్ఠం చేయాలి
- ఇటీవల సుప్రీం తీర్పుపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**న్యూఢిల్లీ:** దేశంలో రోజు రోజుకూ దళితులు,అట్టడుగు వర్గాలపై దాడులు పెరుగుతున్నకొద్దీ న్యాయస్థానాల తీర్పులు,వాటి భాష్యాలు రాజ్యాంగపరమైన రక్షణలను మరింత పటిష్టవంతం చేసేవిగా ఉండాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పైవిధంగా స్పందించారు. కులపరమైన దూషణలు,అణచివేత చర్యలు కేవలం బహిరంగ ప్రదేశాలలో మాత్రమే పరిమితం కాదని, వాటికి స్థల పరిమితి లేదని పేర్కొన్నారు. "ఎస్‌టి–ఎస్‌టిలపై అరాచకాల నిరోధక చట్టం పరిధిలోకి వచ్చే సంఘటనలను,కులపరమైన దూషణ,దోపిడీ,అక్రమాలకు పాల్పడే ఘటనలను ప్రజలందరిముందు బాహాటంగా జరిగినప్పుడు మాత్రమే వర్తింపజేస్తూ పరిమితులు విధించే తీర్పును ఇటీవల సుప్రీంకోర్టు తరువాయి 8లో

**హిందూమతం జీవన విధానం**

విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి
# గుడికి వెళ్లడం తప్పనిసరేం కాదు

సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** హిందూయిజం అనేది జీవన విధానమని, ఈ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం లేదా పూజలు చేయడం తప్పనిసరేం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. హిందూయిజంపై విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని తేల్చి చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లతో పాటు తరువాయి 8లో

# ప్రపంచం చూపు.. చైనా వైపు



**నేడు జిన్‌పింగ్ – ట్రంప్‌ల మధ్య కీలక చర్చలు**

**బీజింగ్‌కు చేరుకున్న అమెరికా అధ్యక్షుడికి ఘనస్వాగతం**

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మూడు రోజులు చైనా పర్యటన నిమిత్తం బుధవారం రాత్రి బీజింగ్‌కు చేరుకున్నారు. ఎర్ర తివాచీలు పరచి ఆయనకు ఘన స్వాగతం పలికారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ ఝెంగ్ విమానాశ్రయంలో ట్రంప్‌కు స్వాదర స్వాగతం పలకారు. తొమ్మిది సంవత్సరాల తర్వాత మళ్ళీ ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. ఉన్నతస్థాయీ అమెరికన్ దిగ్గజ కంపెనీల సి.ఇ.ఓలు కూడా ఆయన వెంట వెళ్ళారు. 300 మంది చైనా యువకులు నీలం రంగు,తెలుపు యూనిఫారాలు ధరించి చైనా–అమెరికా పతాకాలు ఊపుతూ "స్వాగతం...స్వాగతం...స్వాగతం....అని నినాదాలు చేస్తూ ట్రంప్‌కు ఆహ్వానం పలికారు. ట్రంప్ విమానం మెట్లు దిగి కిందకు వస్తుంటే తరువాయి 12లో


6వ వర్ధంతి



కీ॥శే॥ పరిశ సీతారత్నం గారు
మరణం : 14-05-2020

కాలం కలలా కరిగిపోయినా నీ మధుర స్మృతులు మా మదిలో చిరస్మరణీయం.
నీవు మా నుండి దూరమై నేటికి 6 సంవత్సరములు గడిచిననూ,
నిత్యం నిన్నే స్మరించుకుంటూ... నివాళులర్పిస్తున్నాము.

భర్త : పరిశ పుల్లయ్య

కుమార్తె - అల్లుడు : భీమా కృష్ణకుమారి - ఉదయ్‌కిరణ్
మనుమరాలు : శ్రేష్ఠ

కుమార్తె - అల్లుడు : కుంచకూరి ఝాన్సీకుమారి-సతీష్
మనుమరాలు : పోష్య సాయి

పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్

# పొదుపు మంత్రంలో తొలి చర్యలు

పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో దేశం సంక్షోభం ఎదుర్కొంటున్న ఈ తరుణంలో విదేశీ మారక ద్రవ్యం కాపాడుకునేందుకు ప్రజలు ఆడంబరాలు, దుబారా ఖర్చులు తగ్గించుకుని పొదుపు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హైదరాబాద్ బహిరంగసభ వేదిక నుంచి పిలుపు ఇచ్చిన తదుపరి దేశంలో దీనిపై అనుకూల, ప్రతికూల చర్చ మొదలైంది. దేశం క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకోకమునుపే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అవసరం గూర్చి ప్రధాని పిలుపు హెచ్చరిస్తున్నదని ప్రభుత్వ సమర్థకుల సర్వసాధారణ వాదన. ప్రధాని పిలుపు ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో, విదేశాంగ విధానం అమలులో వైఫల్యానికి నిదర్శనమన్నది ప్రతిపక్షాల ప్రతివిమర్శ. దేశం యుద్ధంలో ఉన్నప్పుడు ప్రభుత్వ యంత్రాంగం పొదుపు పాటించాలని, దేశ ప్రజలు అనవసరపు ఖర్చులు తగ్గించుకుని ప్రభుత్వ యుద్ధ కృషికి తోడ్పడాలని ప్రభుత్వ నేతలు విజ్ఞప్తులు చేయటం పరిపాటి. గతంలో యుద్ధ సమయాల్లో ప్రజలు బంగారం విరాళంగా యిచ్చారని గుర్తు చేసిన ప్రధానమంత్రి మోదీ, ఇప్పుడు కనీసం సంవత్సరంపాటు బంగారం కొనుగోలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. బంగారం రేటు కొద్ది సంవత్సరాలుగా చుక్కలు చూస్తున్నందున బంగారం కొనుగోలుదారులు సంపన్న తరగతులే. వేడుకలు, వివాహాలకు విపరీతంగా బంగారం కొంటున్నది, డెస్టినేషన్ వివాహాలు (దేశంలో ఏదో విలాసవంతమైన ప్రదేశంలో లేదా విదేశీ లొకేషన్స్‌లో) జరుపుకుంటూ ధనం (విదేశీ మారక ద్రవ్యం సహా) దుబారా చేస్తున్నదీ సునాయాసంగా సిరి ఆర్జన పరులే. వారిలో అత్యధికులు పాలక బిజెపికి మిత్రులు, ఆర్థిక తోడ్పాటు దారులు. బంగారం దిగుమతి చేసుకుని వజ్రాభరణాలు తయారుచేసి విదేశాలతో ఎగుమతి వ్యాపారం సాగించే బడా వ్యాపారులంతా బిజెపివారికి మిత్రులే. బడా వర్తక వాణిజ్య, పారిశ్రామిక వర్గాలకు అనుకూలమైన విధానాలు అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వం ఈ సంక్షోభం కాలంలోనైనా కనీసం ఒక సంవత్సరంపాటు కొంత కఠినంగా వ్యవహరించకూడదా? కార్పొరేట్ టాక్స్ పెంచవచ్చు, సంపద పన్ను పునరుద్ధరించవచ్చు, విలాసవంతమైన విదేశీ వస్తువుల దిగుమతిని నిషేధించవచ్చు. అటువంటివేమీ చేయకుండా ఆయన ఇప్పటికే విపరీత భారాలు మోస్తున్న సామాన్యులు, మధ్యతరగతులను మరికొంచెం బెల్ట్ బిగించుకోండని కోరుతున్నారు.

పొదుపు చర్యలు అమలు నాటకీయంగా మొదలైంది. ప్రధాని కాన్వాయ్ రెండు కార్లకు తగ్గించుకున్నారు. మంత్రులందరూ కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించుకుంటున్నారు. మంత్రులు, అధికారులు విదేశీ ప్రయాణాలు కూడా తగ్గించుకుంటారు. బంగారం దిగుమతిపై సుంకాన్ని 6 నుంచి 15శాతానికి పెంచారు. తద్వారా పెట్రోలు వాడకం పొదుపునకు తమ ప్రభుత్వం ఆదర్శంగా ఉన్నట్లు, బంగారం, క్రూడ్ ఆయిలు రెండూ 80 శాతం దిగుమతి చేసుకునేవే గనుక, ఈ చర్యల వల్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని ప్రచారం చేసుకోవచ్చు. కాన్వాయ్‌ల తగ్గింపు పొదుపు చర్య ఇక బిజెపి రాష్ట్రాలన్నిటా అమలులోకి వస్తుంది. ఇన్నాళ్లు – ఇన్నేళ్లు ఎందుకు దుబారా చేసారని ప్రశ్నించేవారు లేరు, జవాబు ఉండదు.

దేశంలోని క్లిష్ట పరిస్థితులను కేంద్రమంత్రివర్గం బుధవారం సుదీర్ఘంగా చర్చించింది. ప్రభుత్వ వ్యయకర్తనకు, ప్రజల్లో పొదుపును ప్రోత్సహించటానికి ఏవో గంభీరమైన నిర్ణయాలు తీసుకుంటారని ఊహించిన వారికి ఆశాభంగం తప్పలేదు. గత రెండ్రోజుల్లో పెట్రోలు, డీజిలు సమస్యలపై మంత్రుల బృందం చర్చలు, చమురు కంపెనీలు రోజుకు వెయ్యి కోట్ల రూపాయలు నష్టపోతున్నాయని పెట్రోలియం శాఖామంత్రి చేసిన ప్రకటన నేపథ్యంలో ఆయిలు, గ్యాస్–ధరల పెంపును పరిశీలకులు ఊహించారు. మంత్రివర్గం నేరుగా ఆ విషయం ప్రకటించకపోయినా, ఆయిలు కంపెనీలకు సంబంధిత చర్యలకు అనుమతి ఇస్తుండవచ్చు. అంతర్జాతీయ క్రూడ్ మార్కెట్ ధరలనుబట్టి పెట్రోలియం ఉత్పత్తుల రిటైల్ ధరలను ఎప్పటికప్పుడు సవరించే అధికారం చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఉంది. అయితే ప్రభుత్వ తమ రాజకీయ ప్రయోజనాలకోసం వాటిని నియంత్రిస్తున్నది. ధరల పెంపుదలకు ప్రజలను సమాయత్తం చేయటానికే ప్రధాని ఆ సమస్యను ప్రజలముందు పెట్టారు. బంగారం దిగుమతులపై సుంకం పెంపుదల ఆ బాటలో తొలి చర్యగా భావించవచ్చు. అంతేగాక ప్రధాని సూచించిన పొదుపు చర్యల్లో ఎక్కువభాగం ఇంధన పొదుపు ఆవశ్యకతతో ముడిపడినవే.

మంత్రివర్గ సమావేశం ఖరీఫ్ సీజన్‌కు 12 రకాల ఆహార, వాణిజ్య పంటలకు కనీస మద్దతు ధరల పెంపును ఆమోదించింది. పెట్టుబడిపై 50 శాతం పెంచి ధర నిర్ణయం చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ధరలు ఆమోదించే ముందు రైతు సంఘాలతో చర్చించి, మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించే విషయమై చర్చించి ఉంటే సమంజసంగా ఉండేది. రైతు సంఘాలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతి సీజన్‌లో కనీస మద్దతు ధర నామమాత్రంగా పెంచుతూ రైతులను ఉద్ధరిస్తున్నామని చెప్పుకోవటం ఈ ప్రభుత్వానికి పరిపాటి అయింది.



## జెన్ జి రోడ్లపైకి రావాలి

నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షలో అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెన్–జి (యువత) రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేయాలి. 2014 నుంచి ఇప్పటి వరకు దేశంలో 93 కంటే ఎక్కువ సార్లు పరీక్ష పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. దీనివల్ల 6 కోట్లకు పైగా యువత ప్రభావితమయ్యారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ ఏవైనా దిద్దుబాటు చర్యలు తీసుకోగలదా?

- ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



## తీర్పు చెప్పాల్సింది విశ్లేషకులు కాదు..కాలం..!


కొందరు రాజకీయ విశ్లేషకులు వామపక్షాల 'అవసాన దశ' గురించి రాస్తున్నప్పుడు, నాకు జైలు గోడల మధ్య గడిపిన ఆ చీకటి రోజులు గుర్తొస్తున్నాయి. 'ఉపా' వంటి కఠిన చట్టాల కింద 100రోజులు విచారణ ఖైదీగా ఉండి, ఐదేళ్ల తరువాత కోర్టు విచారణ జరిగి చివరకు కోర్టు ద్వారా 'నిర్దోషి'గా బయటపడిన నా దృష్టిలో.. వామపక్షం అంటే కేవలం ఎన్నికల గుర్తో, పార్లమెంటు సీట్లో కాదు. అది అణచివేతకు వ్యతిరేకంగా వినబడే ఒక రాజ్యాంగబద్ధమైన ధిక్కార స్వరం. ఆ స్వరాన్ని గొంతు నొక్కాలని చూసిన వ్యవస్థలే నాకు ఒక నిజాన్ని నేర్పాయి. మనిషిని బంధించవచ్చు కానీ, మౌలికమైన ప్రశ్నలను కాదనే నిజాన్ని నేర్పాయి. నాకే కాదు నాలాంటి అనేకులకు ఈ నిజం తెలుసని భావిస్తున్న.

కొందరు విశ్లేషకులు చెప్పినట్లు వామపక్షాల బలం ఎన్నికల్లో తగ్గి ఉండవచ్చు. కానీ, దేశంలో అసమానతలు పెరిగినప్పుడు, గిరిజనుల భూములు కార్పొరేట్లకు ధారాదత్తం అవుతున్నప్పుడు, ప్రశ్నించే గొంతులపై దేశద్రోహం ముద్ర వేస్తున్నప్పుడు, వామపక్ష భావజాలం మరింత అవసరమవుతుంది. అవసరం కూడా. భారతదేశంలో వామపక్షాల సంక్షోభం గురించి విశ్లేషించేవారు కేవలం ఓట్ల గణాంకాలనే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు అర్థం అవుతోంది. కానీ ఒక బాధితుడిగా జైలు లోపల నేను చూసిన దృశ్యం వేరు. అక్కడ విచారణ కోసం ఎదురుచూస్తున్న మెజారిటీ ప్రజలు దళితులు, ఆదివాసీలు, గరీబులు. వారి హక్కుల గురించి, వారికి అందాల్సిన న్యాయం గురించి మాట్లాడే ఏకైక భావజాలం 'లెఫ్ట్'. ఆ భావజాలం చనిపోయిందని ప్రకటించడం అంటే, ఆ పీడిత వర్గాల ఆశ చనిపోయిందని చెప్పడమే అవుతుంది. అసమానతలు ఉన్నంత కాలం, ప్రశ్నించే గొంతులపై దేశద్రోహం ముద్రలు పడుతున్నంత కాలం.. వామపక్ష సిద్ధాంతం తన ప్రాముఖ్యతను కోల్పోదు. అది ఎన్నికల రాజకీయాల్లో వెనుకబడి ఉండవచ్చు, కానీ సామాజిక అవసరంగా అది మరింత బలపడుతోంది. బలపడాల్సిన అవసరం కూడా ఉంది. ఆర్థిక సంస్కరణల తర్వాత వామపక్షం బలహీనపడిందని కొందరి వాదనలు ఉన్నప్పటికీ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం వంటివి కేవలం కాగితాలు కావు. అవి దశాబ్దాల వామపక్ష పోరాట ఫలితాలు. నేడు ఆ చట్టాలను నీరుగారుస్తున్న తరుణంలో, వాటిని కాపాడుకోవడానికి పార్లమెంటరీ రాజకీయాల కంటే మించిన 'క్షేత్ర స్థాయి చైతన్యం' ఎంతో అవసరం.

ఎన్నికల్లో ఓడిపోవడం అంటే సిద్ధాంతం విఫలమైనట్లు కాదు. పార్టీల నిర్మాణాలు బలహీనపడి ఉండవచ్చు, కానీ అవి లేవనెత్తే అంశాలు అంటే కనీస వేతనం, భూమి హక్కు, కార్పొరేట్ దోపిడీ ఇప్పటికీ అత్యంత వాస్తవికమైనవి. మనది ప్రజాస్వామ్యం. ఇక్కడ ఏ సిద్ధాంతమైనా రాజ్యాంగ పరిధిలోనే పనిచేయాలి. 'ఉపా' వంటి చట్టాల దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటే, వామపక్షాలు మరింతగా 'లీగల్ డిఫెన్స్' (చట్టపరమైన రక్షణ) వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలి. పాత నినాదాలు ఇక పనిచేయవు. ఈ తరం జర్నలిస్టుగా నేను చెప్పేది ఒకటే డిజిటల్ హక్కులు, పర్యావరణ పరిరక్షణ, ఆదివాసి గిరిజనుల రక్షణ, హక్కులు, అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోవడం. విచారణ ఖైదీల హక్కుల గురించి మాట్లాడటమే నేటి అసలైన 'లెఫ్ట్' రాజకీయంగా ఉండాలి. చట్టం ప్రకారం 'నిరూపించబడే వరకు ప్రతి ఒక్కరూ నిర్దోషులే'. కానీ 'ఉపా' వంటి చట్టాలలో ఇది ఉల్టా అవుతోంది. ఇక్కడ వామపక్షాల అవసరం ఉంది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి అవి నిరంతరం వాదించాలి.

వామపక్షాల పునరుజ్జీవనం పాత నినాదాలతో సాధ్యం కాదు. నేటి కాలానికి తగ్గట్టుగా అవి రూపాంతరం చెందాలి. వామపక్ష ఉద్యమాలు కేవలం రోడ్ల మీద ధర్నాలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలో 'లీగల్ ఎయిడ్ (చట్టపరమైన సాయం) అందించే స్థాయికి ఎదగాలి. వామపక్ష పార్టీలు తమ సంస్థాగత మొండితనాన్ని వీడి, యువత ఆకాంక్షలకు తగ్గట్టుగా తమ భాషను, శైలిని, ఆచరణను మార్చుకోవాలి. వ్యవస్థను ప్రశ్నించే చైతన్యం చట్టబద్ధంగా ఉన్నంత కాలం, ఏ శ్రద్ధాంజలి ప్రకటనలూ పని చేయవు.

ఇక విశ్లేషకులు రాస్తున్న 'సంతాప సందేశాలు' వారి తొందరపాటును సూచిస్తున్నాయే తప్ప, ఆ సిద్ధాంతం యొక్క అంతాన్ని కాదు. ఎందుకంటే, ఎక్కడైతే అన్యాయం జరుగుతుందో, అక్కడ ఎర్ర జెండా మళ్ళీ రెపరెపలాడుతుంది. అది పార్టీ రూపంలో కాకపోయినా, ఒక సామాజిక ఆవేదనగా, ఒక ధిక్కార కేకగా వినిపిస్తూనే ఉంటుంది. చరిత్రను గమనిస్తే, ఏ సిద్ధాంతమైనా అంత సులభంగా మరణించదు. ముఖ్యంగా అది ప్రజల ప్రాథమిక హక్కులతో ముడిపడి ఉన్నప్పుడు. జైలు కడ్డీలు గొంతును ఆపలేనప్పుడు, విశ్లేషకుల కలం పోట్లు ఆశను చంపలేవు. అందుకే తీర్పు చెప్పాల్సింది విశ్లేషకులు కాదు.. కాలం..!



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# తన కర్తవ్యాన్ని మరచిపోయిన గవర్నర్



రాజీవ్ ధావన్ సంజయ్ హెగ్డే
సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు

2026తమిళనాడు శాసనసభ ఎన్నికల తీర్పు నిర్ణయాత్మకమైనది. మొత్తం 234 స్థానాలు కలిగి ఉన్న శాసనసభలో తొలిసారిగా ఎన్నికలలో పోటీ చేసిన తమిళగ వెట్రి కళగం (టివికె) 108 స్థానాలతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. అధికారంలో ఉన్న ద్రవిడ మున్నేత్ర కళగం (డిఎంకె)59 స్థానాలకే పరిమితమైంది. ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేత్ర కళగం (ఎఐఎడిఎంకె) 47 స్థానాలను గెలుచుకుంది. తమిళనాడును 59 సంవత్సరాలుగా నిరంతరాయంగా పాలించిన రెండు ద్రవిడ పార్టీలను టివికె వ్యవస్థాపకుడు సి.జోసెఫ్ విజయ్ ఓడించారు. ఓటరు తన తీర్పును స్పష్టంగా చెప్పాడు. లోక్‌భవన్ తాను ఎంచుకున్న విషయాలనే విన్నది.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీ నాయకుడిని ఆహ్వానించేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ నిరాకరించారు. దానికి బదులుగా ప్రమాణ స్వీకారానికి ముందే 118 మంది శాసనసభ సభ్యుల (ఎమ్మెల్యేల) నుండి సంతకాలు చేసిన లేఖలను ఆయన డిమాండ్ చేశారు. విజయ్ మూడుసార్లు లోక్‌భవన్‌కు వెళ్లగా, ప్రతిసారీ ఆయనను వెనక్కి పంపారు. చివరి నిమిషంలో విదుతలై చిరుతైగళ్ కచ్చి (విసికె), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) నుండి లభించిన మద్దతుతో చివరికి మద్దతిచ్చే వారి సంఖ్య 121కి చేరింది. అప్పుడు గాని గవర్నర్ దయతో అంగీకరించారు. ప్రమాణ స్వీకారాన్ని మే 10వ తేదీకి ఖరారు చేశారు,మే 13వ తేదీన లేదా అంతకంటే ముందు విశ్వాస తీర్మానం కోరాలని గవర్నర్ ముఖ్యమంత్రిని ఆదేశించారు. ఈ ప్రక్రియలోని ప్రతి అడుగు రాజ్యాంగ విరుద్ధం. ఈ పొరపాట్లు చిన్నవి కావు. అవి రాష్ట్రాలలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదులకు సంబంధించినవి.

### గవర్నర్ చేయాల్సిందేమిటి?

ఎన్నికల మరుసటి రోజున గవర్నర్ విధి పరిమితమైనది, నిర్దిష్టమైనది. సభ విశ్వాసాన్ని పొందగల అత్యంత సమర్థుడైన వ్యక్తిని గుర్తించి, ఆ వ్యక్తిని ప్రమాణ స్వీకారం చేయడానికి ఆహ్వానించాలి. ఆయన రిటర్నింగ్ అధికారి కాదు. ఆయన లెక్కల మాస్టర్ కాదు. కాబోయే ముఖ్యమంత్రిని ప్రమాణ స్వీకారం చేయడానికి అనుమతించే ముందు, సంతకం చేసిన హాజరు పట్టికను సమర్పించాలని డిమాండ్ చేసే అధికారం ఆయనకు లేదు.

1988 నాటి సర్కారియా కమిషన్, 2002 నాటి వెంకటాచలయ్య కమిషన్, 2010 నాటి పూంచి కమిషన్ ప్రాధాన్యతా క్రమం విషయంలో ఏకగ్రీవంగా ఉన్నాయి. ఎన్నికలకు ముందు ఏర్పడిన అతిపెద్ద కూటమికి మొదటి స్థానం లభిస్తుంది. స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చే అతిపెద్ద పార్టీకి ఆ తర్వాతి స్థానం వస్తుంది. తాను ఎవరికి ఓటు వేస్తున్నాడో ఓటరుకు ముందే తెలిసి ఉన్నందున ఎన్నికలకు ముందు ఏర్పడే కూటములకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ క్రమాన్ని గోవా, మణిపూర్, కర్నాటక, మహారాష్ట్ర, తాజాగా తమిళనాడులో ఉల్లంఘించడం జరిగింది. ఈ ఉల్లంఘనలు కచ్చితంగా ఏకపక్షంగా ఉన్నాయి.

2017లో గోవాలో 40 స్థానాలు ఉన్న సభలో 17 స్థానాలు ఉన్న కాంగ్రెస్ పార్టీని కాదని,13 స్థానాలు ఉన్న భారతీయ జనతా పార్టీ (బిజెపి)ని గవర్నర్ మృదులా సిన్హా ఆహ్వానించారు. అదే సంవత్సరంలో మణిపూర్‌లో 28 స్థానాలు ఉన్న కాంగ్రెస్ కంటే 21 స్థానాలు ఉన్న బిజెపికి ప్రాధాన్యత లభించింది.

2018లో కర్నాటకలో (224స్థానాల సభ)115 స్థానాలతో ఉన్న కాంగ్రెస్–జనతా దళ్(ఎస్) ఎన్నికల అనంతర కూటమి నుండి వచ్చిన లిఖితపూర్వక లేఖను విస్మరించి, గవర్నర్ వజూభాయ్ వాలా 104 స్థానాలు కలిగిన బిజెపిని ఆహ్వానించి, మెజారిటీ నిరూపణకు 15 రోజుల గడువు ఇచ్చారు. ఈ సందర్భాలన్నింటిలోనూ గవర్నర్ విచక్షణాధికారాన్ని విస్తృతంగా అన్వయించడం వల్ల బిజెపి లబ్ధి పొందింది. తమిళనాడులో నేరుగా పోటీ ఇవ్వలేని బిజెపి, కేంద్రం ప్రాధాన్యతనిచ్చిన ప్రాంతీయ భాగస్వామి దారుణంగా ఓడిపోయినప్పటికీ, ఈ సిద్ధాంతం అకస్మాత్తుగా సంకుచితంగా మారిపోయింది. అసలు ఆహ్వానం పంపడానికంటే ముందే సంపూర్ణ మెజారిటీకి రుజువు కావాలని ఇక్కడ గవర్నర్ డిమాండ్ చేశారు. ఇది సూత్రం కాదు. ఇది వివేకం ముసుగులో ఉన్న పక్షపాతం.

### మైనారిటీ ప్రభుత్వాలు కూడా ...

భారత పార్లమెంటరీ విధానంలో మైనారిటీ ప్రభుత్వాలు సర్వసాధారణమనే విషయాన్ని గవర్నర్ మరిచిపోయినట్లున్నారు. 1996 మే 16న మెజారిటీ లేని బిజెపికి చెందిన అటల్ బిహారీ వాజ్‌పేయి చేత రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ప్రమాణ స్వీకారం చేయించి, ఆయనకు ఎన్నడూలేని బల నిరూపణకు 13 రోజుల గడువు ఇచ్చారు. ఆయన మే 28న ఓటింగ్‌ను ఎదుర్కోకుండానే రాజీనామా చేశారు. ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించకూడదని ఎవరూ సూచించలేదు. పి.వి. నరసింహారావు మైనారిటీ కాంగ్రెస్ ప్రభుత్వానికి నాయకత్వం వహించి ఐదేళ్లపాటు పాలించారు. 1993 జూలైలో అవిశ్వాస తీర్మానం నుండి ఒకే ఒక్క ఓటు తేడాతో బయటపడ్డారు. హెచ్.డి. దేవెగౌడ, ఐ.కె. గుజ్రాల్ కేంద్రంలో మైనారిటీ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలకు నేతృత్వం వహించారు. 2004లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మన్మోహన్ సింగ్ తొలి మంత్రివర్గం వెలుపలి నుంచి వచ్చిన మద్దతుతో పూర్తి పదవీకాలం కొనసాగిన ఒక మైనారిటీ ప్రభుత్వం.

> 2018లో కర్నాటకలో (224స్థానాల సభ)115 స్థానాలతో ఉన్న కాంగ్రెస్–జనతా దళ్(ఎస్) ఎన్నికల అనంతర కూటమి నుండి వచ్చిన లిఖితపూర్వక లేఖను విస్మరించి, గవర్నర్ వజూభాయ్ వాలా 104 స్థానాలు కలిగిన బిజెపిని ఆహ్వానించి, మెజారిటీ నిరూపణకు 15 రోజుల గడువు ఇచ్చారు. ఈ సందర్భాలన్నింటిలోనూ గవర్నర్ విచక్షణాధికారాన్ని విస్తృతంగా అన్వయించడం వల్ల బిజెపి లబ్ధి పొందింది.

రాష్ట్రపతి భవన్/లోక్‌భవన్‌లో ముందుగా సంతకాలు సమర్పించడం ఎన్నటికీ రాజ్యాంగ పరీక్ష కాదు. ఏకైక పరీక్షా వేదిక సభ మాత్రమే. అవిశ్వాస తీర్మానంలో ఓడిపోనంత కాలం ప్రభుత్వం కొనసాగుతుంది. ఆర్టికల్ 164(2), దాని నుండి ఉద్భవించే సంప్రదాయం సారాంశం ఇదే.

ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు విజయ్ మెజారిటీ సభ్యుల సంతకాలతో కూడిన లేఖలను సమర్పించాలన్న గవర్నర్ డిమాండ్ కొత్తగా సృష్టించింది. రాజ్యాంగంలోని ఏ నిబంధనలో కూడా అలాంటి అవసరం గురించి లేదు. ఏ కమిషన్ కూడా దానిని సిఫార్సు చేయలేదు. ఏ గత ఉదాహరణ కూడా దీనిని సమర్థించదు. ప్రభుత్వ ఏర్పాటు గురించి విజయ్ వాదనను సవాలు చేయాలనుకున్న ఎవరైనా సరే సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి స్వేచ్ఛ ఉండేది. అప్పుడు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజలు చూస్తుండగా, అధికారికంగా ఓటు వేసి ఉండేవారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఇలాగే పనిచేయాలి.

మే 13వ తేదీన లేదా అంతకంటే ముందే విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలన్న ఆదేశం కూడా అంతే అభ్యంతరకరమైనది. సంప్రదాయం ప్రకారం, కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి సభ మొదటి సమావేశంలో ప్రసంగిస్తారు. ఆ ప్రసంగంపై చర్చ జరుగుతుంది, సాధారణ క్రమంలో ప్రభుత్వ మెజారిటీని పరీక్షిస్తారు. దీనిని 72 గంటల్లోకి కుదించడమంటే, ఫిరాయింపుల నిరోధక చట్టం నియంత్రించాలని భావించిన దానినే తిరిగి ఆహ్వానించడమే.

మూడు రోజుల గడువు అనేది అసంతృప్త శాసనసభ్యులకు, వారితో బేరసారాలు జరపడానికి సిద్ధంగా ఉన్నవారికి ఒక సంకేతాన్ని ఇస్తుంది. బేరసారాలకు అవకాశం, అది స్వల్పకాలమే ఉంటుంది. ఇది, ఈ దేశం తరచుగా చూస్తున్నటువంటి రిసార్ట్ రాజకీయాలకు, గవర్నర్ స్వయంగా తన స్వదస్తూరితో రాసిన ఒక ఆహ్వానం.

2018 నాటి కర్నాటక ఉదంతం ఈ విషయాన్ని నిస్సందేహంగా స్పష్టం చేసింది. ఈ విషయాన్ని అర్ధరాత్రి విచారించిన భారత సుప్రీంకోర్టు మెజారిటీ నిరూపణకు 15 రోజుల గడువు ఇవ్వడం అనేది పథకం ప్రకారం ఫిరాయింపులకు ఆహ్వానం పలకడమేనని తీర్పు ఇచ్చింది. అప్పుడు దానికి పరిష్కారంగా, ఆ కాలపరిమితిని ఒక్క రోజుకు కుదించాలని సూచించింది. ఆ పరిష్కారం తగినంత సంఖ్యాబలం లేని పార్టీని తప్పుడు పద్ధతిలో ఆహ్వానించిన ఒక గవర్నర్‌కు అనుగుణంగా రూపొందించబడింది. ప్రభుత్వ ఏర్పాటు చేస్తామని మద్దతు లేఖలను సమర్పించిన అతిపెద్ద పార్టీ, అధికారం చేపట్టిన 72 గంటలలోపు తన మెజారిటీని నిరూపించుకోవాలని దీన్నొక సిద్ధాంతంగా దిగజార్చలేము.

### సుప్రీంకోర్టు స్పష్టంగా ఏమి చెప్పాలి?

ప్రభుత్వ ఏర్పాటులో గవర్నర్ విచక్షణాధికారంపై స్పష్టమైన చట్టాన్ని రూపొందించాలని చెప్పటానికి ఎస్.ఆర్.బొమ్మై (1994), రామేశ్వర్ ప్రసాద్ (2006), కర్నాటక ఆర్డర్ –2018లలో సుప్రీంకోర్టుకు అనేక అవకాశాలు వచ్చాయి. ప్రతిసారీ, అది కొంత మేరకే ముందుకు వెళ్ళింది. ఇప్పుడు పూర్తి స్థాయిలో ముందుకు వెళ్లాల్సిన సమయం వచ్చింది.

మూడు ప్రతిపాదనలను పరిష్కరించాలి. మొదటిది, సభ విశ్వాసాన్ని పొందగలిగిన వ్యక్తిని గుర్తించడం గవర్నర్ కర్తవ్యం. సర్కారియా, వెంకటాచలయ్య, పూంచి కమిషన్లు నిర్దేశించిన ప్రాధాన్యతా క్రమాన్ని ఆయన అనుసరించాలి.ప్రమాణ స్వీకారానికి ముందు సంపూర్ణ మెజారిటీకి సంబంధించిన రుజువును కోరే అధికారం గవర్నర్‌కు లేదు. రెండవది, ఏ ఇతర ప్రభుత్వంలాగే మైనారిటీ ప్రభుత్వం కూడా సభా పరీక్షలో మాత్రమే కూలిపోతుంది. మూడవది, కొత్త అసెంబ్లీ మొదటి సమావేశంలో సాధారణ పద్ధతిలో ప్రభుత్వ మెజారిటీని పరీక్షించే సంప్రదాయం స్థానంలో ప్రతిపక్షం కోరుకుంటే అవిశ్వాస తీర్మానాన్ని తీసుకువచ్చే నిబంధనను ప్రవేశపెట్టాలి.

విశ్వాస తీర్మానానికి ఆదేశించడం తీవ్ర వ్యతిరేకం. మైనారిటీ ప్రభుత్వాలు పుట్టక ముందే గతిస్తాయి. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ఒక ప్రభుత్వాన్ని ఎందుకు కూలదోయాలో అనే దానిపై చర్చ ఏకైక ప్రజాస్వామ్య మార్గం.

ప్రమాణ స్వీకారం చేసిన ప్రభుత్వానికి, తన పాలనా పనితీరుపై చర్చించి, సమర్థించుకునేందుకు సభలో అనుమతించాలి. కొత్తగా ఏర్పడిన సభలో, పార్టీ ఫిరాయింపులను అరికట్టడానికి సభను రద్దు చేస్తామనే భయమే అత్యంత బలమైన క్రమశిక్షణ. ఐదేళ్ల పదవీకాలం ఇప్పుడే గెలుచుకున్న ఎమ్మెల్యే, మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు సాహసించరు. ఒకవేళ ప్రభుత్వం స్థిరపడటానికి, సాధారణ పద్ధతిలో సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి, పాలించడానికి అనుమతిస్తే, దానిని కూలదోయడానికి అయ్యే మూల్యం ఎంతో పెరుగుతుంది.

భారత గవర్నర్లు భారత రాష్ట్రపతి అభీష్టం మేరకు నియమించబడతారు. వారు ఎన్నుకోబడరు. వారు ఎవరి అభీష్టం మేరకు పదవిలో ఉన్నారో, ఎవరి ఆదేశాలను గౌరవించాలో గుర్తుంచుకోవాలని దేశం కనీసంగా వారి నుంచి కోరుకుంటుంది. ఆ అభీష్టం కేంద్ర ప్రభుత్వానిది కాదు.. ఓటరుది..

('ది హిందూ సౌజన్యంతో.. తేదీ:11–05–2026)


# డిజిటల్ మాయాజాలం.. అప్రమత్తతే అజేయ కవచం!

నేటి ఆధునిక ప్రపంచంలో మనిషి ఉనికిని స్మార్ట్‌ఫోన్ శాసిస్తోంది. తెల్లవారుజామున నిద్రలేచింది మొదలు రాత్రి కళ్లు మూసే వరకు మనం డిజిటల్ ప్రపంచంతోనే మమేకమై ఉంటున్నాం. బ్యాంకింగ్, షాపింగ్, విద్య, వైద్యం.. ఇలా అన్నీ అరచేతిలోకి వచ్చేయడం సౌకర్యవంతంగానే ఉన్నా, మరోవైపు మన కంటికి కనిపించని ప్రమాదం పొంచి ఉంది. టెక్నాలజీ ఎంతగా విస్తరిస్తోందో, దానికి సమాంతరంగా సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయి. ముఖం తెలియని వ్యక్తి మన గదిలోకి రాకుండానే మన సొమ్మును, వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే ఈ 'డిజిటల్ దోపిడీ' పట్ల అప్రమత్తంగా ఉండటం నేటి తక్షణ అవసరం.

**సైబర్ నేరాలు: కొత్త రూపాల్లో పాత మోసాలు**

గతంలో దొంగతనాలు ఇళ్లలో జరిగేవి, కానీ నేడు జేబులోని ఫోన్ ద్వారా జరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు సామాన్యులను బురిడీ కొట్టించడానికి ఎంచుకుంటున్న మార్గాలు విస్తుగొలుపుతున్నాయి. 'మీ కెవైసి ముగిసిపోయింది', 'మీకు భారీ లాటరీ తగిలింది', 'విద్యుత్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తాం' వంటి నకిలీ సందేశాలతో భయపెట్టో, ఆశ చూపించో దోచుకుంటున్నారు. ఇటీవల 'డిజిటల్ అరెస్ట్' పేరిట సాక్షాత్తూ పోలీసులమని నమ్మించి వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయాందోళనలకు గురిచేసి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఉదంతాలు మనం చూస్తున్నాం. ఏ ప్రభుత్వ సంస్థ లేదా బ్యాంక్ అధికారి ఫోన్ ద్వారా మీ వ్యక్తిగత పిన్ నంబర్లు లేదా ఒటిపిలు అడగరనే ప్రాథమిక అవగాహన ప్రతి ఒక్కరికీ ఉండాలి.

సోషల్ మీడియా అనేది నేడు సమాచార వేదిక కంటే వినోదపు వ్యసనంగా ఎక్కువగా మారుతోంది. ముఖ్యంగా 'రీల్స్' సంస్కృతి యువతను, విద్యార్థులను ఒక మాయా ప్రపంచంలో బందీ చేస్తోంది. నిరంతరం స్క్రోలింగ్ చేయడం వల్ల మెదడులో డోపమైన్ విడుదలయ్యి, అది ఒక రకమైన వ్యసనంగా మారుతుంది. దీనివల్ల ఏకాగ్రత లోపించడం, నిజ జీవిత బంధాలకు దూరమవ్వడం, చివరికి ఒంటరితనం వంటి మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడే మనకు 'డిజిటల్ డిటాక్స్' అవసరం కనిపిస్తుంది. రోజులో కనీసం రెండు గంటల పాటు ఫోన్‌ను పక్కన పెట్టడం, భోజనం చేసేటప్పుడు గ్యాడ్జెట్స్ వాడకపోవ డం, ప్రకృతితో సమయం గడపడం వంటి మార్పులు మన మానసిక ప్రశాంతతను కాపాడతాయి.



**డేటా ప్రైవసీ: మన సమాచారం మనదేనా?**

మనం ఇంటర్నెట్‌లో ఒక వస్తువు కోసం వెతికితే, కాసేపటికే సోషల్ మీడియాలో దానికి సంబంధించిన ప్రకటనలు కనిపిస్తాయి. దీనినే 'డేటా ట్రాకింగ్' అంటారు. మనం ఉచితంగా వాడుతున్న అనేక యాప్స్ మన లొకేషన్, కాంటాక్ట్స్, వ్యక్తిగత ఇష్టాఇష్టాలను నిరంతరం సేకరిస్తూనే ఉన్నాయి. 'డేటానే నేటి తరం ఇంధనం' అన్నట్లుగా, మన వ్యక్తిగత సమాచారం కార్పొరేట్ కంపెనీల చేతుల్లో వ్యాపార వస్తువుగా మారుతోంది. డీప్‌ఫేక్ వంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా ఒకరి ముఖాన్ని మరొకరి ముఖంతో మార్చ డం వంటివి నేడు అతిపెద్ద భద్రతా సవాళ్లుగా మారాయి. మహిళల ఫోటోలను దుర్వినియోగం చేస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. మన సమాచారం ఎంతవరకు భద్రం అనేది మనం ఇచ్చే 'పర్మిషన్ల' మీద ఆధారపడి ఉంటుంది.

**రక్షణ కవచం: ఏం చేయాలి?**

సైబర్ దాడుల నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించాలి:

**పాస్‌వర్డ్ భద్రత:** మన ఫోన్, బ్యాంక్ ఖాతాలకు సులభమైన పాస్‌వర్డ్‌లు కాకుండా, అక్షరాలు, అంకెలు, గుర్తులు కలిపి కష్టమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి. వీలైతే 'టూఫ్యాక్టర్ అథెంటికేషన్' (2FA) ఎనేబుల్ చేసుకోవాలి.

**అపరిచిత లింకులు:** వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులను పొరపాటున కూడా క్లిక్ చేయకూడదు.

**పబ్లిక్ వైఫై:** రైల్వే స్టేషన్లు లేదా హోటళ్లలో దొరికే ఉచిత వైఫై ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు చేయకూడదు.

**సైబర్ హెల్ప్‌లైన్:** ఒకవేళ మోసపోయామని గుర్తిస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా కేంద్ర ప్రభుత్వ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన మొదటి గంట లో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

సాంకేతికత అనేది ఒక వరమే అయినా, అది బాధ్యతాయుతంగా వాడనప్పుడు శాపంగా మారుతుంది. చదువుకున్న వారే ఎక్కువగా ఈ సైబర్ నేరాల బారిన పడటం విచారకరం. డిజిటల్ అక్షరాస్యతతో పాటు డిజిటల్ క్రమశిక్షణ కూడా అలవరుచుకోవాలి. సైబర్ నేరగాళ్లు మన బలహీనతలను ఆయుధంగా చేసుకుంటారు, కాబట్టి మనం మన విజ్ఞానాన్ని కవచంగా మార్చుకోవాలి. విజ్ఞానంతో కూడిన అప్రమత్తతే సైబర్ మాయాజాలానికి విరుగుడు.

కాళేశ్వరం కృష్ణమూర్తి,9705196097.

# విదేశీ ఉద్యోగాలకు తెలంగాణ యువతకు
# టామ్‌కామ్ దిక్సూచి

- జర్మనీ సహా పలు దేశాల్లో ఉపాధి అవకాశాలకు ప్రత్యేక శిక్షణ
- జూన్ 10 నుంచి మందమర్రిలో జాబ్ ట్రైనింగ్ తరగతులు ప్రారంభం
- మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మందమర్రి :** తెలంగాణ యువతను ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేయడమే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి,గనుల శాఖ మంత్రి డా.జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. జర్మనీ సహా విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి, భాషా శిక్షణ, వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను టామ్‌కామ్ ద్వారా విస్తృతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మందమర్రిలో జూన్ 10, 2026 నుంచి జర్మనీ జాబ్ ట్రైనింగ్ తరగతులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. బుధవారం మంచిర్యాల జిల్లా మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జర్మనీ జాబ్ ట్రైనింగ్ క్యాంప్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. విదేశీ ఉద్యోగాల కోసం శిక్షణ పొందే అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు, అనుభవజ్ఞులైన శిక్షకులు మరియు తగిన బడ్జెట్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు టామ్‌కామ్ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా విదేశీ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న యువతతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఐటిఐ, ఎటిసి,అప్రెంటిస్‌షిప్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. జర్మనీతో పాటు ఇజ్రాయెల్, గ్రీస్, జపాన్ వంటి దేశాల్లో కూడా నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణకు చెందిన యువతలో ఒక బృందం ఇజ్రాయెల్‌లో నిర్మాణ రంగ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిందని, వారికి త్వరలోనే ఆకర్షణీయమైన వేతనాలతో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. విదేశీ ఉపాధి అవకాశాల కల్పనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో టామ్‌కామ్‌కు సమృద్ధిగా నిధులు కేటాయించడంతో శిక్షణ, నియామక కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. విదేశీ ఉద్యోగాల కోసం ప్రైవేట్ ఏజెన్సీలను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టామ్‌కామ్ ద్వారానే సురక్షితమైన ఉద్యోగ అవకాశాలు పొందాలని యువతకు సూచించారు. ఉద్యోగ అవకాశాలు ఖరారైన తర్వాత మాత్రమే అభ్యర్థులను విదేశాలకు పంపుతున్నామని స్పష్టం చేశారు.తన జర్మనీ పర్యటన సందర్భంగా అక్కడ పనిచేస్తున్న తెలంగాణ యువతను కలుసుకుని వారి అనుభవాలు, పని పరిస్థితులు,ఎదురవుతున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నానని మంత్రి తెలిపారు. మేసన్రీ, ఫార్మసీ, హాస్పిటాలిటీతో పాటు పలు సాంకేతిక రంగాల్లో ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉందన్నారు. జర్మన్ భాషపై పట్టు సాధిస్తే జర్మనీలో మరింత మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, అందుకోసం టామ్‌కామ్ ప్రత్యేక జర్మన్ భాషా శిక్షణను కూడా అందిస్తున్నదని చెప్పారు.ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ,పీజీ వరకు విద్యార్హతలు కలిగిన యువతకు విదేశాల్లో విస్తృత అవకాశాలు అం దుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక సింగరేణి జిఎం ఎన్ రాధాకృష్ణ,ఎమ్మార్వో సతీష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

నీట్ ప్రశ్నా పేపర్ లీక్‌పై

## న్యాయ విచారణ జరిపించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి


**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ ప్రశ్నపత్రం లీక్‌తో ప్రధాని మోదీ ప్రభుత్వం తలదించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నీట్ పేపర్ లీక్‌తో వేలాది మంది విద్యార్థుల జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సిబిఐతో కాకుండా న్యాయ విచారణ జరిపితే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. దేశంలో పరిపాలన బాగుందని చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం నీట్ ప్రశ్నపత్రం పేపర్ లీకేజీతో అభాసుపాలైందని తెలిపారు. రాజస్థాన్ తదితర ప్రాంతాలలో పేపర్ లీకేజీ చేసి వందల కోట్ల రూపాయల డబ్బులు సంపాదించుకున్నారని, దీని వెనుక ఉన్న వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

### పోక్సో కేసును వేగవంతం చేయాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసును నీరుకార్చకుండా విచారణను వేగవంతం చేయాలని చాడ వెంకట రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ కేసు ప్రత్యేక విచారణ జరిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం భగీరథ్‌ను పట్టుకోవడంలో ఎందుకు వైఫల్యం చెందుతున్నారని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలలో ఉన్న వ్యక్తులు కుటుంబ సభ్యుల ప్రవర్తనపై కూడా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

# ఇప్పటికీ కమ్యూనిస్టులు సజీవంగా ఉన్నారు

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో కమ్యూనిస్టులు అయిపోయారనుకుంటే పొరపాటేనని, ఇప్పటికీ కమ్యూనిస్టులు సజీవంగా ఉన్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో టిడిపి, బిజెపి, జనసేన కలిసి పోటీ చేసినా కాంగ్రెస్‌కు ఏలాంటి ఇబ్బంది లేదని, మూడు పార్టీలు కలిసి పోటీ చేసినా 30 శాతం ఓట్లు దాటవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అని, ఆయన నికార్సైన కాంగ్రెస్ నాయకుడని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు కేసులో ఎలాంటి జాప్యం లేదని, ఆయనను తప్పించే అవసరం కాంగ్రెస్‌కు లేదని మహేష్ కుమార్ స్పష్టం చేశారు. పోక్సో చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ, బండి సంజయ్ కొడుకుపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. బాధితురాలికి న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బండి సంజయ్ కొడుకు పరారయ్యారని పోస్టర్ ఎవరు వేశారో, ఎవరు తీసివేశారో తెలియదని పేర్కొన్నారు. ప్రజలు ప్రతిపక్ష పాత్రను కె.చంద్రశేఖరరావుకు ఇచ్చారని, కానీ ఆయన ఫామ్ హౌజ్‌కే పరిమితం అయ్యారని, అయినా తాము ప్రతిపక్ష నేతను గౌరవిస్తున్నామన్నారు. అదే ఆనాడు దళితుడైన భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉంటే కెసిఆర్ ఓర్చుకోలేక తమ పార్టీ ఎంఎల్‌ఎలను కొనుగోలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశించిన బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఇది సరైందికాదని హితవు పలికారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా పంటలు పండాయని, దీనితో పంట కొనుగోలు ప్రక్రియ కొంత ఆలస్యమైందని తెలిపారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం బెంగాల్ తరహాలో ఇక్కడ కూడా సెక్యులర్ ఓట్లు తొలగించాలని చూస్తున్నారని ప్రజలం తా అప్రమత్తంగా ఉండాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. నరేంద్ర మోదీని తాము ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రధాని రాష్ట్ర పర్యటన నేపథ్యంలో ఆయన రాష్ట్రానికి ఏదో ఇస్తారిని ఆశించామని, కానీ ఏమీ ఇవ్వలేదన్నారు. బిజెపి ఎంపిలకు సోయి లేదని, ప్రధాని వచ్చినప్పుడు తెలంగాణకు కావాల్సింది అడగరా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బిజెపి బలహీనంగా ఉందన్న విషయం మోదీకి అర్థమైనందునే తెలంగాణకు వచ్చారని భావిస్తున్నామని తెలిపారు. అధికారంలో ఉన్న 12 ఏళ్ల నుండి పొదుపు గురించి మోదీ ఎందుకు మాట్లాడలేదని ఆయన నిలదీశారు. ప్రజలు ఎప్పుడూ పొదుపే చేస్తారని, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు కసరత్తు చేస్తోందని, పొదుపు చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని అన్నారు. మంత్రి పదవి కంటే టిపిసిసి అధ్యక్షునిగా సంతోషంగా, గర్వంగా ఉందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

## బండి సంజయ్ కుమారుడిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

ప్రధాని ఆంధ్రాకు పైసలు ప్రకటించి, తెలంగాణకు పొదుపు సూత్రాలు చెప్పిండు : కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోక్సో కేసు నమోదైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోలీసులు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుం డా చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయన ప్రధానితో వేదిక పంచుకోవటం శోచనీయమన్నారు. బడాబాబుల పిల్లలు ఏం చేసినా సరే పోలీసులు చర్యలు తీసుకోరన్న అభిప్రాయం ప్రధాని సభతో ప్రజల్లోకి వెళ్లిందన్నారు. కొందరు ట్విట్స్ చేస్తూ సమస్యను పరిష్కరించినట్లు బిల్డప్ ఇస్తున్నారని, అలాంటి పార్టీ వారు తానేందుకు స్పందించలేదని అడ్డగోలుగా కామెంట్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడపిల్ల విషయం, అందులోనూ మైనర్ విషయంలో స్పందించే ముందు సంయమనం పాటించాలన్నారు. రాజకీయాల్లో లేని బండి సంజయ్ కుమారుడి విషయంలో రాజకీయాలను చేయటం తనకు ఇష్టం లేదని, బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తన అభిప్రాయమన్నారు. ప్రధాని మోదీ తెలంగాణకు మరోసారి మొండి చెయ్యి చూపించారని కవిత విమర్శించారు. తెలంగాణ పర్యటనలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇస్తారని భావించిన మనకు పొదుపు సూత్రాలు చెప్పి, ఆంధ్రాకు పైసలు ఇచ్చి వెళ్లిపోయారని ఆరోపించారు. ప్రధాని పర్యటనలో తెలంగాణకు ఏం ఇవ్వకపోయినా ప్రధాన ప్రతిపక్షం ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు. జనగణనలో కుల గణన కాలంతో పాటు ఉపకులం, ప్రజల సామాజిక స్థితిగతులు తెలుసుకునేలా వివరాలు పొందుపర్చాలని కేంద్రాన్ని కవిత కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబిసి మహిళల సబ్ కోటా ఉండాల్సిందేన్నారు. ఈ నెల 20 నుంచి చేపట్టనున్న జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది అని కవిత అన్నారు. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకై పరీక్ష రద్దు చేయటంపై కవిత మండిపడ్డారు. పది రూపాయల డైపర్ కూడా లీక్ కావటం లేదని, అలాంటి నీట్ పేపర్ ఎలా లీక్ అవుతుందని ఆమె ప్రశ్నించారు.

### రైల్వే కోర్టుకు హాజరైన కల్వకుంట్ల కవిత

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో రైల్ రోకో చేసిన కేసులో కల్వకుంట్ల కవిత బుధవారం రైల్వే కోర్టుకు హాజరయ్యారు. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో గల సికింద్రాబాద్ సెకండ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేయడంతో వ్యక్తిగతంగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణ జూలై 17న నిర్వహిస్తామని మేజిస్ట్రేట్ ప్రకటించారు.

## ‘వారోత్సవాలు’ విద్యా వ్యవస్థలో మార్పుకు నాంది

జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రిషికేష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, మార్పు తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం ప్రారంభించిన ‘విద్యా వారోత్సవాలు’ కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రిషికేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విద్యా అభివృద్ధికి రూ.1,700 కోట్లు కేటాయించాలని తీసుకున్న నిర్ణయం, ప్రభుత్వం ప్రతి పిల్లవాడికి నాణ్యమైన, సమగ్ర విద్య అందించాలనే దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన అనేక విద్యా సంస్కరణలను సంస్థ అభినందించిందని గుర్తుచేశారు. విద్యా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జవహర్ బాల్ మంచ్ తెలంగాణ సక్రియంగా పాల్గొంటుందని ప్రకటించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజంలోని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు, సాక్ష్యాలు, సూచనలు, సలహాలు సేకరించి, వాటిని సంకలనం చేసి ప్రభుత్వానికి సమర్పించి, తెలంగాణ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో తన వంతు కృషి చేస్తుందని తెలిపారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు

నేడు, రేపు నామినేటెడ్ విధానానికి వ్యతిరేకంగా ఎఐకెఎస్ నిరసనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నెల 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. రాష్ట్రంలోని 908 సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించాలని గత నెల 23న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం దారుణమని బాగం హేమంతరావు, పశ్యపద్మ విమర్శించారు. ప్రతి సహకార సంఘంలో 13 మంది సభ్యుల పేర్లను పాలక పార్టీ కాంగ్రెస్ వ్యక్తులను అధ్యక్ష, డైరెక్టర్ పదవులలో నామినేట్ చేసుకోవడానికి అన్ని ప్రాంతాల నుండి పేర్లను సేకరించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. నామినేట్ వ్యవస్థకు పూర్తిస్థాయి చట్టబద్ధత లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ్‌హెచ్ ప్రకారం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

## బక్రీద్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



డిజిపి సి.వి. ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో బక్రీద్‌ను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టం చేశారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్‌పిలతో డిజిపి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రెటరీ కె.ఇలంబర్తి తదితరులతో కలిసి డిజిపి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు ఈ నెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఎపి సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డిజిపి వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఎయుడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శిశ్రీ కె. ఇలంబర్తి, డైరెక్టర్ గోపి, శాంతి భద్రతల డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డిఐజి భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్‌పిలు, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

### హెడ్ కానిస్టేబుల్ కూతురును సన్మానించిన డిజిపి



ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ కు ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కూతురు చల్లా యామినిని డిజిపి సివి ఆనంద్ బుధవారం తన కార్యాలయంలో సన్మానించారు. సూర్యాపేట జిల్లాలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న చల్లా యాదగిరి కుమార్తె యామిని ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని ఎంసిఇఎంఇ లో ఆడిటర్ గా పనిచేస్తున్నారు. ఇటీవల వెలువడిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో ఆమెకు 119 ర్యాంక్ లభించింది. శాంతి భద్రతల డిజిపి మహేష్ ఎం భగవత్ మెంటార్ గా వ్యవహరించారు.

## బండి భగీరథ కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం

- ఇది కుల సమస్య కాదు, చట్టం, శాంతిభద్రతల సమస్య
- బండి సంజయ్, ఆయన కుమారుడు చట్టానికి, పోలీసులకు సహకరించాలి
- బాధితురాలి పక్షాన బిఆర్‌ఎస్ పార్టీ నిలుస్తుంది : గంగుల కమలాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనందున చట్టానికి, పోలీసులకు బండి సంజయ్, ఆయన కుమారుడు సహకరించాలని రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బండి భగీరథ కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం జరుగుతోందని, ఇది కుల సమస్య కాదని, చట్టం, శాంతిభద్రతల సమస్య అని అన్నారు. పోక్సో కేసు విషయంలో బాధితురాలి పక్షాన బిఆర్‌ఎస్ పార్టీ నిలుస్తుందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో మంగళవారం బండి సంజయ్ బెదిరింపు ధోరణిలో మాట్లాడారని విమర్శించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సంఘటన జరిగిన తర్వాత కూడా ప్రధాని మోదీ బండి సంజయ్‌ను తన పక్కన కూర్చోబెట్టుకున్నారని విమర్శించారు. మహిళల పక్షాన మాట్లాడే మోదీ, తెలంగాణ పర్యటనలో ఈ ఘటనపై ఎందుకు స్పందించలేదని, బండి సంజయ్‌ను ఎందుకు మందలించలేదని నిలదీశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో బండి భగీరథ కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కరీంనగర్‌లో దొంగతనాలు, ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయాలపై దాడులు జరిగినా పోలీసుల నుంచి చర్యలు కనిపించడంలేదని విమర్శించారు. ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి ఒక్కటయ్యాయని ఆరోపించారు. ఫోక్సో కేసు నమోదు అయితే ప్రతిసారి సిట్ వేస్తారా? అని ప్రశ్నించారు. ఎంఎల్‌సి శంభీపూర్ రాజు మాట్లాడుతూ బండి సంజయ్ మాట్లాడిన భాషను సామాన్య ప్రజలు కూడా ఉపయోగించరని విమర్శించారు. అంతు చూస్తా అని బండి సంజయ్ మాట్లాడితే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ తటస్థంగా వ్యవహరించాలని డిజిపికి సూచించారు.

# కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే దోపిడీ విముక్తికి మార్గం

- మోదీ విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరం
- ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే దోపిడి విముక్తికి మార్గం, మోదీ విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరమని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, పోలిట్ బ్యూరో సభ్యులు కుల్దీప్ సింగ్ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసిపిఐ(యు) వ్యవస్థాపకులు, అమరజీవి మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా నర్సంపేటలోని నెక్కొండ రోడ్డు సర్కిల్ నుంచి సిటిజన్ క్లబ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి మద్ది కాయల ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మోదీ అనుసరిస్తున్న విధానాలు ప్రజల ను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని ఈ క్రమంలో మత వైరుధ్యాలు నియంతృత్వాన్ని పెంచి పోషిస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాలకుల దోపిడి విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తులు ఐక్యంగా ఉద్యమిస్తే తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. ఆదిశలో వర్గ సామాజిక పోరాటాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. అరుణోదయ విమలక్క, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నాగయ్య, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు గంగాధర్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవిలు మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధుడని చట్టసభలకు వన్నె తెచ్చాడని, రాజకీయ విలువలకు ఆదర్శాలకు త్యాగాలకు నిలువుటద్దంగా నిలిచాడన్నారు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను పాఠ్యాంశంలో చేర్చి వారి గుర్తుగా స్మారక చిహ్నాలు మ్యూజియం ఏర్పాటు చేయాలని, ఓంకార్ పేరుతో నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి, స్టేడియంకు నర్సంపేట నుంచి వరంగల్ ప్రధాన రహదారికి నామకరణం చేయాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై కాంస్య విగ్రహాలు పెట్టించాలని, విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, వస్కుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, ఎన్‌రెడ్డి హంసరెడ్డి, కన్నం వెంకన్న, మంద రవి, ఎస్‌కె నజీర్, తుకారాం నాయక్, గేయ రచయిత యోచన, రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ, కుసుంబా బాబురావు, నర్ర ప్రతాప్, కనకం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం : కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్ వ్యవహారంలో బాధితురాలికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపబోదని కాంగ్రెస్ మహిళా నేతలు స్పష్టం చేశారు. బాధితురాలిని స్వయంగా కలిసి వాస్తవాలు తెలుసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నెరేళ్ల శారద, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బాధితురాలికి న్యాయం చేయడానికి చట్టపరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉందన్నారు. బాధితురాలి కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితుల పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.

## లీకేజీ కేంద్ర వైఫల్యమే : బిఆర్‌ఎస్‌వి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. పరీక్షను రద్దు చేసి తిరిగి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో బుధవారం లోక్ భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా నీట్ పేపర్ లీక్ ఘటన జరిగిందన్నారు. పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని విమర్శించారు. పేపర్ లీక్ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేం ద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రం లీక్ వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TGMSIDC డివిజన్, వరంగల్.
ఇ.నెం. 2-11-324/1, ప్రభుత్వ సిడి & టిబి హాస్పిటల్ ప్రక్కన, హనుమకొండ - 506009
ఫోన్ నెం. 0870-2455769, ఇమెయిల్ ఐడి: eetsmsidcwgl@gmail.com
టెండర్ నోటీస్ నెం. 2/EE/TGMSIDC/WGL/2026-27, తేది: 13.05.2026.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా కింది పనుల కోసం టెండర్లు ఆహ్వానించడమైనవి: 1) హనుమకొండ జిల్లాలోని హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో RICU భవనానికి మరమ్మతులు మరియు నవీకరణలు. 2) జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురిటి గది నిర్మాణం. ఇతర వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
TGMSIDC డివిజన్, వరంగల్.

తెలంగాణ మెడికల్ సర్వీస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
3వ అంతస్తు, DM&HS క్యాంపస్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్-95
ఫోన్ నెం. 040-40032888, ఇమెయిల్: cetsmsidc@gmail.com
టెండర్ నోటీస్ నెం. 02/TGMSIDC/Civil/2026-27, తేది: 12.05.2026.
హైదరాబాద్‌లోని IDA నాచారం వద్ద గల తెలంగాణ FOODS యొక్క GAIN ప్లాంట్‌కు విద్యుదీకరణ సౌకర్యాన్ని కల్పించే నిమిత్తం, ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి. ఇతర వివరాలను మా వెబ్‌సైట్‌లు http://www.tgmsidc.telangana.gov.in మరియు https://tender.telangana.gov.in లలో చూడవచ్చు.
సం/- (12.05.2026)
మేనేజింగ్ డైరెక్టర్
DIPR R.O. No. : 2351-PP/CL/ADVT/2026-27, Date: 13-05-2026



## కడపర్తిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు కల్పించేందుకు నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని సాయిబాబా ఆలయ మందిరంలో నిర్వహించిన విద్యారంగంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఈఓ బిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు ఎంఈఓ మేక నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐసెట్ 2026 పరీక్షలు ప్రశాంతం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ఐసెట్ 2026 తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా,పారదర్శకంగా జరిగాయని కన్వీనర్ ఆచార్య అల్వాల రవి తెలిపారు. ఉదయం సెషన్‌లో ప్రశ్నాపత్రం సెట్ కోడ్ ఏను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫసర్ బాలకృష్ణారెడ్డి విడుదల చేశారు. ఈసెషన్‌కు 18,783 మంది నమోదు చేసుకోగా 16,965 మంది హాజరయ్యారు. హాజరు శాతం 90.3 నమోదైంది. మధ్యాహ్న సెషన్‌లో సెట్ కోడ్ ఈని వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. 18,712 మంది నమోదు కాగా 17,122 మంది పరీక్ష రాశారు. హాజరు శాతం 91.5 గా ఉంది. మొత్తం 37,495 మంది విద్యార్థులకు గాను 34,087 మంది హాజరయ్యారు. హాజరు శాతం 90.09గా నమోదైందని కన్వీనర్ తెలిపారు. 69 కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్షలు సాఫీగా సాగాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫసర్ ఇటికాల పురుషోత్తం, సెక్రటరీ ప్రొఫసర్ శ్రీరాం వెంకటేష్, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫసర్ కె.అంజిరెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు



ఎస్‌పి శరత్ చంద్రపవార్

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రైతుల కష్టార్జితమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. బుధవారం మండలంలోని వసుంధర, ఆర్ఎస్‌వీ, అనంతసాయి రైస్ మిల్లులను ఆయనఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యానికి మిల్లర్లు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, 12గంటల్లోపు అన్‌లోడింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తాలు పేరుతో బస్తాకు 2 నుంచి3 కిలోల అదనపు తూకం వేయడం, నాణ్యత పేరుతో ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్‌గా మార్చి క్వింటాల్‌కు రూ.20వరకు కోత విధించడం వంటి అక్రమాలు తన దృష్టికి వచ్చాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీ యజమానులు, హమాలీలు బస్తాకు రూ.2 అదనంగా అడగడం చట్టరిత్యా నేరమన్నారు. ప్రతి మిల్లు వద్ద ఒక పోలీస్ కానిస్టేబుల్ నిఘా ఉంటుందని, రైతులు ఇబ్బంది పడితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐలు ఆదిరెడ్డి, ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో బుధవారం శ్రీ సీతారామ లక్ష్మణ వినాయక నవ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు శాసనసభ్యులు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, మంత్రోచ్చారణల మధ్య నవ విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయ ప్రాంగణాన్ని భక్తి పారవశ్యంతో ముంచెత్తారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజుల పాటు వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు, శాంతి హోమాలు, విగ్రహాలకు అభిషేకం, అలంకరణ, మహా హారతి భక్తుల జయ జయధ్వానాల మధ్య జరిగాయి. అనంతరం ఆలయ కుంభాభిషేకం కూడా అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పూజలు, ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు, ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య, పెద్దలు మునగాల రామేశ్వరావు, ఆలయ కమిటీ చైర్మన్ వట్టికోటి యాదయ్య, వైస్ చైర్మన్ బుషిపాక శాంతి కుమార్, కమిటీ సభ్యులు కాటిక నరేందర్, బచ్చన బోయిన కృష్ణ, హనుమంత చారి, శ్రీశైలం,పాలకవర్గం సభ్యులు, పోలగొని సత్తయ్య, పోలగోని అంజయ్య, కడారి నరసింహ యాదవ్, వట్టికోటి పాండు, చాపల యాదయ్య, బుషిపాక వెంకటయ్య, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** నాణ్యమైన బోధన మెరుగైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో విద్యా వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో మున్సిపల్ చైర్మన్, సర్పంచ్, వార్డు మెంబర్‌లకు వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందని అన్నారు. విద్యాశాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భువనగిరి ఎమ్మెల్యే కుమ్మం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రోజుకొక కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేసుకుని అభివృద్ధి పథంలో ముందుండేలా ప్రజా ప్రభుత్వం విద్య పై ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జిల్లాలో పాఠశాలలలోని మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదులు, తదితర మరమ్మత్తులు చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కిచెన్ షెడ్, సోలార్ ఫెన్సింగ్, తదితర పెండింగ్ పనులు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్స్‌లో ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మన జిల్లాలో పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు వచ్చాయని, గ్రామాలలో ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల ఎడ్యుకేషన్ అధికారులు, సర్పంచ్ లఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకట రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీ వాణి, వైస్ చైర్మన్ మంజుల, ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బాలామణి, సర్పంచులు, కౌన్సిలర్లు సంబధిత అధికారులు పాల్గొన్నారు.



## ధాన్యాన్ని దింపుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైస్ మిల్లర్లు ధాన్యం లారీలను వెంటనే దింపుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం ఆయన మిర్యాలగూడలోని వైష్ణవి రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి ట్రక్ షీట్లు, అన్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రతిరోజు కనీసం పది లారీలు దింపుకోవాలని ఆదేశించారు. వచ్చిన ట్రక్ షీట్లు అన్నింటిని వెంట వెంటనే పంపించడమే కాకుండా టాబ్ ఎంట్రీ నూటికి నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లుల వద్ద నియమించిన పోలీసు, జీపీవో ఇతర అధికారులు సిబ్బందితో మాట్లాడి ధాన్యం అన్‌లోడ్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ గూబిలి కాలనీలో త్వరలో ప్రారంభించనున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. గృహ నిర్మాణ, ట్రాన్స్‌కో, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో పనులను సమీక్షించారు. ఆయన వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు నిమ్మ తోట దగ్ధం

60 చెట్లు కాలి సుమారు రూ.4 లక్షల నష్టం



**ప్రజాపక్షం/నకిరేకల్(శాలిగౌరారం):** మండల పరిధిలోని అంబారిపేట గ్రామానికి చెందిన మొలుగూరి మరియమ్మకు చెందిన నిమ్మ తోటలో ప్రమాదవశాత్తు 60 నిమ్మ చెట్లు దగ్ధం అయ్యాయి. సుమారు 4 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. నిరుపేద కుటుంబమని నిమ్మ తోటనే మీదనే ఆధారపడి జీవిస్తున్నామని మమ్మల్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బాధితులు వేడుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు తోట వినోద్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు చలకాని మల్లేష్ తదితరులు దగ్ధమైన నిమ్మ తోటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొలుగూరి మరియమ్మది పేద కుటుంబమని ప్రభు త్వం, అధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు కృషి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** అభివృద్ధికి పునాది విద్యేనని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక టిటిడిసిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సర్పంచులు, కార్పొరేటర్ల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 8 శాతం విద్యకు కేటాయిస్తోందని, ప్రతి ప్రజాప్రతినిధి నెలకు ఒకసారైనా పాఠశాలలను సందర్శించి బోధన, మౌలిక సౌకర్యాలపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల మంది, 12 వేల ప్రైవేట్ పాఠశాలల్లో 39 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ప్రభుత్వం 20 వేల కోట్లతో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తోందని, విద్యా కిట్లు, యూనిఫామ్లు, స్కాలర్‌షిప్లు అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యే లక్ష్యంగా విద్యా వారోత్సవం నిర్వహిస్తున్నామని, జిల్లాలో పదో తరగతిలో 98.47 ఉత్తీర్ణత సాధించామని చెప్పారు. 43 పీఎం శ్రీ పాఠశాలల్లో ల్యాబ్‌లు, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జడ్‌పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,డీఈఓ బిక్షపతి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, సర్పంచులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల :** రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని రామకోటితండ, చివ్వెంల మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా ఎస్‌పి కె. నరసింహతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డిఎస్ఓ మోహన్‌బాబు, తహశీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## ధాన్యం దిగుమతి, సేకరణలో వేగం పెంచాలి

జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్/చివ్వెంల :** మిల్లర్లు వరి ధాన్యం సేకరణ, దిగుమతిలో వేగం పెంచాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహా సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుండి వరి ధాన్యాన్ని మిల్లర్లకు చేర్చడం కోసం రవాణా వాహనాలను సమకూర్చడంలో భాగంగా బుధవారం సూర్యాపేట రూరల్ పరిధి జాతీయ రహదారి 65పై వద్ద ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల అధికారుల సమన్వయంతో లారీల యజమానులతో, డ్రైవర్లతో మాట్లాడి వరి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులను చేరవేయాలని దీని కోసం లారీ డ్రైవర్లు, యజమానులు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం చివ్వెంల మండల పరిధి జాతీయ రహదారి వెంట ఉన్న నవరత్న ఫార్‌బాయిల్డ్ రైస్ మిల్లు నందు ధాన్యం దిగుమతి, సేకరణను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల కల్లాలలో వరి ధాన్యం తడిచి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. చిన్న తరహా మిల్లర్లు కూడా వరి ధాన్యం సేకరణకు ముందుకు రావాలని కోరారు. ఫార్‌బాయిల్డ్ రైస్ మిల్ నందు హమాలీలతో మాట్లాడి వేగంగా ధాన్యాన్ని దిగుమతి చేయాలన్నారు. రైతన్నలకు జిల్లా యంత్రాంగం అండగా ఉన్నది, ఆందోళన చెందవద్దని సూచించారు. రోడ్ ట్రాన్స్‌పోర్టు శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖలతో సమన్వయంగా పోలీసులు పనిచేసి రవాణా వాహనాలను లారీలను సమకూర్చడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, రోడ్ ట్రాన్స్‌పోర్టు అధికారులు, స్థానిక ఎస్ఐలు బాలు నాయక్, మహేష్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నరేగా కూలీలకు ఎక్కువ రోజులు పని

కేంద్ర గ్రామీణ అభివృద్ధి డిప్యూటీ సెక్రటరీ మూన యాస్మిన్



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు అధిక మొత్తంలో పనిచేసి ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ ఆర్‌హెచ్ మూన యాస్మిన్ తెలిపారు. ఆమె బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంతో పాటు మాటూర్, అమ్మనబోలులలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనుల నాణ్యతను, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా అమలవుతున్న రోడ్లను పరిశీలించారు. మోటకొండూర్ మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో మంజూరైన ఆయిల్ మిల్, పప్పు మిల్, వత్తులు తయారు చేసే మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకంలో కూలీలు అధిక మొత్తంలో పనులు చేసి వచ్చిన డబ్బులతో కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగించుకోవాలని తెలిపారు. మోటకొండూర్, మాటూర్ గ్రామాలలోని నర్సరీలను, పార్మేషన్ రోడ్డు, 7 రకాల రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సురేష్, క్లస్టర్ ఎపిడి నవీన్, ఎంపీడీవో ఇందిర, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్, ఈసి గోవర్ధన్, ఎపిఎం ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్స్ స్వామి, చంద్రమోహన్, మంగ పంచాయతీ సెక్రటరీ సాయికుమార్, స్వాతి, బుగ్గ సంతోష్, క్షేత్ర సహాయకులు రవీందర్, రమేష్ మోటకొండూర్, మాటూర్ అమ్మన బోలు సర్పంచ్‌లు జన్నే సిద్ధులు, నర్సమ్మ మల్లయ్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# 5వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 5వ వార్డులోనీ ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయల కల్పనకు కృషి చేయనున్నట్లు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని 5వ వార్డులో ఉన్నటువంటి వైకుంఠదామంలో రూ.21 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, కౌన్సిలర్ యరగాని సుష్మ మురళితో కలిసి ఐఎన్‌టియుసి నాగన్నగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యరగాని నాగన్నగౌడ్ మాట్లాడుతూ స్వర్గీయ భాస్కరుని రామారావు గతంలో చేసిన విజ్ఞప్తి మేరకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.21 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆ నిధులతో స్మశాన వాటికలోపల పూర్తిగా సిసిరోడ్డు ఫ్లోరింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఇతర మౌళిక సదుపాయలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మోదాల కామేశ్వరి సైదులు, వల్లెపు నాగరాజు, చెన్నగాని సైదులు, పులిచింతల వెంకటరెడ్డి, నల్లగొండ సుజాత చంటి, బెల్లంకొండ లలిత శ్రీనివాస్, చిట్టిపోతుల రమేష్, చిరుమామిళ్ల సుధీర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మద్యం పాలసీ ఆదేశాలకు తూట్లు

బెల్ట్ షాపులకు ఇంటింటికీ మద్యం డెలివరీ

వైన్‌షాప్ యజమాని సొంత కార్లలో మద్యం సరఫరా



**ప్రజాపక్షం/మునుగోడు:** తెలంగాణలో మద్యం నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానం అమలవుతుంటే, మునుగోడు నియోజకవర్గంలో మాత్రం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక పాలసీ పెట్టారు. గ్రామాలను మద్యరహితం చేసే లక్ష్యంతో ఆయన కఠిన నిబంధనలు విధించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ముందు వైన్ షాపులు తెరవకూడదు. సాయంత్రం ఆరు గంటల తర్వాతే పర్మిట్ రూములు నడపాలి. అంతే కాదు, గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం అమ్మొద్దని వైన్ షాప్ నిర్వాహకులకు స్పష్టంగా చెప్పారు. బెల్ట్‌షాపులు స్వచ్ఛందంగా మూసివేసిన గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇచ్చి గ్రామాలను తీర్చిద్దుతామని ప్రకటించారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలోని దాదాపు అన్ని వైన్ షాపులు ఎమ్మెల్యే పాలసీని పాటిస్తున్నాయి. కానీ మునుగోడు మండలంలో మాత్రం ఒక వైన్‌షాప్ యజమాన్యం ఈ నిబంధనలకు తూట్లు పొడుస్తోంది.

**మద్యం హోమ్ డెలివరీ దందా**

మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపేవారిని లక్ష్యంగా చేసుకుని ఈ వైన్ షాప్ నిర్వాహకులు కొత్త దారి పట్టారు. చరవాణిలోనే ఎంత స్టాక్ కావాలో ఆర్డర్ తీసుకుంటున్నారు. ఆ తర్వాత తమ సొంత కార్లలో మద్యాన్ని నేరుగా బెల్ట్ షాపుల వద్దకు చేర్చి ఇస్తున్నారు. ఇంటింటికీ డెలివరీ చేస్తున్నట్టుగా సరఫరా చేస్తుండటంతో వారి అమ్మకాలు గణనీయంగా పెరిగాయని స్థానికంగా చర్చ నడుస్తోంది. దీనితో మండలంలో మొత్తం నాలుగు వైన్ షాపులు ఉండగా, ఈ విధంగా హోమ్ డెలివరీ చేస్తున్నది మాత్రం ఒకే షాప్. అయితే ఆ షాప్ అమ్మకాలు పెరగడం చూసి మిగతా వైన్ షాపుల యజమానులు కూడా అదే బాట పట్టాలని చూస్తున్నారని సమాచారం. అందులో భాగంగా తమ షాపుల్లో పనిచేసే సిబ్బందికి సేల్స్ టార్గెట్లు పెట్టారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

**అధికారుల మౌనం**

గ్రామాల్లో మద్యం నియంత్రణ బాధ్యత ఉన్న ఎక్సైజ్, సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఈ వ్యవహారం పట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా బెల్ట్ షాపులకు సరఫరా జరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే గ్రామాల్లో మద్యాన్ని అరికట్టడానికి నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తుంటే, మరోవైపు ఇలాంటి హోమ్ డెలివరీ దందా ఆ ప్రయత్నాలను దెబ్బతీస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాలను కాలరాస్తూ జరుగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత

భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా వైద్య, విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. వైద్యరంగంలో నైపుణ్యం కలిగిన సిబ్బందిని తయారు చేయడంలో ఈ కళాశాల కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, భువనగిరి మున్సిపల్ ఛైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ ఛైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ ఆర్.కృష్ణ, పట్టణ అధ్యక్షులు వెంకటేష్, మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్యతో నిలిచిన చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో బుధవారం చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో విద్యుత్ సరఫరా లైన్ సాంకేతిక సమస్యతో సుమారు గంటకు పైగా నిలిచిపోయింది. దీంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే సిబ్బంది సాంకేతిక సమస్యను సరిచేస్తున్నట్లు తెలియవచ్చింది.



## పేదోడి సొంతింటి కల సాకారం

ప్రజాపక్షం/కృష్ణ : కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై పేదల సొంతింటి కల సాకారం అవుతుందని మంత్రి వాకిటి శ్రీహరి సతీ మణి వాకిటి లలిత అన్నారు. బుధవారం కృష్ణ మండలం ఖాన్ దొడ్డి గ్రామంలో కుమ్మరి ఆంజనేయులు లక్ష్మి గృహ ప్రవేశంలో ఆమె పాల్గొని దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్, సంగోళ్ల వెంకటేష్, ఉపసర్పంచు దుకాణం శ్రీనివాస్, పంచాయితీ సెక్రెటరీ శివరాజ్, జి.వెంకటేష్, మల్లికార్జున్, మక్తల్ నాయకులు బోయ రవి, నాగేంద్ర కుస్సీ, నాగరాజు, నాగేశ్వరరావు, తమప్ప, తాయప్ప, చన్ని తాయప్ప, ఉజూర్, తారేష్, అశోక్, హన్మేష్, కాంగ్రెస్ నాయకులు తదిత రులు పాల్గొన్నారు.



## పాలిసెట్ -2026 పరీక్ష విజయవంతంగా నిర్వహణ

### జిల్లాలో 92.08 శాతం హాజరు నమోదు

ప్రజాపక్షం/నారాయణపేట : రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నిర్వహిం చిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలీసెట్–2026) పరీక్ష నారా యణపేట జిల్లాలో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసి నట్లు జిల్లా పాలీసెట్ కోఆర్డినేటర్ డా.ఎం.శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహించబడిందన్నారు. వీటిలో నారాయణపేటలో 3 కేంద్రాలు, కోస్గిలో 2 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం కేటాయించిన సామర్థ్యం 1330 కాగా, అందులో 1225 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారని, 105 మంది గైర్హాజరై నట్లు తెలిపారు. మొత్తం హాజరు శాతం 92.08 గా నమోదైందన్నారు.



## మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాపక్షం/నారాయణపేట : నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవ సాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొను గోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు. మంగళవారం వరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం జరిగిందని, ఇప్పటి వరకు 90 మంది రైతులతో కొనుగోలు చేసిన ధాన్యానికి గాను 74 మంది రైతులకు వారి వారి ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరిగిందని, మిగతా రైతులకు కూడా ట్యాబ్ ఎంట్రీ చేసి ధాన్యం డబ్బులకు వారి ఖాతాల్లో వేస్తా మని నిర్వాహకులు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ సైదులు, మెప్మా సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పత్తి మార్కెట్‌ను సందర్శించిన రెవెన్యూ అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని పత్తి మార్కెట్ ను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సందర్శించి రైతులు అధికారులతో మాట్లాడారు. బుధవారం నాడు ఆమె ఆకస్మాత్తుగా మార్కెట్లను సంద ర్శించి, మొక్క జొన్న కొనుగోలు పరిశీలన, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ జడ్చర్ల పట్ట ణంలో పత్తి మార్కెట్ యార్డ్ లో రైతులకు ఎలాంటి అసౌకర్యం తెలియ కుండా తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్ యార్డ్ లో మొక్క జొన్న కొనుగోలు పరిశీలించారు. కొనుగోళ్ల వివరాలు తెలుసుకు న్నారు. రైతులు, అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా మొక్క జొన్న కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. మార్కెట్ కు వచ్చిన మొక్క జోన్న కొను గోలు చేయటం తో పాటు కొనుగోలు చేసిన మొక్క జొన్న వెంటనే తరలిం చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాల మణి, తహసిల్దార్ నర్సింగ రావు తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఉడుత భాస్కర్

ప్రజాపక్షం/ చిన్నంబావి : చిన్నంబావి మండల పరిధిలోని గ్రామంలో గ్రామ ఐక్య సంఘం, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఉడుత భాస్కర్, తహసీల్దార్ శ్రీనివాస్ ఐకెపి సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లా డుతూ గ్రామంలోని రైతులు తమ వరి ధాన్యాన్ని మధ్యవర్తులకు అమ్మి నష్ట పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగిం చుకోవాలని సూచించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యానికి తగిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం శుభ్రంగా, తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్ మండల మహిళా సమాఖ్య ఎపిఎం, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, రైతులు, గ్రామ పెద్దలు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగోటం-గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులు వేగవంతం

భూబాధిత రైతులతో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖాముఖి

భూములు కోల్పోతున్న రైతులకు మూడింతల పరిహారం

పట్టా లేని రైతులకూ న్యాయం



ప్రజాపక్షం/వీపనగండ్ల : సింగోటం గోపాల దిన్నె లింక్ కెనాల్ పనులను వేగవంతంగా పూర్తి చేసి చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువ కంటే మూడింతల పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామ రైతు వేదికలో సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూబాధిత రైతులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభ్యంతరాలు, సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ భూములకు ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేయగా, మంత్రి వెంటనే స్పందించి బేసిక్ మార్కెట్ విలువను పెంచాలని అధికారు లకు సూచించారు.

**ఎకరాకు రూ.11.50లక్షల పరిహారం :** ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మార్కెట్ విలువ ఎక రాకు రూ.1,87,500 మాత్రమే ఉండటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి జూపల్లి స్పందిస్తూ, బేసిక్ మార్కెట్ విలు వను రెండింతలు పెంచి రూ.3,75,000గా నిర్ణ యించాలని అధికారులను ఆదేశించారు. ఈ పెంచిన మార్కెట్ విలువ ఆధారంగా భూసేక రణ చట్టం ప్రకారం మూడింతల పరిహారం, గెజిట్ విడుదలైన తేదీ నుంచి వడ్డీని కలిపి ఎక రాకు మొత్తం రూ. 11,50,000 చొప్పున చెల్లిం చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రి నిర్ణయం పై రైతులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా అవార్డు కాపీలు త్వరితగ తిన జారీ చేసి పరిహార పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**అసైన్డ్, పట్టా లేని రైతులకు కూడా పరిహారం :** ఈ సందర్భంగా బొల్లారం గ్రామస్థులు అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా సాధారణ పట్టాదారుల మాదిరిగానే పరిహారం చెల్లించా లని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీని పై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, అసైన్డ్ భూముల రైతులకు సమాన పరిహారం అందించాలన్నారు. అలాగే చాలా కాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నా ఎలాంటి పట్టాలు లేని పేద రైతులకు కూడా భూసేకరణ చట్టంలోని '3ఆర్' నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని అధికారు లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 40 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం అన్నారు. కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు కింద 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు కలిపి మొత్తం 40 వేల ఎకరాల చివరి ఆయ కట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి వివరిం చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 2018లో సింగోటం గోపాలదిన్నె లింక్ కెనాల్ కు పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నట్లు గుర్తు చేశారు. ఈ కెనాల్ నిర్మాణం కోసం మొత్తం 305.23 ఎకరాల భూమిని సేకరిం చాల్సి ఉందన్నారు.

**భూసేకరణ వివరాలు :** అధికారుల వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి లో 50 ఎకరాలు, వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం లో 73 ఎకరాల 13 గుంటలు, వల్ల భాపూర్ లో 87 ఎకరాల 3 గుంటలు, సంగినేని పల్లి లో 94 ఎకరాల 8 గుంటల భూమి భూసే కరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరి గేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ ఖాజా మైనుద్దీన్,చ డిప్యూటీ తహసిల్దార్ శివకుమార్, బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, తూముకుంట సర్పంచ్ రామన్ గౌడ్, నాయకులు నారాయణ రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో జూరాల బ్రిడ్జి నిర్మాణ పనులను చేయాలి

మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాపక్షం/అమరచింత : ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల సమీ పంలో ఉన్న కృష్ణా నది పై 123 కోట్ల నిధులతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను నాణ్యతతో చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్కు రాష్ట్ర పశుసం వర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడా యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. బుధవారం జూరాల వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వాకిటి శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లా డుతూ రానున్న కొద్ది రోజుల్లో ఆత్మకూరు పట్టణానికి మహర్దశ రాబోతుం దని అన్నారు. ఆత్మకూరు పట్టణ ప్రజల దశబ్దాల కళ నెరవేరబోతుందని తెలిపారు. ఈ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, ఒక ఏడా దిలోగా ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. ఈ వర్షాకాలపు లోపు బ్రిడ్జి పిల్లర్ ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధి కారులకు ఆదేశించారు. ఈ వంతెన పూర్తి అయితే హైదరాబాదు నుంచి వయా ఆత్మకూరు, గద్వాల, రాయచూర్ నుండి మంత్రాలయం వరకు దాదాపు 60 కిలోమీటర్ల దూరం తక్కువ అవుతుందని వాకిటి శ్రీహరి తెలి పారు. ఆత్మకూరు ఇకపై కనెక్టివిటీ మున్సిపాలిటీగా అవుతుందని వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా, జూరాల సర్పంచి నరసింహ, కాంగ్రెస్ నాయకులు, సీఐ శివ శంకర్, ఎస్సై జయన్న తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

జిల్లా ఎస్పీ డా.వినీత్

ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లద్దాలు పంపిణీ



ప్రజాపక్షం/నారాయణపేట : జిల్లాలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు జిల్లా ఎస్పీ డా.వినీత్ చలువ కళ్లద్దాలను పంపిణీ చేశారు. ప్రజల భద్రత కోసం రహదారులపై నిరంతరం సేవ లందిస్తున్న ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆరోగ్యం కూడా ముఖ్యమని పేర్కొంటూ, ఎండల సమ యంలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బయట విధులు నిర్వర్తించే పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, అలాగే సాధారణ ప్రజలు కూడా ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తగినంత నీరు తాగడం, తలకు రక్షణ కల్పించడం, అవసరమైతే చలువ కళ్ల ద్దాలు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**
ఎస్పీ అదే విధంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ లేకుండా కార్లు నడపడం, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా ప్రతి పోలీస్ అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు, వాహనదారులకు విస్తృతంగా రోడ్డు భద్రత నియ మాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇకపై ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసు కుని జరిమానాలు విధించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ యండి రియాజ్ హుల్ హక్, ఆర్ఐ విజయభాస్కర్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ, చైతన్య, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్



ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ : ధాన్యం కొను గోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం తగదని, రిజిస్టర్లు, ట్యాబ్ ఎంట్రీలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్ అన్నారు. బుధవారం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి నిర్వహణ పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లు సక్ర మంగా నిర్వహించకపోవడం, ప్యాడీ లోడ్లు వెళ్లినా ఎంట్రీలు నమోదు చేయకపోవడం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో రైతుల వివరాలు, వాహనాల సమాచారం, ధాన్యం రాకపోకల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్ నిర్లక్ష్యంగా నిర్వహించడం తీవ్ర తప్పిదమని పేర్కొన్నారు. కేంద్రంలో ప్యాడీ క్లీనర్ లేకపోవడం పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాడీ శుభ్రప రచకుండా మిల్లులకు పంపితే రైతులకు నష్టం జరుగుతుందని, మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. శుభ్రపరిచిన ధాన్యమే మిల్లులకు పంపించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈఓలు కేవలం తేమ శాతం పరిశీలించి వెళ్లిపోవడం సరికాదని, సెంట ర్‌లోకి వచ్చే, బయటకు వెళ్లే ధాన్యాన్ని పర్యవేక్షిం చడం, రిజిస్టర్లు పరిశీలించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ శాఖ పనితీ రుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పర్యవేక్షణ లోపాలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, డీఏవో వీరప్ప, తాహసీల్దార్ నందిని, ఏఈఓ రోహిత్ తదితరులున్నారు.



## మెరుగైన విద్య అందించేందుకు ఆధునిక సంస్కరణలు

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ : వనపర్తి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వన పర్తి జిల్లా కేంద్ర మున్నూరు కాపు భవన్‌లో ప్రత్యేక విద్యావారోత్సవాల సందర్భంగా సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులకు పాఠశాల విద్య కార్యక్రమాలపై అగాహన కల్పించే వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వనపర్తి జిల్లా డీఈవో అబ్దుల్ గని పాల్గొన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలను ఆధు నికీకరించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అనేక సంస్కర ణలు చేపడుతోందన్నారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది అని, ప్రతి గ్రామంలో విద్య వికాసం జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవు తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామపంచా యితీలు, మున్సిపాలిటీలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగ్యస్వామ్యం చాలా అవసరమని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామస్థాయి ప్రజాప్రతి నిధులు, తల్లిదండ్రులు, స్థానిక సంస్థలు కలిసి పని చేసినప్పుడే మంచి ఫలి తాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఆధునిక సాగు విధానాలపై శిక్షణ

ప్రజాపక్షం/ఉట్కూర్ : మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో రైతు వేది కలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా.ఎం.మాధవి, రైతు లకు నేల ఆరోగ్య పరిరక్షణ, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సాగునీటి నిర్వ హణ, వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సంరక్షణ, దిగుబడి పెంపు మార్గాలపై రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ రంగంలో కొత్త సాంకేతికతలను వినియోగించి అధిక దిగుబడులు సాధిం చాలని రైతులకు సూచించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధా నాలు ఇస్తూ, పంటల నిర్వహణ పై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, చిన్నపొర్ల గ్రామ సర్పంచు గాండ్ల నిఖిత ప్రశాంత్, ఏఈఓ మునీర్ బేగం, పంచాయితీ కార్యదర్శి మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు చురుకుగా ఉండాలి

ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్‌లో విద్యాభివృద్ధిపై అవగాహన సదస్సులో పాఠశా లలో పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు చురుకుగా ఉండాలని, నాగర్‌కర్నూల్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల భాగస్వామ్యం కీలకమని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌లు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నాగర్‌క ర్నూల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ సర్పంచ్‌లు, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ సభ్యులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని డి.కె.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో విద్యా వారోత్స వాల్లో భాగంగా, విద్యాభివృద్ధిపై అవగాహన సద స్సులో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి హాజర య్యారు. ఈ కార్యక్రమాన్ని సరస్వతీదేవి చిత్రప టానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనేక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, డిజిటల్ విద్య, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నట్లు గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల నాయకులు చొరవ చూపిన ప్పుడే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్‌కర్నూల్ మండల విద్యాధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికా రులు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ల శెట్టి, నియోజక వర్గ పరిధిలోని మండలాల విద్యాధికారులు తదిత రులు పాల్గొన్నారు.

## క్రికెట్ శిక్షణ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

యువ క్రికెటర్లకు రూ.10వేల చేయూత

ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు పట్టణంలని మినీ స్టేడియంలో మహబూబ్ నగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ శిబిరాన్ని ప్రారంభించి యువ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గ్రామీణ ప్రాంతాల యువత క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రమశి క్షణ, పట్టుదలతో శిక్షణ తీసుకుంటే మంచి అవకాశాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు చెందిన యువ క్రికెటర్ల కోసం క్రికెట్ సామగ్రి కొనుగోలుకు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన సహాయం పై క్రీడాకారులు, అసో సియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్ నగర్ క్రికెట్ అసోసి యేషన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మే నెల నుంచి జూన్ వరకు నెల రోజులపాటు శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అనుభవజ్ఞులైన కోచ్ ల ఆధ్వర్యంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ తో పాటు ఫిట్ నెస్ పై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు, యువత, క్రికెట్ అభిమానులు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగటా యువ ఆట గాళ్లు ఉత్సాహంగా ప్రాక్టీస్ నిర్వహించారు.






## పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణ

ప్రజాపక్షం/వనపర్తి : తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేసిన పోక్సో కేసులో నిందితుడి పై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మాజీ మంత్రి సింగా రెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి వారి నివాసంలో నిర్వహించిన పాత్రికేయ సమావే శంలో ఆయన మాట్లాడారు. మైనర్ బాలికపై జరిగిన ఘటన మహిళా లోకా న్నిర తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య ఉన్న రాజకీయ అనుబంధం వల్లే కేసు బలహీనపడుతోందని విమర్శించారు. నిందితుడికి నోటీసులు ఇచ్చి వదిలే యడం చట్ట ప్రక్రియను అవమానపరిచడమేనన్నారు. బాధిత కుటుంబం పై తిరిగి కేసులు నమోదు చేయడం, వారిని బెదిరించడం వంటి చర్యలు అమాను షమని పేర్కొన్నారు. పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధిత కుటుం బానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోలెమోని లక్ష్మయ్య, గట్టు, యాదవ్, వాకిటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ సాయి కుమార్, సర్పంచ్ స్వప్న భాస్కర్, కౌన్సిలర్స్ సౌజన్య దిలీప్ రెడ్డి, ఏర్వ, అరుణా శ్రీనివాస్, శిరీష, రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్స్ నందిమల్ల శారత, జ్యోతి, మహిళా అధ్యక్షురాలు నాగమ్మ, కవితా నాయక్, పవిత్ర భాను, సర స్వతి, కర్రెస్వామి, సాయి కుమార్, రాజశేఖర్, వెంకట్ సాగర్, జోహెబ్ హుస్సేన్, హరిబాబు, నీలస్వామి, హేమంత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# ఇళ్ల గణనలో ప్రజలు, అధికారులు బాధ్యతగా పాల్గొనాలి : కలెక్టర్



ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రభుత్వం జన గణన 2027లో భాగంగా ఈ నెల 11వ తేదీ సోమవారం నుండి ప్రారంభమైన మొదటి దశ ఇండ్ల జాబితా, ఇండ్ల గణన ప్రక్రియలో జిల్లా ప్రజలు, అధికారులు బాధ్యతగా పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. భారత ప్రభుత్వం జన గణన 2027 ప్రక్రియను రెండు దశలలో చేపడుతోందని, అందులో భాగంగా మొదటి దశలో మే 11 నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన చేస్తారని కలెక్టర్ వివరించారు. ఇండ్ల గణన కోసం ఈనెల 11 తేది నుంచి జూన్ 9 వరకు మీ ఇంటి వద్దకు వచ్చే నమోదు అధికారికి అన్ని వివరాలు తెలియజేయాలని సూచించారు. జన గణన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని ఇచ్చి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఇండ్ల గణనలో కుటుంబానికి సంబంధించి మొత్తం 33 ప్రశ్నలు అడుగుతారని తెలిపారు. మీరు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసినప్పటికీ, ప్రభుత్వ ఎన్యూమరేటర్ భౌతికంగా మీ ఇంటికి వస్తారు. అప్పుడు మీరు ఆన్‌లైన్ ద్వారా పొందిన నంబర్‌ను వారికి చూపిస్తే సరిపోతుందన్నారు. ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్‌లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని కలెక్టర్ జిల్లా ప్రజలను కోరారు.

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారీ డిమాండ్



ప్రజాపక్షం/రంగారెడ్డి: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదు అయినా పోక్స్ కేసులో ఇప్పటి వరకు కూడా ఆయనను అరెస్ట్ చేయకుండా కాలయాపన చేయటం చూస్తుంటే చట్టాలు అందరికి ఒకేలాగా అమలు కావు అనే ఆలోచన సామాన్య ప్రజానీకానికి వచ్చిందన్నారు. 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాదులోని పేట్ బషీరాబాద్ పోలీసులు బండి భగీరథపై కేసు నమోదు అయ్యి అయిదు రోజులు అవుతున్నా ఇంతవరకు అరెస్టు చేయక పోవడానికి కారణం అతడు బిజెపికి చెందిన కేంద్రమంత్రి కొడుకు అని, అతని రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఇంత సంచలనం అయినా బండి భగీరథను అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ తీరును పరిశీలిస్తే బండి సంజయ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రహస్య ఒప్పందం చేసుకున్నాడనే అనుమానాలు ప్రజల్లో పెరిగిపోతున్నాయని రవీంద్రచారి ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వెంటనే బండి సంజయ్ కొడుకు భగీరథను అరెస్ట్ చేయాలని, పోలీసులు, న్యాయ వ్యవస్థ అందరినీ ఒకేలాగా చూస్తుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలని రవీంద్రచారి పేర్కొన్నారు.

## డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : గతంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సహకారంతో వనస్థలిపురం డివిజన్ నాగార్జున కాలనీలో మంజూరు చేసుకున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేమాలని వనస్థలిపురం తాజా, మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాలనీ వాసుల ఆహ్వానం మేరకు కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయలేని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే అత్యధిక నిధులు కేటాయించడం గర్వంగా ఉందన్నారు. కాలనీ వాసులకు తమ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ్, క్రిష్టియన్ కాలనీ అధ్యక్షులు హరేందర్‌రెడ్డి కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు వరం ఇందిరమ్మ ఇండ్లు

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్



ప్రజాపక్షం/కొత్తూరు: పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చడంతోపాటు పేదలకు వరంగా ఇందిరమ్మ ఇండ్లు మారుతున్నాయని కొత్తూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ వివరించారు. బుధవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో లబ్దిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతోనే అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు అంధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి గౌస్, వార్డుసభ్యులు కమ్మరి వేదాంతచారి, ఆర్. రాములు, కె.మైబుజీ, అర్బాస్, మాధవి, మంద కుమార్, కె.శేఖర్ పాల్గొన్నారు.

## మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం



ప్రజాపక్షం/కొత్తూరు: నందిగామ మండలం ఉమ్మడి వీర్లపల్లి గ్రామ పంచాయతీలోని అప్పారెడ్డిగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 9మంది అభ్యర్థులకు గాను 7మంది అభ్యర్థులు విజయం సాధించి చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని మొదళ్ళగూడ గ్రామంలో మర్యాదపూర్వకంగా కలివారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, మాజీ సర్పంచ్‌లు జెకె నర్సింహులు, సుధాకర్ గౌడ్, ఉప సర్పంచ్ నాగయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నాగుల నరసింహా, ఉపాధ్యక్షుడు వద్ది జగన్, కార్యదర్శి దివిటి నరసింహా, క్యాషియర్ గడ్డం నవీన్, డైరెక్టర్లు నాగుల రాజు, నాగుల రమేష్, నాగుల శ్రీకాంత్‌తోపాటు యువకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు పూర్తిచేసుకోవాలి



ప్రజాపక్షం/యాచారం : ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని యాచారం మండల అభివృద్ధి అధికారి రాధ రాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నల్లవెల్లి, మేడిపల్లి, మల్కిజ్‌గూడ గ్రామాల్లో పర్యటించి ఇండ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. నిర్మాణ విషయంలో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. నల్లవెల్లి గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు వాటర్ సౌకర్యంతో బాటు, ఓఆర్ఎస్ మెడికల్ కిట్ల ను పంపిణి చేశారు.కార్యక్రమంలో అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/కేశంపేట: పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పాపిరెడ్డిగూడ సర్పంచ్ శశిరేఖ యాదయ్య అన్నారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో లబ్దిదారు వద్దె పోచమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శశిరేఖ యాదయ్య మాట్లాడుతూ నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతోనే అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు అంధించడం జరుగుతుందని తెలిపారు. నిర్మించుకున్న లబ్దిదారులకు సకాలంలోనే బిల్లులు వస్తున్నాయని, ఎవరు ఆదైర్య పడోద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుండెరాణి, నాయకులు మహిపాల్‌రెడ్డి, సుందరయ్య, శివయ్య, దేవేందర్, కుమ్మరి శేఖర్, రవి, శ్రీను, రామచంద్రయ్య, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్నదే లక్ష్యం

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి



ప్రజాపక్షం/ఫరూక్‌నగర్: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి వివరించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి విద్యావారోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధిపై వర్క్ షాపు నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావులు హాజరయ్యారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్, ఫరూక్‌నగర్ ఎంపిడివో బన్సీలాల్, కేశంపేట ఎంపిడివో చంద్రకాంత్, మండలాల ఎంఇఓలు మనోహర్, ఎం.చంద్రశేఖర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, గాయత్రి దేవి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డిలతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మనస్సుకు ప్రశాంతత

క్రీడలు, పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రజలందరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటేనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర క్రీడలు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మంత్రి వాకిటి శ్రీహరికి షాద్‌నగర్‌లో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్‌లు ఘనంగా స్వాగతం పలికారు. నూతన దేవాలయం వద్ద పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఆధ్యాత్మిక చింతనను ప్రతిఒక్కరు అలవర్చువాల్సిన అవసరం ఉందన్నారు. చేగూరు గ్రామానికి కన్హాశాంతివనం రావడం గ్రామస్తులు చేసుకున్న అదృష్టమన్నారు. కార్యక్రమంలో మాజీఎంపిపి శివశంకర్‌గౌడ్, ప్రియాంకగౌడ్, సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉపసర్పంచ్ శివశంకర్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, వార్డు సభ్యులు భాస్కర్‌గౌడ్, సోలిపేట శ్రీనివాస్, సురేష్, కావలి భీమయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ చారి, సర్పంచ్‌లు బుగ్గ సాలయ్య, గొల్లపల్లి అశోక్, కొమ్ము కృష్ణ, మల్లేష్, పబ్బయి శ్రీశైలం, మాజీ సర్పంచులు వీరేందర్ గౌడ్, సతీష్ పటేల్, కుమార స్వామిగౌడ్, సుదర్శన్‌గౌడ్, కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు రాజునాయక్, చాకలి పెంటయ్య, మురళీమోహన్ అప్పి, సాదిక్, ముబారక్, ఖదీర్ పాల్గొన్నారు.

## భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దు

చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి : ప్రజల ప్రాణాలకు భద్రత, రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండవద్దని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే రత్నంతో కలిసి, స్థానిక రైతులు, నాయకులతో కలిసి ఎన్‌హెచ్ 163 విస్తరణ పనులపై ఏర్పడిన సమస్యల నేపథ్యంలో ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్, నాంచేరి, ఆలూరు, రెగడి ఘనాపూర్, దేవరంపల్లి, యెట్ల యర్రవెల్లి, కిష్టాపూర్, పర్వేద తదితర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారికి వివరించారు. ప్రస్తుతం ఎన్‌హెచ్163 రహదారి నిర్మాణంలో భాగంగా అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు, సురక్షిత క్రాసింగ్ పాయింట్లు సరైన విధంగా లేకపోవడంతో రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లే మార్గాలు పూర్తిగా నిలిచిపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, ఎద్దు బండ్లు రహదారి దాటే సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సుల కోసం రహదారి దాటే మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు ఎటువంటి భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. కనాపూర్ గేట్, అలోర్ గేట్ ప్రాంతాలు, పరిసర గ్రామాలకు కీలక రాకపోకల మార్గాలుగా ఉండటంతో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని వెంటనే ఫీల్డ్ పరిశీలన నిర్వహించి, అవసరమైన చోట అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు మరియు సురక్షిత క్రాసింగ్ సదుపాయాలు కల్పించాలని ఎన్‌హెచ్ఎఐ అధికారులను కోరారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి యువకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భక్తాంజనేయుడికి అభిషేకం నిర్వహించారు. తాడిపర్తి గ్రామంలో అంజనేయుడి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవమాన హోమం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. తమలపాకులతో ఆకుపూజ, సామాహిక హనుమాన్ చాలిసా పారాయణం అఖండ హరతి కార్యక్రమం నిర్వహించారు. హనుమాను శోభయాత్ర గ్రామంలో కనుల పండుగగా జరిగింది. కార్యక్రమంలో నీలం రాము, బైకని వినోద్‌కుమార్, నీలం పాండు, మాజీ సర్పంచ్ బైకని యాదమ్మ సాయిలు, మోతకానికి శ్రీకాంత్, నీలం సురేశ్, పోలమోని ఎల్లేశ్, ధార దశరథ, బైకని వెంకటేశ్, గణేశ్, నీలం శ్రీనివాస్, ముక్కాల హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో మంద కృష్ణ



ప్రజాపక్షం/కేశంపేట: మానస వివాహ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పాల్గొని నూతన వధువరులను ఆశీర్వధించారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్టోనిగూడెం కిష్టయ్య కుమారుడు ప్రసాద్–మానసల వివాహానికి మందకృష్ణ మాదిగ హాజరై ఆశీర్వధించారు. అదే విధంగా కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహా మాదిగ, కేశంపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను మాదిగలు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వధించారు.

## యథాతథంగా వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి

మంత్రికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి అప్పగించవద్దని, దానిని యథాతథంగానే కొనసాగించాలని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహను కోరారు. బుధవారం సచివాలయంలో మంత్రిని కలిసి ఆసుపత్రి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని మహేశ్వరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అప్పగించే ప్రతిపాదనలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం మవుతున్నాయన్నారు. అక్కడి రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఇతర ఆసుపత్రులకు బదిలీ చేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం వల్ల ఆసుపత్రి సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మంత్రికి వివరించారు. ఈ ఏరియా ప్రాంతా ప్రజలకు కేంద్ర బిందుగా వనస్థలిపురం ఏరియా హాస్పటల్ ఉందని, చాలా ఇతరల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి అందుబాటులో ఉందన్నారు. ఆసుపత్రి నిర్వహణలో మార్పులు చేస్తే పేద ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. రాజకీయ నిర్ణయాల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకూడదని, ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఆసుపత్రిని పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి దామోదర రాజనరసింహ సానుకులంగా స్పందించారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి మరియు సిబ్బంది బదిలీల విషయంలో ఉన్నతాధికారులతో చర్చించి, స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవి కుమార్ గుప్తా, బియన్‌రెడ్డి డివిజన్ అధ్యక్షులు కటిరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు రవిముదిరాజ్, మధుసాగర్, ఆసుపత్రి సిబ్బంది శివకుమార్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెసీమల్లో ఆధ్యాత్మికం అభినందనీయం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఆధ్యాత్మికం వైపు పల్లెసీమలు అడుగులు వేయడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం నందిగామ మండలం చేగూరు గ్రామంలో నిర్వహించిన శ్రీవీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వై.అంజయ్య యాదవ్, నరేందర్‌రెడ్డి, జైపాల్ యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేగూరు సింగిల్ విండో మాజీ చైర్మెన్ విఠల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై శ్రీ వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలో అనేక రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలను పార్టీలకు అతీతంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దైవ భక్తితోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందనే విషయాన్ని ప్రజలందరు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, రాంబల్‌నాయక్, మామిళ్ళ సంతోష్ విఠల్‌తోపాటు షాద్‌నగర్ నియోజకవర్గ స్థాయి నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కొత్తూరు: పార్టీలకతీతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామ మండలం చేగూరు గ్రామంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రాతిష్టాపన మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్‌తోపాటు సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉపసర్పంచ్ శివశంకర్‌లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సత్కరించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఆలయాలకు, ప్రార్థన మందిరాలకు, పూర్తి స్థాయిలో సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్ గౌడ్, సోలిపేట శ్రీనివాస్, మనక సురేష్, కావలి భీమయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌చారి, సర్పంచులు బుగ్గ సాలయ్య, గొల్లపల్లి అశోక్, కొమ్ము కృష్ణ, మల్లేష్, పబ్బయి శ్రీశైలం, మాజీ సర్పంచ్ వీరేందర్ గౌడ్, కావలి కృష్ణ, సతీష్‌పటేల్, మాజీ ఎంపిటిసి కుమారస్వామి గౌడ్ పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ కేసు

# ఐదుగురు నిందితుల అరెస్ట్

### దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో సిబిఐ విస్తృత సోదాలు

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్–యుజి 2026 ప్రశ్నాపత్రం లీక్ కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసింది. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో సోదాలు కూడా నిర్వహిస్తోంది. బుధవారం ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు. జైపూర్‌లో ముగ్గురిని, గురుగ్రామ్‌లో ఒకరిని, 5నాసిక్‌లో ఒకరిని అరెస్ట్ చేశామని, పలువురు అనుమానితులను వివిధ నగరాలలో విచారిస్తున్నామని, వారిని తర్వాత అరెస్ట్ చేసే అవకాశం ఉందని వారు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో 30ఏళ్ల శుభం ఖైర్నార్‌కు స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు సిబిఐకి ట్రాన్సిట్ రిమాండ్ మంజూరు చేసిన తర్వాత, తదుపరి విచారణ కోసం అతడిని ఢిల్లీకి తీసుకొస్తున్నారు. రాజస్థాన్ పోలీసుల అభ్యర్థన మేరకు నాసిక్ పోలీసులు మంగళవారం ఖైర్నార్‌ను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నాడు దర్యాప్తు చేపట్టిన సిబిఐ కొత్తగా లభిస్తున్న ఆధారాల ఆధారంగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. పరీక్షా పత్రాలను పంపిణీ చేయడానికి ఉపయోగించి ఉండవచ్చని భావిస్తున్న మెసేజ్ అప్లికేషన్ల జాడను కనుగొనేందుకు, అనుమానితుల నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని, వాటిని ఫోరెన్సిక్ పరీక్షకు పంపనున్నట్లు సిబిఐ తెలిపింది. ఏజెన్సీ వర్గాల సమాచారం ప్రకారం...ఈ కేసులో ప్రాథమిక విచార జరిపిన రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్ గ్రూప్స్ (ఎస్ఒజి)తో సిబిఐ సమన్వయం చేసుకుంటోంది. 'ఆరోపించబడిన పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని ఆధారాలను సిబిఐ, విస్తృతమైన, సాంకేతిక, ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా అనుసరిస్తోంది. ఈ విషయంపై సమగ్రమైన, నిష్పక్షపాతమైన, వృత్తిపరమైన దర్యాప్తును కొనసాగిస్తోంది' అని తాజా పరిణామాల గురించి తెలిసిన ఒక అధికారి చెప్పారు. పేపర్ లీకేజీల ఆరోపణల నేపథ్యంలో రద్దుచేయబడిన నీట్–యుజి పరీక్షకు సంబంధించిన పత్రాలను సేకరించేందుకు సిబిఐ బుధవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రధాన కార్యాలయాన్ని కూడా సందర్శించిందని అధికారులు వివరించారు. పరీక్ష ప్రక్రియలో భాగస్వాములైన అధికారులతో కూడా తమ బృందం మాట్లాడిందని వారు చెప్పారు.

# మణిపూర్‌లో ఉగ్రవాదుల దాడి: ఉద్రిక్తత

- చర్చి లీడర్ సహా ముగ్గురు మృతి
- కాంగ్‌పోక్పీ జిల్లాలో మార్కెట్లు బంద్
- ప్రతీకార చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి



**ఇంఫాల్:** మణిపూర్‌లో ఉగ్రవాదులు బుధవారం చేసిన దాడిలో శాంతిదూత,చర్చి నాయకుడు రెవరెండ్ వి.సిట్లహోర్ సహా ముగ్గురు మరణించారు. మరో నలగురు గాయపడ్డారు. మణిపూర్ కాంగ్‌పోక్పీ జిల్లాలో ఈ దాడికి పాల్పడినవారిని ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ కాల్పుల ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని మైతీసంస్థ పేర్కొంది. ఈ ఉగ్రవాద చర్యను ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ప్రజలు శాంతి,సహనం పాటించాలని, భావోద్వేగాలకు గురికావొద్దని విజ్ఞప్తి చేశారు. కిడ్నాపులు, బందీలుగా ఉంచుకోవడం,కుల,మత ప్రాతిపదికపై పగ తీర్చుకోవడం వంటి చర్యలకు తక్షణం దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కాల్పుల ఘటన తర్వాత కాంగ్‌పోక్పీ జిల్లాలో దుకాణాలు మూతపడ్డాయి. ఆగ్రహించిన స్థానిక ప్రజలు మార్కెట్లను మూయించారు. జాతీయ రహదారిపై వాహనాలు కూడా నిలిచిపోయాయి.

థాడౌబాప్టిస్ట్ అసోసియేషన్ (టిబిఎ) సభ్యులు ఛురాచాంద్‌పూర్‌లో ఒక మతపరమైన కార్యక్రమంలో పాల్గొని రెండు వాహనాలలో తిరిగి వెళుతున్న సమయంలో కోట్జిమ్–కోట్లెన్ గ్రామాల మధ్య వారిపై ఈ తీవ్రవాదులు కాల్పుల దాడి చేశారు. మరణించిన వారిలో మణిపూర్ బాప్టిస్ట కన్వెన్షన్ మాజీ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ వి.సిట్లహోర్ ఉన్నారు. మిగిలిన ఇద్దరినీ రెవరెండ్ కైగౌలెన్, పాస్టర్ పావోగౌలెన్‌గా గుర్తించారు. ముఖ్యమంత్రి వై.ఖేమ్‌చంద్ సింగ్ ఈ ఘటనపై స్పందిస్తూ, కాల్పుల్లో గాయపడిన మిగిలిన నలుగురినీ ఇంఫాల్‌లోని షిజా హాస్పిటల్స్–రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు తరలించినట్లు చెప్పారు. "నాతోపాటు ఉపముఖ్యమంత్రిర లోసీ దిఖో,హోంమంత్రి గోవిందాస్ కోంథోజామ్, శాసనసభ్యులు,ఇతర అధికారులు కూడా వెళ్ళామని, గాయపడినవారిని పరామర్శించామని చెప్పారు. గాయపడినవారి చికిత్స ఖర్చులన్నీ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. చాలా మంచి వైద్యం వారికి అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.ఉగ్రవాదం ఒక బుద్ధి లేని హింసాత్మక చర్యగా ఆయన పేర్కొన్నారు. అమాయకులైన ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో హింసకు తావు లేదని అన్నారు. ఈ హింసాత్మక చర్యలు కుటుంబాలను విచ్ఛిన్నం చేయడమే కాకుండా, రాష్ట్రాన్ని కూడా దెబ్బతీస్తాయన్నారు. తమ శాంతి మార్గానికి విఘాతం కలుగుతుందని అన్నారు. ఉగ్రవాదాన్ని సమాజంలో ఎవ్వరూ సమర్థించరన్న విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరిక చేశారు. యావత్ మణిపూర్ రాష్ట్ర ప్రజలు ఈ విధమైన ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉన్నారని చెప్పారు.

## సిబిఎస్ఇ 12వ తరగతిలో 85 శాతం ఉత్తీర్ణత

### 88 శాతం బాలికలు, 82 శాతం బాలురు పాస్

**న్యూఢిల్లీ :** సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం నాడు విడుదలయ్యాయి. ఈ సంవత్సరం 85 శాతానికి పైగా అభ్యర్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే మొత్తం ఉత్తీర్ణత శాతం మూడు శాతానికి పైగా తగ్గింది. 85 శాతానికి పైగా విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని పరీక్షల నియంత్రణ అధికారి సంయం భరద్వాజ్ ధృవీకరించారు. మొత్తం 94,028 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, అందులో 5.32 శాతం మంది 90 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించగా, 17,113 మంది అభ్యర్థులు (0.97 శాతం) 95 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 2025లో 1,29,095 (7.63 శాతం) ఉన్న 'కంపార్ట్‌మెంట్ (అనుబంధ పరీక్షకు అర్హత పొందిన) విద్యార్థుల సంఖ్య, 2026లో 1,63,800 (9.26 శాతం)కి పెరిగిందని ఆయన తెలిపారు. ఈ విద్యార్థులు ప్రధాన బోర్డు పరీక్షలో ఒకటి లేదా రెండు సబ్జెక్టులలో ఉత్తీర్ణులు కాకపోయినా, మిగిలిన సబ్జెక్టులలో మాత్రం ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షల్లో బాలికలు మరోసారి బాలురను అధిగమించి 88.86 శాతం ఉత్తీర్ణతను నమోదు చేయగా, బాలుర ఉత్తీర్ణత శాతం 82.13గా నమోదైంది. ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలను 19,967 పాఠశాలలు, 7,573 కేంద్రాలలో నిర్వహించారు. ఇందు కోసం 5.06 లక్షలకు పైగా ఇన్విజిలేటర్లను నియమించారు. మొట్టమొదటిసారిగా, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 12వ తరగతి పరీక్షా జవాబు పత్రాల మూల్యాంకనాన్ని 'ఆన్ స్క్రీన్ మార్కింగ్' (ఒఎస్ఎం) విధానం ద్వారా పూర్తిస్థాయిలో నిర్వహించింది. ఈ విధానంలో సుమారు 70,000 మంది మూల్యాంకనకర్తలు 98,66,622 జవాబు పత్రాలను డిజిటల్ పద్ధతిలో మూల్యాంకనం చేశారు. కంపార్ట్‌మెంట్ విభాగంలో ఉన్న విద్యార్థులు లేదా ఏదైనా ఒక సబ్జెక్టులో తమ పనితీరును మెరుగుపరుచుకోవాలనుకునే విద్యార్థులు, జులై 15న జరగనున్న అనుబంధ పరీక్షకు హాజరుకావచ్చని అధికారులు తెలిపారు. అభ్యర్థుల జాబితా (ఎల్ఒసి) సమర్పణ విండో జూన్ 2న ప్రారంభమం కానుంది. పరీక్షా ఫలితాలను cbse.gov.in వెబ్‌సైట్‌లో లేదా digiLockerలో పొందవచ్చు.

# మోదీ కాన్వాయ్ పరిమాణం తగ్గింపు

### అదే బాటలో పలువురు బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు



**న్యూఢిల్లీ :** భారత్‌లో ప్రధాని మోదీ పొదుపు జపం సాగుతోంది. పొదుపు పాటించాలని, ఇంధనంతో నడిచే వాహనాల వాడకాన్ని తగ్గించుకోవాలని ఆయన ఇటీవల ప్రజలు సూచనలు చేశారు. దీంతో కూడా మోదీ తన కాన్వాయ్ పరిమాణాన్ని గణనీయంగా తగ్గించారు. ఈ చర్య పలువురు బిజెపి ముఖ్యమంత్రులను కూడా ఇదే తరహా చర్యలు చేపట్టేలా, తమ వాహన సముదాయాలను తగ్గించుకునేలా ప్రేరేపించింది. ప్రధానమంత్రి ఇటీవలి దేశీయ పర్యటనలలో ఆయన కాన్వాయ్‌లో కుదింపు అమలు చేయబడిందని అధికార వర్గాలు తెలిపాయి. ఎస్‌పిజి ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన భద్రతా ఏర్పాట్లను కొనసాగిస్తూనే ఈ తగ్గింపు జరిగింది. హైదరాబాద్‌లో పలు పొదుపు చర్యలను సూచించిన మోదీ ప్రసంగం జరిగిన వెంటనే గుజరాత్, అసోంలో మోదీ కాన్వాయ్ పరిమాణాన్ని తగ్గించారు. కొత్తగా కొనుగోలు చేయకుండా, సాధ్యమైన చోటల్లా తన కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాలను చేర్చాలని కూడా ప్రధానమంత్రి కోరారని వర్గాలు తెలిపాయి. దీనిని స్ఫూర్తిగా తీసుకుని, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు వచ్చే వాహన సముదాయంలో తక్షణమే 50 శాతం తగ్గింపును ఆదేశించారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి దృష్ట్యా ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని, అనవసరమైన బంగారు కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. ప్రధాన కార్యదర్శి, డిజిపి, అదనపు ప్రధాన కార్యదర్శులు, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులతో జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన యోగి ఆదిత్యనాథ్, ప్రధానమంత్రి పిలుపునిచ్చిన పొదుపు చర్యలను రాష్ట్రవ్యాప్తంగా ఆచరణాత్మకంగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, తన కాన్వాయ్‌కు కనీస సంఖ్యలో వాహనాలను ఉపయోగిస్తానని ప్రకటించారు, తన మంత్రివర్గ సహచరులను కూడా అలాగే చేయమని కోరారు. 'తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు, భద్రతా దృష్ట్యా నా కాన్వాయ్‌లో కనీస సంఖ్యలో వాహనాలు ఉంటాయి, వాహన ర్యాలీలు ఉండవు. మంత్రులందరూ కూడా ప్రయాణించేటప్పుడు కనీస సంఖ్యలో వాహనాలను ఉపయోగిస్తారు' అని యాదవ్ అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఉపయోగించే అధికారిక వాహనాలపై పరిమితులను ప్రకటించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ కూడా తన కాన్వాయ్ వినియోగాన్ని తగ్గించాలని, ముఖ్యంగా భద్రతా ప్రయోజనాల కోసం అనవసర వాహనాలను ఉపయోగించకూడదని ఆదేశించారు. అధికారిక పర్యటనల కోసం విమానాలను ఉపయోగించే ముందు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నుండి ముందస్తు అనుమతి పొందాలని మహారాష్ట్ర ప్రభుత్వం మంత్రులందరినీ ఆదేశించింది. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, తాను గుజరాత్‌లో హెలికాప్టర్లు, విమానాలకు బదులుగా రైళ్లు, రాష్ట్ర రవాణా బస్సులు, ప్రజా రవాణాను ఉపయోగించి ప్రయాణిస్తానని, అలాగే ఇంధనాన్ని ఆదా చేయడానికి అధికారిక కాన్వాయ్‌ల పరిమాణాన్ని కూడా తగ్గిస్తానని ప్రకటించారు. విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలని ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తి నేపథ్యంలో, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కూడా తాను తలపెట్టిన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ చౌదరి, తాను ఉపయోగించే వాహనాల సంఖ్యను వ్యక్తిగతంగా సగానికి తగ్గించుకున్నానని, అవసరమైనప్పుడు మాత్రమే అధికారిక పర్యటనలు చేపడతానని ప్రకటించారు. బిహార్‌కు చెందిన మరో ఇద్దరు మంత్రులు, లేశీ సింగ్, శీలా మండల్ కూడా తాము వ్యక్తిగతంగా పొదుపు చర్యలు చేపడతామని ప్రకటించారు.

# వృద్ధులు, వితంతువుల ఆత్మగౌరవాన్ని బిజెపి హరించేస్తోంది

### Sపెన్షన్లు పెంచకుండా స్వప్రచారాలకు భారీ మొత్తాలు ఖర్చుచేస్తోంది : ఖర్గే విమర్శ




**న్యూఢిల్లీ :** ప్రధాని మోదీ పొదుపు జపంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన స్వప్రచారానికి భారీ మొత్తాలు ఖర్చు చేస్తూనే, పౌరులకు మాత్రం పొదుపు పాటించాలని ఉపదేశిస్తున్నారని మండిపడ్డారు. గత 12 ఏళ్లుగా వృద్ధాప్య పెన్షన్లను పెంచే విషయాన్ని ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇస్తున్న అతి స్వల్ప పెన్షన్లను పెంచకపోవడం ద్వారా ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని హరించివేస్తోందని ఖర్గే ఎక్స్‌లో బుధవారం ఆరోపించారు. 'నరేంద్ర మోదీ జీ, మీరు దేశానికి పొదుపు, త్యాగాల గురించి ఉపన్యాసాలు ఇస్తూనే, మరోవైపు భారతదేశంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని హరించివేస్తున్నారు. ఎందుకు? గత 12 ఏళ్లుగా, ధరల పెరుగుదల మా పేదలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నప్పటికీ, బిజెపి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్లను ఒక్క పైసా పెంచడానికి నిరాకరించింది' అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కొనుగోలు శక్తి 45 శాతం క్షీణించిన తర్వాత, ప్రస్తుతం రూ. 200 పెన్షన్ విలువ వాస్తవానికి సుమారు రూ. 110 మాత్రమే; రూ. 300 పెన్షన్ విలువ సుమారు రూ. 165,, రూ. 500 పెన్షన్ విలువ సుమారు రూ. 275 మాత్రమే అని అన్నారు. కానీ ఈ సిగ్గులేని ప్రభుత్వం మాత్రం, ప్రకటనలకు, భారీ స్వప్రచారాల కోసం ప్రతిరోజూ దాదాపు రూ. 1.5 కోట్లు ఖర్చు చేయడానికి మొగ్గు చూపుతోందని ఖర్గే ధజ్వమెత్తారు. '2014–15 నుండి 2024–25 మధ్య కాలంలో బిజెపి ప్రభుత్వం ప్రకటనల రూపంలో తన స్వప్రచారం కోసం మొత్తం రూ. 5,987.46 కోట్లు ఖర్చు చేసిందని ఆయన ఆరోపించారు. కోట్లాది మంది వృద్ధ పౌరులు కనీస మందులు, ఆహార అవసరాలను కూడా తీర్చలేని అతి తక్కువ పెన్షన్లతో బతుకు వెళ్లదీయడానికి నానా తంటాలు పడుతుంటే... మరోవైపు మోదీ ప్రభుత్వం, బిజెపి మాత్రం విలాసవంతమైన ఎన్నికల ప్రచారాలు, భారీ కాన్వాయ్‌లు, భారీ కార్యక్రమాలు, నిరంతర ప్రచారం కోసం విపరీతంగా ఖర్చు చేస్తూనే ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. 'రాజకీయ ఆర్భాటాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తూనే, మరోవైపు అణగారిన పౌరుల ఆర్థిక ఆత్మగౌరవాన్ని హరించే ఈ బిజెపి నమూనా అత్యంత క్రూరమైనదని, ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమ ఆసియా సంక్షోభం నేపథ్యంలో, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇంధనాన్ని ఆదా చేయాలని, బంగారం కొనవద్దని, విదేశీ పర్యటనలకు వెళ్లవద్దని భారతీయులకు ప్రధానమంత్రి మోదీ విజ్ఞప్తి చేసిన తర్వాత కాంగ్రెస్ ఈ విమర్శలు గుప్పించింది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై దర్యాప్తునకు జెపిసి వేయాలి

### నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలి : కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** నీట్ పరీక్ష రద్దు కావడంపై కేంద్రంపై కాంగ్రెస్ విరుచుకుపడుతూ విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అలాగే, ఈ 'ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం'పై విచారణ జరిపేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని (జెపిసి) ఏర్పాటు చేయాలని కోరింది. పరీక్ష రద్దు కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని కాంగ్రెస్ యువజన విభాగం అధిపతి ఉదయ్ భాను చిబ్, విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ కూడా డిమాండ్ చేశారు. 'నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఒక తీవ్రమైన సమస్య. గత 10 ఏళ్లలో 89 ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి, 48 సార్లు తిరిగి పరీక్షలు నిర్వహించాల్సి వచ్చింది. దీనిని బట్టి చూస్తే, విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉండాల్సిన బాధ్యతను అది పూర్తిగా విస్మరించిందని అర్థమవుతోంది' అని చిబ్ బుధవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. మనం ఆ విద్యార్థుల స్థానంలో ఉండి ఆలోచిస్తేనే, బహుశా వారి బాధను నిజంగా అర్థం చేసుకోగలుగుతామని, విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఈ పరీక్షలకు హాజరవుతారు, కానీ ప్రశ్నపత్రం లీక్ అయినప్పుడు, వ్యవస్థపై వారికి ఉన్న నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. ఈ వైఫల్యానికి బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. 'రెండు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని కూడా ఆపగల సత్తా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉందని బిజెపి గొప్పలు చెప్పుకుంటుంది; కానీ వాస్తవం ఏమిటంటే, ఆయన కనీసం ప్రశ్నపత్రాల లీకేజీలను కూడా అడ్డుకోలేకపోతున్నారని చిబ్ ఎద్దేవా చేశారు. ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆడిట్‌లను ఎవరు నిర్వహిస్తున్నారు? ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్టులను ఏ ప్రాతిపదికన కేటాయిస్తున్నారు? అనే విషయాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం పరిహారం అందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై విచారణ జరిపేందుకు ఒక జెపిసిని ఏర్పాటు చేయాలి ఇవే మా ప్రధాన డిమాండ్లు అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణానికి రాజస్థానే కేంద్ర బిందువుగా నిలిచిందని, అంతేకాకుండా ఈ వ్యవహారానికి రాజకీయ అండదండలు కూడా ఉన్నట్లు వెలుగులోకి వచ్చిందని జాఖర్ ఆరోపించారు. 'గత 10 ఏళ్లలో 89 ప్రశ్నపత్రాలు లీక్ కావడానికి (వీటిలో నాలుగు సార్లు నీట్ ప్రశ్నపత్రాలే లీక్ అయ్యాయి) 48 సార్లు తిరిగి పరీక్షలు నిర్వహించాల్సి రావడానికి అసలు కారణం ఏమిటి? ఈ ఘటనలు మన విద్యా వ్యవస్థ విశ్వసనీయతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మన విద్యార్థులు గ్రహించారు. తత్ఫలితంగా, విద్యార్థి లోకంలో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది' అని ఆయన అన్నారు.

# నందిగ్రామ్‌ను వదిలేసిన సువేందు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి బుధవారం కీలక ప్రకటన చేశారు. తాను భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని తన వద్దే ఉంచుకుంటానని, నందిగ్రామ్ స్థానాన్ని వదులుకుంటానని తెలిపారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన భవానీపూర్, నందిగ్రామ్ రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. అయితే బుధవారం నాడు రాష్ట్ర అసెంబ్లీలో భవానీపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. 'నందిగ్రామ్ నుండి (ఉప ఎన్నిక ద్వారా) మరొకరు ఎమ్మెల్యేగా ఎన్నికవుతారు. అయితే, రాబోయే ఐదేళ్ల కాలంలో నా లేమిని అక్కడి ప్రజలు ఏమాత్రం అనుభవించనివ్వను. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పాటు, నందిగ్రామ్ ప్రజలకు నేను ఇచ్చిన అభివృద్ధి వాగ్దానాలన్నింటినీ తప్పక నెరవేరుస్తాను' అని అధికారి అసెంబ్లీ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. మమతా బెనర్జీ పార్టీలో అధికారి ఒక అగ్రశ్రేణి నాయకుడిగా ఉన్న సమయంలో, 2009–2016 మధ్య నందిగ్రామ్ నుండి టిఎంసి ఎమ్మెల్యేగా ఫిరోజా బీబీ పనిచేసిన కాలాన్ని ప్రస్తావిస్తూ 'ఆ స్థానం నుండి అధికారికంగా ఎమ్మెల్యేగా నేను లేకపోయినప్పటికీ 2008 నందిగ్రామ్ పోలీసు కాల్పుల్లో అమరుడైన వ్యక్తి తల్లి అయిన ఫిరోజా బీబీకి నేను పూర్తి మద్దతును అందించాను. ఈసారి కూడా నేను అటువంటి పాత్రనే పోషిస్తాను' అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో, హోరాహోరీగా సాగిన పోరులో టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీని ఆమె కంచుకోట అయిన భవానీపూర్‌లో 15,105 ఓట్ల తేడాతో అధికారి ఓడించారు. అదే సమయంలో, తన సొంత నియోజకవర్గమైన నందిగ్రామ్‌లో తన సమీప ప్రత్యర్థి, తృణమూల్ కాంగ్రెస్ నేత పవిత్ర కర్ పై 9,665 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

## అసోంలో ఐదుగురు మంత్రులూ కోటీశ్వరులే

### ఒకరిపై క్రిమినల్ కేసు : ఎడిఆర్

**న్యూఢిల్లీ :** అసోంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఐదుగురూ కోటీశ్వరులేనని, వీరిలో ఒకరిపై క్రిమినల్ కేసు ఉందని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) బుధవారం వెల్లడించింది. మంగళవారం నాడు హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు, మరో నలుగురు ఎమ్మెల్యేలు బిజెపికి చెందిన రామేశ్వర్ తేలి, అజంతా నియోగ్; ఎజిపికి చెందిన అతుల్ బోరా; బిపిఎఫ్‌కు చెందిన చరణ్ బోరో కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. తన అఫిడవిట్‌లో బోరా తనపై ఒక క్రిమినల్ కేసు ఉన్నట్లు ప్రకటించారని, ఆ అభియోగం 'ప్రభుత్వ ఉద్యోగి, బ్యాంకర్, వ్యాపారి లేదా ఏజెంట్ ద్వారా జరిగే నేరపూరిత విశ్వాస భంగం (IPC సెక్షన్409)కు సంబంధించినదని ఆ నివేదిక పేర్కొంది. ఈ ఐదుగురు మంత్రులూ కోటీశ్వరులే. వీరిలో ముఖ్యమంత్రి శర్మ అత్యధికంగా రూ. 35 కోట్లకు పైగా విలువైన ఆస్తులను కలిగి ఉన్నారు. అదే సమయంలో ఆయన రూ. 16 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు కూడా ప్రకటించారు. ఈ ఐదుగురు మంత్రుల సగటు ఆస్తుల విలువ రూ. 10.99 కోట్లుగా ఉంది. మంత్రులలో ఒకరు తమ విద్యా అర్హతను 10వ తరగతిగా ప్రకటించగా, మిగిలిన నలుగురూ తమ విద్యా అర్హత గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ మంత్రివర్గంలో అజంతా నియోగ్ ఏకైక మహిళా మంత్రిగా ఉన్నారు.

# అభివృద్ధే ఆయన ఆకాంక్ష – సాగుపై తరగని మక్కువ

### మంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి సరిగ్గా 40 సంవత్సరాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆయన ఎక్కడున్నా అభివృద్ధి పరమైన ఆలోచనలే. ఎంత తీరిక లేని ప నిలో ఉన్నా, ఏ హోదాలోఉన్న సాగుపై మాత్రం తరగని మక్కువ. రైతుగా తాను పంట పండించడంతో పాటు వేలాది మంది రైతులకు సూచనలు ఇస్తూ సాగును లాభసాటిగా మార్చుకునేందుకు తన వంతు కృషి చేస్తుంటాడు. ఏ రాజకీయ పార్టీలో ఉన్న ఖమ్మంజిల్లా అభివృద్ధిపై మాత్రం ఆయనకు ప్రత్యేక దృష్టి ఉంటుంది. ముఖ్యంగా సాగునీటి వనరులు, రవాణా, పరిపాలన కార్యాలయాల నిర్మాణం పట్ల ఆయన ప్రత్యేకమైన ఆసక్తి. సువిశాలమైన ఖమ్మం జి ల్లాలో ప్రతి పల్లెలోనూ ఆయన చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన ఓ శిలాఫలకం ఉందంటే అ తిశయోక్తి కాదు. ఆయనే తుమ్మల నాగేశ్వరరా వు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న తుమ్మల నాగేశ్వరరావు మంత్రి గా బాధ్యతలు స్వీకరించి నేటికి సరిగ్గా 40 సంవత్సరాలు అవుతుంది. 1985 మే 14న ది వంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు మంత్రి వర్గంలో తొలిసారి మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు గెలిచినా ఓడినా ప్రజల మధ్యనే నిలిచి పదవిలో ఉన్నా లేకున్నా అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. తొలిసారి 1983లో సత్తుపల్లి నియోజక వర్గం నుంచి అప్పటి రాజకీయ ఉద్దండుడుగా పేరొందిన జల గం వెంగళరావును ఢీకొన్నారు. స్వల్ప తేడాతో ఓటమి చెందిన ఎన్‌టి రామారావు గెలిచిన వారి కంటే తుమ్మలను సమావేశంలో అందరికి పరిచయం చేస్తూ ఖమ్మం జిల్లా రాజకీయ భవిష్యత్తు నేతగా తుమ్మలను అభివర్ణించాడు. ఎన్‌టి రామారావు నోటి వెంట వచ్చిన ఆ పలుకులు వృధా కాలేదు. 1985లో అదే సత్తుపల్లి నియోజక వర్గం నుంచి గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో పలు శాఖలను నిర్వహించిన ఆయన చంద్రబాబుకు కుడి భుజంగా పనిచేశారు. చంద్రబాబు నాయుడు పదేళ్ల పదవి కాలంలో తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు వేశారు. పేరూరు నుంచి ఎర్రుపాలెం వరకు అశ్వారావుపేట నుంచి నాయకన్ గూడెం వరకు ఆయన అభివృద్ధి ఎక్కడ చూసిన కనపడుతుంది. తాలిపేరు ప్రాజెక్టు, గోదావరిపై రెండవ బ్రిడ్జి మొద లు రామాలయం అభివృద్ధి, పలు సాగునీటి ప్రాజెక్టులతో ఏజెన్సీకి నూతన జవ సత్వాలను తీసుకువచ్చారు. ముఖ్యంగా పరిపాలన కార్యాలయాల నిర్మాణం, పాలనలో పారదర్శకత పట్ల తుమ్మలను నిరంతరం మననం చేసుకోవాల్సిందే. కరువు మండలంగా పేరొందిన తిరుమలాయపాలెంను సస్యశ్యామలం చేసే దిశగా భక్తరామదాసు ప్రాజెక్టు చేపట్టి అనతి కాలంలోనే పూర్తి చేయడం ద్వారా ఆ ప్రాంత రైతుల దశాబ్దాల కలను నెరవేర్చారు. మండు వేసవిలోనూ చెరువుల్లో పుష్కలంగా నీరు ఉన్నాయంటే అది తుమ్మల చలువేనని జగమెరిగిన సత్యం. ముఖ్యంగా రహదారుల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న భావనతో ఆయన రహదారుల నిర్మాణంపై దృష్టిసారించి పలు చారిత్రాత్మక ప్రాజెక్టులను సాధించారు. రైతుగా తుమ్మల అందరికీ సుపరిచితుడు. గత రెండేళ్లుగా తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ సాగు విస్తృతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. సాంప్రదాయ పంటల స్థానే లాభసాటి పంటలను సాగు చేయాలన్న ఆయన ఆలోచనకు అనుగుణంగా రైతులను కదిలిస్తున్నారు. మొత్తంగా మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తుమ్మల ప్రస్తుత రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. వ్యవసాయ రంగం ఒక సంక్లిష్ట స్థితిలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అవినీతి మచ్చలేని మంత్రిగా ఆయన పేరొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇప్పటి తెలంగాణలోనూ సీనియర్ మంత్రిగా తుమ్మ ల నాగేశ్వరరావు కృషి అపూర్వం, అనిర్వచనీయం. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని, ఆయురారోగ్యాలతో జిల్లా అభివృద్ధికి పునరంకితం కావాలని ఆశిస్తూ ...

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం



**చెన్నై :** సీనియర్ రాజకీయ నేత, ఎఐఎన్ఆర్‌సి వ్యవస్థాపకుడు ఎన్. రంగస్వామి బుధవారం ఐదవసారి పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎఐఎన్ఆర్‌సి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో, ప్రాంతీయ పార్టీకి చెందిన మల్లాడి కృష్ణారావు, బిజెపికి చెందిన ఎ. నమశ్శివాయం అనే మరో ఇ ద్దరు కేబినెట్ సభ్యులు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెం ట్ గవర్నర్ కె. కైలాసనాథన్, ముఖ్యమంత్రి, ఆయన కేబినెట్ సహచరులతో ప్ర మాణం చేయించారు. రంగస్వామి దేవుడి పేరు మీద ప్రమాణం చేయగా, మ ల్లాడి కృష్ణారావు తెలుగులో ప్రమాణం చేశారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని పుదుచ్చేరి ఎన్‌క్లేవ్ అయిన యానాంకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రమాణం స్వీ కార కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, సీనియర్ నాయకుడు బిఎల్ సంతోష్ వేదికపై ఆశీనులయ్యారు. ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఏప్రిల్ 9న జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం సాధించి అధికారాన్ని నిలబెట్టుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రంగస్వామిని ముఖ్యమంత్రిగా నియమించారు.

**రంగస్వామిగా ప్రధాని శుభాకాంక్షలు**

ఇదిలా ఉండగా, పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రంగస్వామికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ఆయనతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నానని, ఆయన రాబోయే పదవీకాలానికి నా శుభాకాంక్షలు అని మోదీ ఎక్స్ అనే పోస్ట్‌లో పేర్కొన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఎ. నామశివాయం, మల్లాడి కృష్ణారావులకు కూడా ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. 'వారు పుదుచ్చేరి పురోగతికి మరింత ఊపునిచ్చి, ప్రజల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది. నా శుభాకాంక్షలు' అని ఆయన అన్నారు.




## అర్జెంటీనాలో వేలాదిమంది నిరసన ప్రదర్శన

**బ్యూనస్ ఎయిర్స్:** దక్షిణ అమెరికా దేశం అర్జెంటీనా ప్రధానమంత్రి జేవియర్ మిలేయ్ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కేటాయించే నిధుల్లో కోత విధించడంతో వేలాదిమంది విద్యార్థులు,ఫ్యాకల్టీ వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు ప్రారంభించారు. రహదారులను స్తంభింపజేశారు. దేశవ్యాప్తంగా ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రభుత్వం చెబుతున్న బడ్జెట్ లోటు ప్రకటనలను ఖండిస్తూ, ఉన్నతవిద్యా వ్యవస్థ పునాదనులను పాలకులు చావుదెబ్బతీస్తున్నారని విమర్శిస్తూ రాజధాని బూనస్ ఎయిర్స్‌లో వేలాదిమంది విద్యార్థులు,ఉపాధ్యాయులు అధ్యక్ష భవనంవైపు కవాతు చేశాయి. 1949 నుండీ అర్జెంటీనాలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉచితంగా విద్య అందిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే విద్యారంగంలో గొప్ప ఫలితాలను అందించాయి. దేశానికి ఐదుగురు నోబెల్ బహుమతి గ్రహీతలను అర్జెంటీనా విశ్వవిద్యాలయాలు అందించాయి. విశ్వవిద్యాలయాల నిర్వహణ ఖర్చులకు నిధులు అందించడానికి, అధ్యాపకుల వేతనాలు పెంచడానికి గత సంవత్సరం కాంగ్రెస్ ఒక చట్టాన్ని ఆమోదించింది. ఐతే ఈ చట్టాన్ని ప్రభుత్వం కోర్టులో సవాలు చేస్తోంది. బడ్జెట్ పెరిగిపోయిందని, అవినీతి పెరిగిందని, దీనిని తగ్గించాలని పాలకులు కోరుతున్నారు.

## వేగం పుంజుకున్న నేపాల్—చైనా ద్వైపాక్షిక సంబంధాలు

**కాఠ్మండు:** నేపాల్—చైనా మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సహకార కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు దేశాలమధ్యా సహకార మార్పిడికి సంబంధించిన పర్యటనలను మరింత ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే నేపాల్‌లో చైనా సహకారంతో మూడు రకాల కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఉచిత సహాయం,వడ్డీలేని రుణాలు,రాయితీ రుణాల ప్రాతిపదికపై నడుస్తున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించాలని చైనా కోరుతూ ఉండటంతో రెండు దేశాలమధ్య రాబోయే రెండు నెలల్లో ఉధృతంగా పర్యటన కార్యక్రమాలు కొనసాగుతాయి. నేపాల్‌లో చైనా నిర్వహిస్తున్న ప్రాజెక్టులపై జూన్ రెండో తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు నేపాల్ విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లోక్ బహదూర్ పౌడెల్ చెప్పారు. వివిధ స్థాయిలలో ఇరుదేశాలలో ప్రతినిధుల పర్యటనలు కొనసాగుతాయని చెప్పారు. నేపాల్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్యం, మానవ వనరుల అభివృద్ధి,పారిశ్రామికీకరణ,కీలక వనరులు,నీటి వనరుల అభివృద్ధిపైనే ప్రధానంగా చైనా సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# భారత్‌కు ఇంధన సరఫరాపై రష్యా భరోసా

**● చౌకగా వచ్చే రష్యా చమురును అడ్డుకుంటున్నారు ● పశ్చిమదేశాలపై లోవరోవ్ తీవ్ర విమర్శలు**



**మాస్కో:** భారత్‌కు ఇంధన సరఫరాలకు సంబంధించిన అన్ని ఒప్పందాలను రష్యా పూర్తి చేస్తుందని ఆ దేశ విదేశీవ్యవహారాలమంత్రి సెర్గీ లోవరోవ్ చెప్పారు. రష్యా చమురు కోనుగోలు చేయవద్దని పశ్చిమదేశాలు ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకువస్తూ నీతిమాలిన పద్ధతులకు పాల్పడుతున్నాయని ఆయన ఖండించారు. గురు,శుక్రవారాల్లో భారత్ రాజధాని న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ దేశాల విదేశీమంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఆయన బయలుదేరే ముందుగా 'రష్యా టుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఇంధన సరఫరాలో అవాంఛనీయమైన పోటీ ఉన్నప్పటికీ కూడా ఒప్పందాల ప్రకారం భారత్‌కు ఇంధన సరఫరాలను పూర్తిచేస్తామని చెప్పారు. రెండు దేశాలమధ్యా ఉన్న సంబంధాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఆయన ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో తాను ఎన్నడూ చూడనంత గొప్ప శక్తిసామర్థ్యాలుగల నాయకులలో ఒకడని అన్నారు. ''భారత్ ప్రయోజనాలకు నేను పూర్తి భరోసా ఇవ్వగలను, రష్యా వల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదు, పూర్తిగా ఇంధన సరఫరాలు చేస్తాం, ఇచ్చిన హామీలకు అనుగుణంగా సరఫరాలు చేస్తాం'' అని చెప్పారు. రష్యా ఏనాడూ తనతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో విఫలం కాలేదన్నారు. కుడంకుళంలో ఉన్న అణు ఇంధన కర్మాగారం తమకు అత్యంత ప్రముఖమైన ప్రాజెక్టు, ఈ ప్రాజెక్టు ద్వారా భారత్‌కు గణనీయంగా అవసరాలు తీరతాయి, కొత్త ఇంధన యూనిట్లను నిర్మించడంతో సహకారం ఉంటుంది, భారత్‌కు సహకారం కావాలి, ఈ ప్రక్రియ కొనసాగుతుంది, హైడ్రో కార్బన్ వంటి వాయువులను సరఫరా చేయడాన్ని మేం కొనసాగిస్తాం అని లోవరోవ్ చెప్పారు. కుండంకుళం ప్రాజెక్టు తమిళనాడు రాష్ట్రంలో ఉంది. రష్యా సాంకేతికత సహాయంతో దీనిని నిర్మించారు. 2002లో ఈ నిర్మాణం మొదలై 2016లో పూర్తయింది. ఈ ప్రాజెక్టు ద్వారా క్రమంగా 1000 మెగావాట్ల సామర్థ్యంగల ఇంధనం వస్తుంది. రష్యా చమురు కొనకుండా అడ్డుకుంటూ పశ్చిమ దేశాలు నీతిమాలిన పద్ధతులు అనుసరిస్తున్నాయని లోవరోవ్ విమర్శించారు. ఇవన్నీ నూతన వలసవాద పద్ధతులు,దోపిడీ పద్ధతులు అని విమర్శించారు. రష్యా నుండి చౌకగా చమురు లభిస్తుంటే ఆ చమురును అన్ని దేశాలు కొనుగోలు చేయకుండా అడ్డపడి అత్యంత ఖరీదుకు అమెరికా నుండి ద్రవీకృత సహజవాయువును కొనుగోలు చేయించడమే ఈ నీతిమాలిన పద్ధతుల వెనుక ఉన్న అసలైన ఉద్దేశమని విమర్శించారు. లోవరోవ్ న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సమావేశంలో పాల్గొంటారు. పశ్చిమాసియా,ఐక్యరాజ్యసమితి విషయాల్లో సహకారం,జి—20 వంటి విషయాలపై ఈ సమావేశం దృష్టి కేంద్రీకరిస్తుంది.

## గాలిలో దీపంలా స్టార్మర్ భవితవ్యం

**● మంత్రి స్ట్రీటింగ్ రాజీనామాకు సిద్ధం ● బ్రిటన్‌పార్లమెంటులో రాజు ఛార్లెస్ ప్రసంగం**



**లండన్:** బ్రిటన్ రాజు ఛార్లెస్—3 బుధవారం హౌస్ ఆఫ్ లార్డ్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. పార్లమెంటు సమావేశాలను రాజు ప్రారంభిస్తూ ప్రభుత్వ ప్రణాళిక,ఎజెండా ఆవిష్కరించారు. అస్థిర ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్ళ బ్రిటన్ ఆర్థిక భద్రత గురించి రాజు తన ప్రసంగంలో హెచ్చరికలు చేశారు. బ్రిటన్ రాజు ఒకవైపు సభను ఉద్దేశించి ప్రసంగిస్తుంటే, మరోవైపు అధికారం మార్పిడికోసం మొదలైన పెద్ద పోరాటం తెరవెనుక కొనసాగుతూనే ఉంది. ఈ సంక్షోభ పరిస్థితుల్లో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ పదవీ భవిష్యత్తు గాలిలో దీపంలా మారింది. ఆరోగ్యశాఖామంత్రి వెస్ స్ట్రీటింగ్ ఆయనను సవాలు చేస్తున్నారు. కాబోయే ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆయన అందరిముందుకూ వస్తున్నారు. రాజు సభలో ప్రసంగిస్తున్నప్పుడు స్టార్మర్ మొదటిరోజు స్కూలుకు వెళ్ళిన పిల్లాడిలా బిక్కమొఖం వేసుకున్నారని బ్రిటన్ మీడియా వ్యాఖ్యానించింది. ఐతే రాజు ప్రసంగ సమయంలో స్ట్రీటింగ్ ఎక్కడా సభలో కనిపించలేదు. ఈ తరుణంలో విభేదాలు పరిష్కరించుకుని పదవిలో కొనసాగేందుకు స్టార్మర్ సిద్ధమయ్యారు. ఆయనను సవాలు చేస్తున్న స్ట్రీటింగ్‌తో హౌస్ ఆఫ్ లార్డ్స్ సమావేశానికి ముందుగా కీర్‌స్టార్మర్ టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో 16 నిమిషాలు సమావేశం జరిపారు. ఐతే దేశ రాజు,రాణి పార్లమెంటుకు వచ్చి ప్రసంగిస్తున్న తరుణంలో ప్రధానమంత్రికి ఎలాంటి ఇబ్బందీ కలిగించకూడదని లేబర్‌పార్టీ నాయకులు నిర్ణయించుకున్నారు. బహుశా వెస్ స్ట్రీటింగ్ గురువారంనాడు స్టార్మర్‌తో నువ్వా,నేనా? అనే స్థాయిలో తలపడే అవకాశం ఉంది. ఇయన తన మంత్రిపదవికి రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ పరిస్థితులమధ్య హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో కీర్‌స్టార్మర్ లేబర్‌పార్టీ ఎంపీలకు విజ్ఞప్తి చేస్తూ విభజన రాజకీయాలలో కూరుకుపోవద్దని కోరారు. పార్టీల ఎంపీల ఐక్యతకోసం విజ్ఞప్తి చేశారు. ఇది అధికారంకోసం కుమ్ములాడుకునే సమయం కాదని, ఐక్యతగా ఉండాలని స్టార్మర్ మద్దతుదారులు నిన్నటినుండి విజ్ఞప్తులు చేస్తున్నారు. దాదాపు 100 మంది ఎంపీలు ఆయన వెంట ఉన్నారని చెబుతున్నారు. కానీ 81 మంది ఎంపీలు స్టార్మర్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## లెబనాన్‌పై ఐడిఎఫ్ దాడులు:13 మంది మృతి



**బీరూట్:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడులవల్ల దక్షిణ లెబనాన్‌లో 13 మంది మరణించారు. నేషనల్ న్యూస్ ఏజన్సీ సమాచారం ప్రకారం కఫర్‌డౌనిన్ ప్రాంతంలోని ఒక ఇంటిపై ఐడిఎఫ్ చేసిన దాడిలో ఆరుగురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. అంతకుముందు ఆరోగ్యశాఖ సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఒకరు మరణించారు. మరో ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలు కూడా దాడుల్లో మరణించారు. నబాటియే ప్రాంతంలో ఇద్దరు సివిల్ డిఫెన్స్ సభ్యులు హుస్సేన్‌జాబెర్, అహ్మద్ నౌరా మరణించడంతో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ వారికి తీవ్ర సంతాపం తెలియజేశారు. కాల్పుల విరమణ పేరుకే అమలులో ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ సైన్యం ఆత్మరక్షణ పేరుతో దురాగతాలకు, మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. హెజ్బొల్లా—ఇజ్రాయెల్ సైన్యం మధ్య జరుగుతున్న పరస్పర దాడులవల్ల కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైంది. మార్చి రెండో తేదీన లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడులు ప్రారంభించింది. అప్పటినుండీ దక్షిణ లెబనాన్‌లో 2,860 మంది మరణించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత 380 మంది మరణించారు. వందలమంది గాయపడ్డారు. 10 లక్షలమంది పైగా సామాన్య ప్రజలు నివాసాలు పోగొట్టుకుని శరణార్థులుగా మారారు. అనేక గ్రామాలను, పట్టణాలను ఇజ్రాయెల్ సైన్యం ఖాళీ చేయించింది. గ్రామస్థులు తిరిగి రాకూడదని ఆదేశించింది. లెబనాన్‌లోకి 10 కి.మీ లోపలకు చొచ్చుకువెళ్ళి బఫర్ జోన్‌ను విస్తరించింది.

**ఉల్లంఘనలమధ్య నేడు,రేపు శాంతి చర్చలు**

ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘన,పరస్పర దాడులు జరుగుతున్న సమయంలో వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్—లెబనాన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధులమధ్య మే 14—15 తేదీలలో వాషింగ్టన్‌లో ముఖాముఖీ చర్చలకు అమెరికా సన్నాహాలు పూర్తిచేసింది. ఐతే ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న దురాక్రమణ చర్యలు చర్చలకు ఆటంకాలుగా మారాయని, విశ్వసనీయతను ఐడిఎఫ్ దెబ్బతీస్తోందని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ విమర్శించారు. సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆరోగ్య కార్యకర్తలను ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని హతమార్చిందని విమర్శించారు. అంతర్జాతీయ నిబంధనలను ఎంతమాత్రం ఇజ్రాయెల్ పట్టించుకోవడంలేదని అన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ ఇప్పటివరకూ 140 దాడులు చేయగా, వీటిల్లో 108 మంది అత్యవసర సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు మరణించారని చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వంలో ఇప్పటికే రెండుసార్లు రెండు దేశాలమధ్య విదేశీ వ్యవహారాల ప్రతినిధుల స్థాయిలో ముఖాముఖీ సమావేశం,చర్చలు జరిగాయి.

## గుడికి వెళ్లడం తప్పనిసరేం కాదు

(మొదటి పేజీ తరువాయి)

దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరిపే క్రమంలో బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి కూడా ఉన్నారు. శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని 4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునస్సమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా 15వ రోజున (బుధవారం) మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, ''అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు' అని ఆమె పేర్కొన్నారు. 'ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డురాలేరు' అని జస్టిస్ నాగరత్న తెలిపారు. 'ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది' అని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ ఈసందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# తెలంగాణ మాజీ సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**సిఎం రేవంత్ రెడ్డికి సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్ఆర్ బాబు బుధవారం సిఎం ఎ రేవంత్ రెడ్డి తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రిగేడియర్ ఎన్ఆర్ బాబు తెలంగాణ మాజీ సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీనికి సంబంధించిన విధివిధానాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇతర రాష్ట్రాలలో మాజీ సైనిక కార్పొరేషన్లు ఎలా పనిచేస్తున్నాయో,వాటి విధానాలు,నమూనాలను సేకరించి త్వరలో సమావేశం ఏర్పాటు చేద్దామని సూచించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉన్న రాజ్య సైనిక బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని బ్రిగేడియర్ ఎన్ ఆర్ బాబు సి ఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ ఆ సమావేశాన్ని కూడా తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. గవర్నర్ చైర్మన్‌గా ఉన్న స్టేట్ మేనేజింగ్ కమిటీ ఏర్పాటు సంబంధిత ఉత్తర్వులను త్వరగా జారీ చేయాలని బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు కోరగా, ప్రభుత్వం త్వరలోనే ఆ ఉత్తర్వులను విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇంకా మాజీ సైనికులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే, పూర్తి స్థాయి ప్రతి



పాదనలతో ముఖ్యమంత్రి గారి ప్రత్యేక కార్యదర్శికి అందజేయాలని, వాటిని పరిశీలించి తగిన చర్య లు తీసుకుంటామని సిఎంపేర్కొన్నారు. మాజీ సైనికుల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని కూడా తెలిపారు. మాజీ సైనికుల కోసం సమయం కేటాయించి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రికి సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి పాల్గొన్నారు.

## పరిమితులు ఆక్షేపణీయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. కానీ ఈ తీర్పును భారత కమ్యూనిస్టుపార్టీ చాలా విమర్శనాత్మకమైన దృష్టితో స్వీకరించింది. ఈ విధంగా సుప్రీంకోర్టు తీర్పులో చెప్పిన భాష్యం అపాయాలకు దారితీస్తుంది. మరింత సంక్లిష్టతను తీసుకువస్తుంది. వాస్తవజీవితంలో చూసినప్పుడు భారతదేశంలో కులపరమైన అణచివేత అమలులో ఉంది. ఈ ఘటనలు తరచు జరుగుతున్నాయి. పైగా రోజు రోజుకూ ఈ విధమైన అణచివేత పెరుగుతోంది.

కులపరమైన వివక్ష,హింస కేవలం బహిరంగ ప్రదేశాలకు మాత్రమే పరిమితం కాదు.మాటలతో దూషించడం, సంభాషణల ద్వారా మానసికంగా కుమిలిపోయేట్లు చేయడం,సామాజికపరంగా వెలివేయడం, అంటరానితనం అమలు చేయడంతోపాటు శారీకంగా హింసించే ఘటనలన్నీ కేవలం బహిరంగ ప్రదేశాలకు మాత్రమే పరిమితం కాబోవు. ఇళ్ళల్లో, పనిప్రదేశాల్లో, ఇతరత్రా ప్రైవేటుగా ఉన్న ప్రదేశాలలో కూడా కులపరమైన దొంతర్ల వ్యవస్థ కొనసాగే ప్రదేశాలలో ఈ ఘటనలన్నీ జరుగుతాయి. దీనిని ప్రజలమధ్యలో జరిగితే మాత్రమే కులవివక్షగా, కులపరమైన అణచివేతగా చూడాలనే కొలమానం సరైన భాష్యం కాదు. అందువల్ల 1955 నాటి ఎస్‌సి,ఎస్‌టి పౌరహక్కుల రక్షణ చట్టం స్ఫూర్తిని సుప్రీంకోర్టు తీర్పు పట్టించుకున్నట్టుగా కనిపించలేదు, అంటరానితనాన్ని సదరు 1955 నాటి చట్టం నేరంగా పరిగణించింది,

అన్ని రకాల సామాజిక వైకల్యాలు,వివక్షలు కులవ్యవస్థను పాటించడంవల్లే మొదలవుతాయి, అందువల్ల కులపరమైన అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి గుర్తింపు ఉండాలి, నిత్యజీవితంలో ఏ విధంగా కులాధికారం, కులాధిపత్యం తన ప్రభావాన్ని చూపిస్తోందనే విషయానికి గుర్తింపు ఇవ్వడం ద్వారా చట్టాన్ని అమలు చేయాలి, ప్రైవేటు ప్రదేశాలలో కూడా ఇలాంటి ఘటనలు జరుగుతాయి, అక్కడ కూడా బాధితులు మానసికంగా కుమిలిపోతారు, అవమానాలకు గురవుతారు, చాలా సున్నితమైన ప్రదేశాలలో వారంతా ఏకాకులు అవుతారు. దేశవ్యాప్తంగా కులపరమైన అణచివేత,అక్రమాలు,ఆరాచకాలు బాగా పెరుగుతున్నాయి. ఈ సందర్భాలలో న్యాయపరమైన తీర్పులు, న్యాయమూర్తులు తీర్పుల సందర్భంగా చెప్పే భాష్యాలు, వ్యాఖ్యలు అణగారిన వర్గాల రక్షణకోసం రాజ్యాంగం ఏర్పాటు చేసిన చట్టాలకు మరింత ఊతం ఇచ్చే విధంగా ఉండాలి, ఉన్న చట్టాలను మరింత పటిష్టవంతం చేసేవిగా న్యాయతీర్పులు,భాష్యాలు ఉండాలి, గౌరవ మర్యాదలు, సమానత్వం,సామాజిక న్యాయం వంటివాటి కోసం జరిగే పోరాటంలో ఎలాంటి సంకుచితత్వాలకు తావు ఉండకూడదు'' అని డి.రాజా తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## దృష్టిపెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఉబెర్ ప్రతినిధులను ఆయన కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని, భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు.

ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సిఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని సిఎం తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సిఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (జిబిఓ) మధు కన్నన్, ఉబెర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రబ్జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## 'విజయ్'డు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి విజయ్ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అన్ని పార్టీలకు చెందిన శాసనసభ్యులు ఆ తీర్మానంపై మాట్లాడారు. స్పీకర్ జెసిడి ప్రభాకర్, డివిజన్ల వారీగా ఓటింగ్ నిర్వహించిన అనంతరం, అసెంబ్లీ విశ్వాస తీర్మానం కోరుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానం గెలిచిందని, 144 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారని ప్రకటించారు. 22మంది ఎమ్మెల్యేలు వ్యతిరేకించగా, ఐదుగురు తటస్థ వైఖరి తీసుకున్నారని ఆయన అన్నారు. 59 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకె, తీర్మానంపై ఓటింగ్ జరగడానికి ముందే వాకౌట్ చేసింది. ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షమైన, టిటివి దినకరన్ నేతృత్వంలోని ఎఎంఎంకె నుంచి బహిష్కరించబడిన ఎమ్మెల్యే ఎస్. కామరాజ్, ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన వారిలో ఉన్నారు. ఆయన ప్రభుత్వానికి ఐదేళ్లపాటు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు.

**గత ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయ్ : విజయ్**
విశ్వాస తీర్మానం కోరుతూ తాను ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలకు సమాధానమిస్తూ, తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ లౌకికంగా ఉంటుందని, గత ప్రభుత్వాలు ప్రారంభించిన సంక్షేమ పథకాలను అమలు చేయడం కొనసాగిస్తుందని విజయ్ అన్నారు. ప్రభుత్వం వేగంగా పనిచేస్తున్నప్పటికీ ఎలాంటి ఫిరాయింపులకు పాల్పడదని ఆయన స్పష్టం చేశారు. ఈ తీర్మానంపై మాట్లాడిన డిఎంకె, డిఎండికె శాసనసభ్యులు, ముఖ్యమంత్రికి ప్రత్యేక విధి అధికారి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)ని నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఎఐఎడిఎంకె శాసనసభ్యుడు వేలుమణి మాట్లాడటానికి లేవగానే, ప్రత్యర్థి వర్గ పార్టీ శాసనసభ్యులు ఆయనను వ్యతిరేకించడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ప్రజా ప్రార్థనా స్థలాలు, విద్యా సంస్థల సమీపంలోని 717 ప్రభుత్వ మద్యం రిటైల్ దుకాణాలను మూసివేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వును పిఎంకె ఎమ్మెల్యే సౌమ్య అన్బుమణితో సహా కొందరు ఎమ్మెల్యేలు స్వాగతించారు. పిఎంకె మద్యపాన నిషేధానికి గట్టి మద్దతుదారుగా ఉంది. సిపిఐ, సిపిఐ (ఎం), విసికె, ఐయుఎంఎల్ వంటి బయటి పార్టీల మద్దతుతో విజయ్ తన తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న తర్వాత, 13వ తేదీ లేదా అంతకంటే ముందుగా ఫ్లోర్ టెస్ట్ నిర్వహించాలన్న గవర్నర్ ఆర్.వి. అర్లేకర్ ఆదేశాల మేరకు సభలో బుధవాం ఫ్లోర్ టెస్ట్ జరిగింది. ఓటు వేయని స్పీకర్‌తో సహా అధికార టీవీకే పార్టీకి మొత్తం 107 మంది సభ్యుల బలం ఉంది. అధికార పార్టీ ఇప్పటికే తన ప్రభుత్వానికి ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతును పొందింది. దీనితో పాటు, సిపిఐ, సిపిఐ (ఎం), విసికె, ఐయుఎంఎల్‌లకు ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలతో కూడా గత వారం టివికె ప్రభుత్వానికి తమ బయటి మద్దతును ప్రకటించాయి. ఇదిలా ఉండగా, పార్టీ అధినేత పళనిస్వామిని వ్యతిరేకిస్తున్న, సీనియర్ నాయకులు వేలుమణి, షణ్ముగం నేతృత్వంలోని 24 మంది ఎఐఎడిఎంకె ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. పళనిస్వామికి విధేయులుగా ఉన్న ఎఐఎడిఎంకె ఎమ్మెల్యేలు తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తామని ఇప్పటికే చెప్పారు. అంతేకాకుండా, పార్టీ ఆదేశాలను ధిక్కరించే ఎమ్మెల్యేలపై ఫిరాయింపుల నిరోధక చర్యలు వర్తిస్తాయని కూడా హెచ్చరించారు. సోమవారంనాడు స్వల్పకాలిక 3 రోజుల సమావేశం కోసం సమావేశమైన సభ, ఆ తర్వాత నిరవధికంగా వాయిదా పడింది.

## వరి @ రూ.2,441

(మొదటి పేజీ తరువాయి)

సేకరించాం. యుపిఎ హయాం కంటే నాలుగు రెట్లు అధికంగా రైతులకు ఖరీఫ్ చెల్లింపులు చేస్తున్నాం' అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

**పంటల వారీగా కనీస మద్దతు ధరలు...**
క్వింటా వరికి కనీస మద్దతు ధర రూ.2,441, క్వింటా వరి (ఎ—గ్రేడ్)కి కనీస మద్దతు ధర రూ.2,461, క్వింటా జొన్నలు (హైబ్రిడ్) కనీస మద్దతు ధర రూ.4,023, క్వింటా జొన్నలు (మల్దండి) కనీస మద్దతు ధర రూ.4,073, క్విం టా సజ్జల కనీస మద్దతు ధర రూ.2900, క్వింటా రాగుల కనీస మద్దతు ధర రూ.5,205, క్వింటా మొక్కజొన్నల కనీస మద్దతు ధర రూ.2,401, క్వింటా కందుల కనీస మద్దతు ధర రూ.8,415, క్వింటా పెసల కనీస మద్దతు ధర రూ.8,780, క్వింటా మినుముల కనీస మద్దతు ధర రూ. 8,200, క్వింటా పత్తి (మధ్యశ్రేణి) కనీస మద్దతు ధర రూ.8,267, క్వింటా పత్తి (దీర్ఘ శ్రేణి) కనీస మద్దతు ధర రూ.8,667, క్వింటా పల్లి కనీస మద్దతు ధర రూ.7,517, క్వింటా ప్రొద్దుతిరుగుడు విత్తనాల కనీస మద్దతు ధర రూ.8,343, క్వింటా సోయాబీన్ (ఎల్లో) కనీస మద్దతు ధర రూ.5,708లుగా కేంద్రం ప్రకటిచింది.

**కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి కేటాయింపులు**
స్వచ్ఛమైన ఇంధన (క్లీన్ ఎనర్జీ) ఉత్పత్తిని పెంపొం దించడం, విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా హరించే దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం లక్ష్యంగా బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రూ.37,500 కోట్ల మేర ప్రోత్సాహకానికి మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది. 'ఈ కోల్ గ్యాసిఫికేషన్ కోసం రూ.37,500 కోట్లను కేటాయించాం. దీని ద్వారా దాదాపు రూ.3000 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాం. అలాగే 75 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేయడానికి ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం జరుగుతుంది' అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. మన దేశంలో ప్రస్తుతం 401 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఇవి రానున్న 200 ఏళ్లకు సరిపోతాయని వైష్ణవ్ పేర్కొన్నారు. 'ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల గురించి మనందరికీ తెలుసు. కాబట్టి మనం ఆత్మ నిర్భర్ (స్వయం సమృద్ధి)గా మారడానికి అన్ని రకాల నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే బొగ్గు గ్యాసిఫికేషన్‌పై ఈ రోజు ఒక పెద్ద నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని వైష్ణవ్ చెప్పారు. కోల్ గ్యాసిఫికేషన్ అంటే పొడి బొగ్గును సింథటిక్ గ్యాస్ (సింగ్యాస్)గా మార్చే ప్రక్రియ. దీనిని ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగిస్తారు. ఇది కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ ప్రక్రియ ద్వారా మిథనాల్, ఎరువులు, హైడ్రోజన్, రసాయనాల ఉత్పత్తి చేయడానికి వీలవుతుంది. దీని వల్ల మనం దిగుమతి చేసుకునే చమురు (83 శాతం), మిథనాల్ (90 శాతానికి పైగా), అమ్మోనియా (13 15 శాతం)పై ఆధారపడడం తగ్గుతుంది. అంతే కాదు ఇది ఎల్ఎన్‌జీ, యూరియా, అమ్మోనియం నైట్రేట్, అమ్మోనియా, కోకింగ్ కోల్ లాంటి వాటి దిగుమతులపై ఆధారపడడం తగ్గిస్తుంది. అదే సమయంలో దేశీయ వనరుల వినియోగాన్ని పెంచి స్వయంసమృద్ధిని ప్రోత్సహిస్తుంది. అందుకే 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని సాధించాలని దేశం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఐపిఎల్‌లో కోహ్లీ హవా..

## ఆడకుండానే ధోనీ మ్యాజిక్, సోషల్ మీడియాలో వీరే టాప్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ చివరి దశకు చేరుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ప్లేఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారడంతో ప్రతి మ్యాచ్ నాకౌట్ తరహాలో సాగుతోంది. మైదానంలో ఆటగాళ్లు సిక్సర్లు, ఫోర్లతో అలరిస్తుంటే.. సోషల్ మీడియాలో అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్ కూడా అదే స్థాయిలో హీట్ పెంచుతున్నాయి. ప్రస్తుతం గుజరాత్ జెయింట్స్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆర్సీబీ, ఎస్ఆర్హెచ్ జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా 13 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తోంది. ఇలాంటి ఉత్కంఠభరిత సమయంలో స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన తాజా సోషల్ మీడియా డేటా ఆసక్తికర చర్చకు దారితీసింది. మార్చి 28 నుంచి మే 12 వరకు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చించబడిన ఆటగాళ్ల జాబితాను స్టార్ స్పోర్ట్స్ విశ్లేషించింది. ఇందులో విరాట్ కోహ్లీ 44 శాతం చర్చలతో అగ్రస్థానంలో నిలిచాడు. కోహ్లీ బ్యాటింగ్, మైదానంలో అతని అగ్రెసివ్ ఆటతీరు ఎప్పటిలాగే అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. ఎంఎస్ ధోని ఈ సీజన్లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా 21 శాతం చర్చలతో రెండో స్థానంలో నిలవడం. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే కాలికి గాయమవడంతో ధోనీ ఈ సీజన్కు




దూరమయ్యాడు. అయినప్పటికీ ఆయనపై అభిమానుల క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో ఇప్పటికీ ధోనీ గురించే పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండటం విశేషం. ఈ జాబితాలో రోహిత్ శర్మ 18 శాతం చర్చలతో మూడో స్థానంలో నిలిచాడు. ఇక సంజూ శాంసన్ 10 శాతం, కేఎల్ రాహుల్ 8 శాతం చర్చలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఆర్ఆర్ తరఫున ఆడుతున్న అతను కేవలం 36 బంతుల్లోనే సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ సీనియర్ స్టార్ ఆటగాళ్ల క్రేజ్ ముందు అతనికి టాప్ లిస్టులో చోటు దక్కలేదు. అయితే భవిష్యత్తులో అతను పెద్ద స్టార్గా ఎదగడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ధోనీపై బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్లో ధోనీ ఆడితే చూడాలని ఉందని అభిషేక్ తన మనసులో మాట బయటపెట్టాడు. దీంతో ధోనీ అభిమానులు మరోసారి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వినేశ్‌ను కావాలనే అడ్డుకుంటున్నారు

### ఫొగాట్‌కు సహచర క్రీడాకారిణి సాక్షి మాలిక్ మద్దతు



**న్యూఢిల్లీ :** భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)తో పోరాడుతున్న స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సహచర క్రీడాకారిణి సాక్షి మాలిక్ మద్దతు ప్రకటించింది. మహిళా అథ్లెట్లు బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా ఆటలో కొనసాగేందుకు ఎన్నో దేశాలు నిబంధనలు సడలిస్తుంటే.. పునరాగమనం చేస్తున్న వినేశ్ లాంటి మేటి ప్లేయర్‌ను కావాలనే అడ్డుకుంటున్నారని సోషల్ మీడియా పోస్టులో సాక్షి ఆరోపించింది. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ కల్పించుకొని వినేశ్‌కు న్యాయం చేయాలని కోరింది. మరోవైపు ఈ వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ పేర్కొన్నారు. 'ఫెడరేషన్ ఒక ప్లేయర్‌ను పోటీ పడకుండా అడ్డుకోదు. ఒకవేళ అలా చేస్తుందంటే దాని వెనుక కచ్చితంగా ఓ కారణం ఉంటుంది. ప్రస్తుతం మేం ఆ మేడం (వినేశ్) సృష్టించిన అలజడిని డీల్ చేస్తున్నాం' అని చెప్పారు.

## బ్యాడ్మింటన్‌లో సాత్విక్ జోడీ బోణీ



**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో నాలుగో ర్యాంకర్స్ సాత్విక్ చిరాగ్ 21–19, 21–23, 21–10తో ముహ్ పుత్రా ఎరవిన్సియాబగస్ మౌలానా (ఇండోనేషియా) జోడీపై గెలిచారు. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్లో 11–16తో వెనుకబడ్డా ఆ తర్వాత వరుసగా ఏడు పాయింట్లు సాధించిన సాత్విక్ జోడీ ఆ గేమ్‌ను సొంతం చేసుకుంది. నువ్వానేనా అన్నట్టుగా సాగిన రెండో గేమ్‌లో 14–17తో వెనుకంజలో ఉండి తర్వాత పుంజుకున్నా ఇండోనేషియా షట్లర్లు పట్టు విడువకుండా ప్రయత్నించి సఫలమయ్యారు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో మాత్రం భారత జంట బ్రేక్‌కు ముందే 11–5తో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. అదే జోరుతో మ్యాచ్ గెలిచి టోర్నీలో ముందంజ వేసింది.

## ఆర్కిటెక్చర్ అద్భుతం 'ఎల్ తాహిన్'




మెక్సికోలోని వెరాక్రూస్ రాష్ట్రం నడిబొడ్డున ఉన్న 'ఎల్ తాహిన్' అనేది ప్రాచీన మెక్సికన్ నాగరికతల గొప్ప స్ఫూర్తిని ప్రతిబింబించే ఆర్కిటెక్చరల్ అద్భుతం. క్రీస్తు శకం 600 నుండి 1200 వరకు విరాజిల్లిన క్లాసిక్ వెరాక్రూస్ సంస్కృతి కాలానికి చెందిన ఈ స్మారక కట్టడం, నేటికీ ప్రపంచ పురావస్తు వేత్తలను ఆకట్టుకుంటుంది.ఆర్కిటెక్చర్ మహిమలుఎల్ తాహిన్‌లోని ప్రసిద్ధ నిర్మాణం 'పిరమిడ్ ఆఫ్ ది నిచెస్'. ఈ పిరమిడ్ ఆకారంలోని ఈ శిలా కట్టడంలో 365 చిన్న గుహాకార గుడిసెలు కనిపిస్తాయి. ఇవి సంవత్సరంలోని రోజుల సంకేతంగా గుర్తింపు పొందాయి. వీటిలో వెలుతురు ప్రవేశించే విధానం ఆ కాలంలోని జ్యోతిష్య, ఖగోళ జ్ఞానాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి శిల్పం, ప్రతి కోణం, సూర్యుడు, నక్షత్రాల కదలికలపై ఆధారపడి గణితపూర్వకంగా వీటిని నిర్మించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ స్థలం కేవలం ఒక పిరమిడ్ మాత్రమేగాక, ధార్మిక కేంద్రంగా కూడా ఉండేదని స్పష్టమవుతుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, పండుగలు, వేడుకలు, బలిపీఠాలు ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని చేకూర్చేవి. ప్రాచీన మెక్సికన్ ప్రజలు దేవతలకు సమర్పణగా నృత్యాలు చేయడం, గృహ సమూహాలు నిర్మించడం వంటి కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించేవారు. శిల్పకారులు కట్టిన ప్రతి దశ, ప్రకృతితో మానవ తత్త్వం ఎలా మిళితమవుతుందో చెబుతుంది. ఎల్ తాహిన్ అనేది ప్రకృతి, మానవ చిత్తశుద్ధి, జ్ఞానం అనే మూడు అంశాల సంగమంగా మిగిలిపోయింది. తేనెగూళ్లను పోలిన అద్భుత నిర్మాణాలు, విరిగిన శిలలు, గాలి తాకే ప్రతీ మూల వంటివన్నీ ఒక ప్రతిష్ఠాత్మక నాగరికత కాలచక్రంలో ఎలా నిలిచిందో చెప్పే చిహ్నాలు. ఇది కేవలం పురావస్తు కట్టడమేకాదు, మానవ సాహసానికి, సృజనాత్మకతకు ఉమ్మడి ఘనతగా



నిలిచిన స్మారకం. రాతి రససౌందర్యంలో ఆకాశాన్ని తాకిన సంస్కృతిజ్ఞానం, సమయపు శిలావిగ్రహం, సృష్టి, లయ మధ్య చిరస్మరణీయ నాట్యంగా ఎల్ తాహిన్ నిలుస్తోంది.

## ప్రకృతి చెక్కిన అద్భుతం..

అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో ఉన్న కార్ల్‌సాబ్‌యెడ్ కేవరన్స్ ప్రకృతి సృష్టించిన అద్భుతంగా పేర్కొంటారు. కోట్ల సంవత్సరాలపాటు సాగిన భూభౌతిక పరిణామాల ఫలితంగా ఏర్పడిన ఈ గుహా వ్యవస్థ భూమి అంతర్భాగంలోని సహజ శిల్పకళను స్పష్టంగా చూపిస్తుంది. ముఖ్యంగా పర్మియన్ యుగం, అంటే సుమారు 250 మిలియన్ల సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రక్రియల ద్వారా ఈ కేవరన్స్ రూపుదిద్దుకున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. లైమ్ స్టోన్ రాళ్లపై నీటి రసాయనిక ప్రభావం క్రమంగా పని చేయడంతో విశాలమైన గుహలు, మార్గాలు, శిలా



నిర్మాణాలు ఏర్పడ్డాయి. 'నేచురల్ ఎంట్రెన్స్'గా పిలిచే ప్రధాన ప్రవేశ ద్వారం భూమి లోపలికి దిగిపోతున్న గొప్ప సహజ మార్గంలా కనిపిస్తుంది. అక్కడి రాతి పొరలు, వంకర తిరుగుల మార్గాలు భూగర్భ లోకానికి తీసుకెళ్లే ద్వారంలా అనిపిస్తాయి. వర్ష జలాలు, వరదలు, భూగర్భ జలాల నిరంతర కదలికలు రాళ్లను క్రమంగా చెక్కుతూ ఈ గుహా నిర్మాణాన్ని సృష్టించాయి. నీటిలో కరిగిన ఖనిజాలు వేల సంవత్సరాలుగా పేరుకుపోతూ స్టలాక్టైట్స్, స్టలాగ్మైట్స్ వంటి అద్భుత ఆకృతులను రూపొందించాయి. ఈ గుహలో అడుగుపెట్టే వ్యక్తికి భూమి గర్భంలోకి ప్రయాణిస్తున్న అనుభూతి కలుగుతుంది. ఆధునిక మార్గాలు, కాంతి సదుపాయాలు సందర్శకులకు సురక్షిత అనుభవాన్ని కల్పించినప్పటికీ, అక్కడి నిశ్శబ్దం ప్రకృతి మహిమను మరింతగా అనుభూతి చెందేలా చేస్తుంది. భూమి గర్భంలో ప్రకృతి చెక్కిన ఈ శిల్పకళ మనిషిని ఆత్మపరిశీలనకు ఆహ్వానిస్తూ, మనం ఈ గ్రహానికి యజమానులా లేక సంరక్షకులా అనే ప్రశ్నను మన ముందుంచుతుంది.

## నాటు పడవలో వేల మైళ్ల ప్రయాణం

మైక్రోనేషియా దీవి సాటావాల్‌కు చెందిన నైపుణ్య గొప్ప నావిగేటర్ మావ్ పియెలుగ్ ఆధునిక పరికరాలేవీ ఉపయోగించకుండా హవాయికి చెందిన హోకులె'యా అనే సంప్రదాయ నాటుపడవలో హవాయి నుండి తహితీ వరకు 2,500 మైళ్లకు పైగా దూరం ప్రయాణించాడు. 1976లో పసిఫిక్ మహాసముద్రంపై సాగిన ఒక అద్భుత ప్రయాణం దాదాపుగా అదృశ్యమవుతున్న ఒక సాంస్కృతిక జ్యోతిని మళ్లీ వెలిగించింది. నిజానికి, 1970ల నాటికి హవాయిలో సంప్రదాయ పోలినేషియన్ నావిగేషన్ పద్ధతి దాదాపుగా మాయమైపోయింది. పోలినేషియన్ వోయేజింగ్ సొసైటీ తమ పూర్వీకులు ఈ విస్తారమైన మహాసముద్రాన్ని యాదృచ్ఛికంగా కాదు, జ్ఞానం, నైపుణ్యంతో సచేతంగా పరిశోధించి, నివాసం ఏర్పరచారని రుజువు చేసే ప్రయత్నం ప్రారంభించింది. కానీ ఆ తరానికి చెందిన ఎవరు కూడా ఆ పురాతన నావిగేషన్ రహస్యాలను ఇంకా కాపాడుకోలేకపోయారు. అలాంటి



పరిస్థితుల్లో పియెలుగ్ రంగ ప్రవేశం చేశాడు. పరికరాలు లేకుండా సముద్రయానాన్ని కొనసాగించే పవిత్ర కళలో చిన్నప్పుడు తీసుకున్న శిక్షణ అతనికి ఉపయోగపడింది. అందుకే ఈ మహా సాహసయాత్రకు నాయకత్వం వహించేందుకు అంగీకరించాడు. 34రోజులపాటు హోకులె'యా నాటు పడవ సముద్రంలో ప్రయాణిస్తూ ఉన్నప్పుడు, ఆయన నక్షత్రాలు, గాలులు, సముద్ర అలల సూచనల ఆధారంగా మాత్రమే దిశలను గుర్తించాడు. చివరికి ఆ పడవ తహితీకి చేరుకుంది. ఆ క్షణం.. కేవలం ఓ సఫలమైన ప్రయాణమే విజయాన్నే కాదు.. ఒక సాంస్కృతిక మేల్కొలుపు క్షణాన్ని కూడా సూచించింది. పియెలుగ్ సాధించిన విజయంతో సముద్రయాన గాథలు నిజమని నిర్ధారితమయ్యాయి.

# మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరం

### అసంతృప్తిలో రాష్ట్ర రైతాంగం
### విబి జిరాంజి రద్దు కోరుతూ దశల వారీ పోరాటం
### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/ఖమ్మం :** మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రాష్ట్రాల ఎన్నికల గెలుపుతో మోదీ పాలనకు సానుకూలతగా భావించలేమని, బిజెపి గెలుపు వెనక అనేక పార్శ్వాలు దాగి ఉన్నాయని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. పావులూరి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ఓట్ల తొలగింపు, ఎన్నికల కమిషన్ విధానం, ప్రలోభాలు తదితర అంశాలు బిజెపి గెలుపు వెనక దాగి ఉన్నాయన్నారు. దేశంలో ప్రతి సమస్యకు పరిష్కారం కర్మ ఫలమేనన్న వాదాన్ని బిజెపి తీసుకువస్తుందని ఆయన విమర్శించారు. ఈ విధానం చాలా ప్రమాదకరమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా హిందుత్వ నినాదంతో ప్రజల మధ్య విభజన రేఖ తీసుకురావడం ద్వారా బిజెపి లబ్ది పొందుతుందని బాగం ఆరోపించారు. లేబర్ కోడ్స్, విబిజిరాం జీ పథకాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలని హేమంతరావు తెలిపారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే యావత్ దేశ కార్మికులు పోరాటాలు సాగిస్తున్నారన్నారు. విబిజిరాం జీ పథకాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, దీనిని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని, వివిధ దశల్లో ఆందోళన చేపడుతున్నామని హేమంతరావు తెలిపారు. ఈ నెల 15న మొదలై విబిజిరాం జీ పథకం రద్దు చేసేంత వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఒక పక్క రైతు భరోసా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం, మరో పక్క ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లలో విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమన్నారు. మొక్కజొన్నలు కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరగడంతో రైతులపై అదనపు భారం పడుతుందని, రెండు నెలలు దాటిన ఇంత వరకు మొక్కజొన్న రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదన్నారు. క్వింటాకు 10 కేజీల వరకు కోత విధించడంతో పాటు రోజుల తరబడి దిగుమతులు జరగడం లేదని ఎగుమతి ఖర్చు కూడా రైతులకు పెనుభారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రైతుల్లో ఉన్న అసంతృప్తిని తొలగించేందుకు విస్తృత స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించి, రైతుల ఇబ్బందులను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని హేమంతరావు కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన లేబర్ కోడ్ పత్రాల దహనం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్ ఆరోపించారు. ఎఐటియుసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుమస్తాల సంఘం పక్షాన హంటర్ రోడ్డులో నూతన నాలుగు లేబర్ కోడ్‌ల పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో ముక్కెర రామస్వామి, నర్ర ప్రతాప్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నూతన నాలుగు లేబర్ కోడ్‌లను అమలుకు తెస్తున్నారన్నారు. 12గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని, సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తుందని, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం బరితెగించిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. గుమస్తా కార్మికులందరూ కనీస వేతనం నెలకు రూ.26వేల ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్ సౌకర్యం కల్పించాలని, ఎనిమిది గంటల పని దినాలు అమలుచేయాలని పాత చట్టాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పనికిర యాకయ్య, బాబురావు, జగదీశ్వర్, రాజశేఖర్, శ్రీరాములు రాధాకృష్ణ, వేణు, ఎల్లయ్య, ఎం.రమేష్, డి.రమేష్, నవోదయ, ఎ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్



**ప్రజాపక్షం/ అమరచింత :** దేశవ్యాప్తంగా లక్షలాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులైన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. బుధవారం అమరచింతలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజస్థాన్‌లోని ప్రింటింగ్ ప్రెస్ నుండి పేపర్ లీకేజీ రావడం చూస్తుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అర్థమవుతుందన్నారు. లీకేజీ వల్ల పరీక్ష రద్దు కావడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన చెందారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎపై విద్యార్థుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న పాలకుల వైఖరిని ఎఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నీట్ పరీక్షా పేపర్ లీకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తక్షణమే రాజీనామా చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. పారదర్శకత, డిజిటల్ ఇండియా అంటూ చెప్పుకోనే మోదీ ప్రభుత్వానికి నీట్ లీకేజి ఉదంతం చెంప దెబ్బలాంటిదన్నారు. పరీక్షలను అవినీతి కేంద్రాలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి యువజన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు అనురాగ్, విజయ్, చేతన్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి

### కేంద్ర మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి
### ఎన్ఎఫ్ఐడబ్ల్యు డిమాండ్




**ప్రజాపక్షం/ వరంగల్ :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి భవాని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకరి భవాని మాట్లాడుతూ బండి భగీరథపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుందన్నారు. పోక్సో కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినటువంటి చరిత్ర రాష్ట్ర పోలీస్ యంత్రాంగానికి ఉన్నదన్నారు. ఉద్దేశపూర్వకంగానే బండి భగీరథను అరెస్టు చేయకుండా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే అదుపులోకి తీసుకోకపోవడం ఇప్పుడు పరారీలో ఉన్నాడని, స్విచ్ ఆఫ్ వస్తుందని మాట్లాడటం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చిట్యాల సువర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి సింగారం విక్టోరియా, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరెల్లి రవి, దామెర కృష్ణ, ఎండి మున్ని, తస్లీమ్, ఎస్కే షఫీనా, సుర అనిత, కస్తూరి లక్ష్మి, జిల్లా నిర్మల, శివరాత్రి ఎల్లమ్మ, మేకల బుచ్చమ్మ పాల్గొన్నారు.



**కరీంనగర్ :** మైనర్ బాలికపై అత్యాచార కేసులో బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని, అలాగే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బీర్ల పద్మ, కొట్టె అంజలి డిమాండ్ చేశారు. బండి సంజయ్ కొడుకు సాయిభగీరథ్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ బుధవారం కమాన్ చౌరస్తా వద్ద మహిళా సమాఖ్య కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రమంత్రి కొడుకు సాయి భగీరథపై బాలిక తల్లి ఆరురోజుల క్రితం ఫోక్సో కేసు పెడితే ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదంటే సభ్యసమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీస్ అధికారులకు మహిళలపై ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణమే నిందితుడు బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు అఖిల, సహాయ కార్యదర్శి సావిత్రి, నాయకులు గుగులోతు రజిత, కె.సంధ్య, ఎ.రాధ, భూక్యా ముని, ఎం.సరోజన, ఎస్.భాగ్య, సంధ్య, ఎ.చంద్రకళ, ఎం.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

### నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



**పెద్దపల్లి :** మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ రేణుకుంట్ల విజేత డిమాండ్ చేశారు. లైంగిక దాడి చేసినట్లు ఫిర్యాదు చేసిన ఇప్పటికీ కేసు నమోదు చేసి అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బండి సంజయ్ కుమారుడు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయడం అంటే తప్పు చేసినట్లే కదా అని ప్రశ్నించారు. కేసు నమోదు అయి 5 రోజులు అయినప్పటికీ కేంద్ర మంత్రి కుమారుడిని అరెస్టు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కేసు నీరుగార్చే ప్రయత్నం చేయడం సరికాదని, వెంటనే కేంద్ర మంత్రి కుమారుడిని అరెస్టు చేయాలని, కుమారుడి లైంగిక వేధింపులను వత్తాసు పలుకుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
గురువారం
14-05-2026
www.prajapaksham.in




## ఎండల ఎఫెక్ట్.. ఉష్ణోగ్రతలు
# 44 డిగ్రీలు దాటే అవకాశం

● మధ్యాహ్నం బయటకు రావొద్దు..
● కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో రానున్న ఆరు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కొన్ని జిల్లాల్లో 44 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి బుధవారం ఆదేశించారు. ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములుమెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. అలాగే జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసేవారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని సూచించారు. వడదెబ్బలు, ఎండ తీవ్రత కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా యంత్రాంగానికి మంత్రి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో వడదెబ్బ నివారణపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే వారు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## ఖమ్మం, వరంగల్, కరీంనగర్
# కార్పొరేషన్లకు ఒఆర్‌ఆర్‌లు

● రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకొని రోడ్ల నిర్మాణం ● అండర్ డ్రైనేజీల నిర్మాణానికి సాంకేతికత వినియోగం ● ఖర్చు తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశపెట్టాలి ● నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్
● ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్
● మెగా గ్రోత్ కారిడార్‌పై సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్:** ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు ఒఆర్‌ఆర్‌లు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లు నిర్మించాలన్నారు. మెగా గ్రోత్ కారిడార్‌పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అవసరమైన ఎస్‌టిపిలు రూపొందించాలని, అండర్ డ్రైనేజీల నిర్మాణానికి సాంకేతికత వినియోగించుకోవాలన్నారు. ఖర్చు తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశపెట్టాలని చెప్పారు. ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తయ్యేలా చూడాలని, పట్టణాల కేంద్రంగా అభివృద్ధి ప్రణాళిక ఉండాలని, మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రేడియేషన్ తగ్గింపునకు మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు సూచించారు. 'సింగరేణి సిఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చుపెట్టాలి. నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలి. ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలి. అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. మహబూబాబ్ నగర్, భూత్పూర్, జడ్చర్లను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌ను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలి. పెద్ద మున్సిపాలిటీలకు సమీపంలో రేడియల్ రోడ్లు ఉండాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ తెలంగాణకు కీలకం. రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తారు' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## వ్యక్తిగత కారణాలతో విచారణకు రాలేకపోయా: బండి భగీరథ్

**హైదరాబాద్:** ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరు కాలేకపోతున్నట్లు మల్కాజిగిరి జిల్లా పేట్‌బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ మెయిల్ పంపాడు. పోక్సో కేసులో ఆయన బుధవారం విచారణకు హాజరు కావాల్సి ఉండగా రాలేదు. ఈ నేపథ్యంలో భగీరథ్ మెయిల్ పంపాడు. 'ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో నేడు విచారణకు హాజరు కాలేకపోతున్నాను. సంబంధిత అధికారుల ఎదుట హాజరై దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. కేసుకు సంబంధించిన ఆధారాలు సేకరించేందుకు రెండు రోజుల గడువు మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీ సూచించగలరు' అని భగీరథ్ పేర్కొన్నాడు.

## ధాన్యం కొనుగోలు
# మరింత వేగవంతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతమైంది. ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి రూ.4,520 కోట్లు జమ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు దొడ్డురకం ధాన్యాన్ని సేకరించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి, కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను, తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా పెట్టింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డిసిఎంలతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి కొనుగోలు కేంద్రాలు, గోదాములలో ధాన్యం నిర్వహణ ఛార్జీలను (హమాలీ రేట్లు) అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు ఏలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా లేదా సహాయం కావాలన్నా పౌరసరఫరాల శాఖకు చెందిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1967 ను సంప్రదించాల్సిందిగా అధికారులు సూచించారు.

## తెలంగాణలో పులుల సంరక్షణ మరింత బలోపేతం

టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ పాలక మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో వన్యప్రాణుల సంరక్షణకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల కోసం 202627 వార్షిక కార్యాచరణ ప్రణాళిక (ఎపిఒ) కు రాష్ట్ర సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ (టిసిఎఫ్) పాలక మండలి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అడవుల అభివృద్ధి, అటవీ సంరక్షణ, పులుల సంఖ్య పర్యవేక్షణకు ఆధునిక పరికరాల వినియోగం, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. రిజర్వుల అడవుల భద్రత కోసం వాచర్ల వేతనాలు, అడవి మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి అంశాలకు ప్రత్యేక నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ పనుల్లో పారదర్శకత, సమర్థత ఉండేలా ప్రత్యేక విధానాలు అమలు చేయాలన్నారు..అడవుల్లో నివసించే గిరిజనుల భాగస్వామ్యంతో ఎకో టూరిజం, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలు నామినేషన్ విధానంలో చేపట్టాలని నిర్ణయించారు . అయితే భారీ మౌలిక వసతుల పనులు, అధిక విలువ కలిగిన పరికరాల కొనుగోళ్లు టెండర్ విధానంలోనే నిర్వహిచాలన్నారు. వన్యప్రాణుల సంక్షేమంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. వేట, రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర కారణాలతో గాయపడిన జంతువుల రక్షణ కోసం ప్రత్యేక రెస్క్యూ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరితగతిన స్పందించేలా ప్రత్యేక ట్రక్ మౌంటెడ్ రెస్క్యూ వాహనాలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అడవిలోకి వెంటనే విడిచిపెట్టలేని జంతువుల పునరావాసం కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాలు, ప్రే ఆగ్మెంటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.కవ్వాల్ టైగర్ రిజర్వ్ బఫర్ జోన్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. సంరక్షణ కార్యక్రమాలకు ఆర్థిక వనరులు సమకూర్చేందుకు రిజర్వ్ గుండా వెళ్లే వాహనాలపై టోల్ ఫీజులను సవరించాలని ప్రతిపాదించారు. బయటి ప్రాంతాల వాహనాలకు రూ.600, స్థానిక వాహనాలకు రాయితీగా రూ.300 టోల్ ఫీజు విధించాలని సూచించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అటవీ దళాల అధిపతి డాక్టర్ సి.సువర్ణ,సీనియర్ అధికారులు శాంతారాం, రేవంత్ చంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.

## చెరువు మట్టి తరలింపునకు హైకోర్టు బ్రేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలోని పెద్దచెరువు నుంచి ఇటుకల తయారీ కోసం మట్టి తరలింపునకు ప్రైవేటు వ్యక్తులకు అనుమతిస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయానికి హైకోర్టు బ్రేక్ వేసింది. చెరువు నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు అధికారులు అనుమతి మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ చింతపల్లికి చెందిన నట్వా గిరిధర్ వేసిన పిటిషన్‌లో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మధ్యంతర ఆదేశాలిచ్చారు. గనుల శాఖ నిబంధనలకు మరియు ప్రభుత్వం 2015లో జారీ చేసిన జీవోకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులైన విజయేందర్ రెడ్డి, కోటేశ్వరరావులకు మట్టి తరలింపునకు అధికారులు అనుమతులు ఇవ్వడం చెల్లదని పిటిషనర్ వాదన. చెరువల మట్టిని రిజర్వాయర్ల బండ్ నిర్మాణ అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. వ్యాపార అవసరాలకు వాడేందుకు వీల్లేదన్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం ప్రత్యేక అనుమతులు అవసరమన్నారు. ఇటుకల తయారీ కోసం మట్టి తరలింపు ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. వాదనల తర్వాత న్యాయమూర్తి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పెద్దచెరువు నుంచి మట్టి తరలింపునకు ప్రైవేటు వ్యక్తులకు అనుమతించరాదంటూ అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.గనుల శాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, అదనపు డైరెక్టర్, రెవెన్యూ శాఖ మరియు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శులు, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులతో పాటు ప్రైవేటు వ్యక్తులైన ఇద్దరూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. విచారణను జులై 1కు వాయిదా వేశారు.

## ఇంటి దీపాన్ని సరిచేసుకోలేని బండి సంజయ్
# దేశాన్ని ఏమి ఉద్ధరిస్తారు

కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంటిదీపాన్ని సరిచేసుకోలేని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దేశాన్ని ఏమి ఉద్ధరిస్తారని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే పారిపోయిన తన కుమారుడిని వెంటనే పోలీసులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ చట్టాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని, కుమారుడు నిర్దోషి అని రుజువు అయ్యే వరకు బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైనా తప్పు చేస్తే వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. సంధ్యా థియేటర్ ఘటన ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. ఏ తప్పు చేయలేదని చెప్పే భగీరథ్ పోలీసుల విచారణకు సహకరించేందుకు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

## పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టి ఉగ్రవాదంపై
# మహారాష్ట్ర ఎటిఎస్ ఉక్కుపాదం

53మంది అనుమానితుల విచారణ

**ముంబయి :** ఉగ్రవాద మూలాలపై మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) ఉక్కుపాదం మోపుతోంది. పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టితో సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని మహారాష్ట్ర ఎటిఎస్ ముంబయి సహా రాష్ట్ర వ్యాప్తంగా 40కి పైగా ప్రాంతాలను గుర్తించిన అనంతరం దాడులు నిర్వహిస్తోంది. దాదాపు 53మంది అనుమానితులను విచారిస్తున్నామని బుధవారం అధికారులు చెప్పారు. షాజాద్ భట్టి విదేశాల నుంచే తన ముఠాను నడుపుతూ, సోషల్ మీడియా ద్వారా భారతదేశంలోని యువతను దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయని అధికారి ఒకరు చెప్పారు. ముంబయి, అకోలా, నాందేడ్, పుణే, మీరా రోడ్ (థానే జిల్లా), నల్లసోపార (పాల్ఘర్ జిల్లా), నాసిక్, జల్‌గావ్, నాగ్‌పూర్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారిపై బుధవారం ఉదయం నుండి ఈ దాడులు జరుగుతున్నాయని ఆ అధికారి చెప్పారు. భట్టి అతడి సిండికేట్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరి వ్యక్తుల అనుమానాస్పద కార్యకలాపాల గురించి యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌కు సమాచారం ఉందని వివరించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా అలాంటివారిని 53మందిని గుర్తించామని, వారి ఆచూకీని కనుగొని విచారణ జరుపుతున్నామని ఆయన తెలియజేశారు. గత వారం షాజాద్ భట్టి మాడ్యూల్‌తో సంబంధాలు ఏజెంట్ల ద్వారా పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఢిల్లీలోని ఒక చారిత్రక ఆలయంపై, ఢిల్లీ–సోనీపట్ రహదారిపై ఉన్న ఒక పేరొందిన దాబాపై , హర్యానాలోని ఒక సైనిక శిబిరంపై దాడులకు ప్రణాళిక రచించిందని దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. గ్యాంగ్ బస్ట్ ఆపరేషన్ 2.0కింద ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ పలు రాష్ట్రాలలో ఈ మాడ్యూల్‌కు చెందిన 9మంది అనుమానిత కార్యకర్తలను విచారించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని సంబంధిత వర్గాలు తెలియజేశాయి.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం చేతకాని ప్రభుత్వం

రాష్ట్రాన్ని ప్రపంచస్థాయికి ఎలా తీసుకెళ్తారు : బిసి సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం చేతకాని ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయికి ఎలా తీసుకువెళ్తారని పలువురు బిసి సంఘాల నేతలు ప్రశ్నించారు. సచివాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు ఉన్నత చదువులు, వృత్తి విద్యా కోర్సులు చదువుకుంటుంటే అగ్రకుల ప్రభుత్వాలు ఓర్వలేకపోతున్నాయని, అందుకే స్కీమ్‌ను రకరకాల పద్ధతులకు పాల్పడుతూ జిఓ నెంబర్ 7ను తెచ్చి ఎత్తివేసే కుట్ర పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కుట్రలు మానుకోకపోతే ప్రభుత్వం పతనం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముఖ్యమంత్రి నివాసం కూడా ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉన్నత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని, లక్షలాది మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులు రూపాయి ఖర్చు లేకుండా ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు తమ జెండా, ఎజెండా లను పక్కనపెట్టి ఈ పథకం ఎత్తి వేసే కుట్రలను తిప్పికొత్తవాల్సిన అవసరం ఉన్నదన్నారు. లేక పోతే భవిష్యత్తులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత విద్య కోర్సులు చదువుకోవడం ఒక కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో
# జూ పార్కుల నిర్వహణ

2026-27 బడ్జెట్ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని జూ పార్కుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా 2026–27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను తెలంగాణ జూ పార్క్స్ అథారిటీ ఆమోదించినట్లు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ జూ పార్క్స్ అథారిటీ 15 వ సమావేశంలో రాష్ట్రంలోని జూ పార్కుల అభివృద్ధి పనులు, వన్యప్రాణుల సంరక్షణ చర్యలు, మౌలిక వసతుల విస్తరణ, సందర్శకుల సేవల మెరుగుదలపై అటవీ అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర జూ పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. జంతు సంక్షేమం, శుభ్రత, పచ్చదనం, భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థుల్లో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే జూ పార్కుల్లో డిజిటల్ సదుపాయాలు, సందర్శకులకు గైడెన్స్ వ్యవస్థలు, తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు, పారిశుధ్య సౌకర్యాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. వన్యప్రాణుల ఆరోగ్య పరిరక్షణకు ఆధునిక వెటర్నరీ సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అధికారులు 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ వివరాలను సమర్పించగా, వాటిని జూ పార్క్స్ అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అటవీ దళాల అధిపతి డాక్టర్ సి.సువర్ణ, వైల్డ్ లైఫ్ చీఫ్ వినయ్ కుమార్, సీనియర్ అటవీ అధికారి రత్నాకర్ జౌహారీ,సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, భీమా నాయక్, జూ డైరెక్టర్ సునీల్ హీరామత్ ఇతర ఉన్నతాధికారులు, జూ పార్కుల అధికారులు పాల్గొన్నారు.

## అప్పీలు చెల్లదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓఎం గ్రూపు ఆఫ్ ఛారిటీస్‌కు చెందిన ఆస్తులను అన్యాక్రాంతం చేయరాదంటూ సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వు లను సవాలు చేస్తూ దాఖలైన అప్పీలు పిటిషన్ చెల్లదని, క్రిమినల్ అప్పీల్ డివిజన్ బెంచ్ వద్ద దాఖలు చేస్తే అది విచారణార్హం హైకోర్టు స్పష్టం చేసింది. క్రిమినల్ కేసులకు సంబంధించిన అంశంలో ఈ తరహా అప్పీలను అనుమ తిం చలేమని, సుప్రీం కోర్టులో మాత్రమే అప్పీల్ చేసుకోవాలంది. అప్పీల్‌ను కొట్టివేసింది. సికింద్రాబాద్‌కు చెందిన గౌరిపాగ అల్బర్ట్ లాఝెల్ హైకోర్టులో పిటి షన్ దాఖలు చేస్తూ, ఓఎం గ్రూపు ఆఫ్ ఛారిటీస్ నిర్వాహకులు సుప్రీంకోర్టు ఉత్త ర్వులకు విరుద్ధంగా సంస్థ ఆస్తులను విక్రయించేందుకు ప్రయత్నిస్తు న్నారని, దీనిపై సీబీఐతో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై గతం లో సింగిల్ జడ్జి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతో పాటు సంస్థ ఆస్తు లను అన్యాక్రాంతం చేయరాదని మధ్యంతర ఆదేశాలిచ్చారు. వీటిని సవా లు చేస్తూ ఓం గ్రూపు ఆఫ్ ఛారిటీస్ నిర్వాహకులు డివిజన్ బెంచ్‌ను ఆశ్ర యిం చారు. ఈ అప్పీలపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది.



బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రి భారత్‌కు విచ్చేసిన ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చీ.

# బండి సాయి భగీరథ్‌ను అరెస్టు చేయాల్సిందే

విద్యార్థి , మహిళా సంఘాల నాయకులు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను పోక్సో కేసులో తక్షణమే అరెస్టు చేయాలని వామపక్ష విద్యార్థి మహిళా సంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నమోదైన బండి సాయి భగీరథ్‌ను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఐద్వా, పిఓడబ్ల్యూ, ఎఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ, ఎఐడిఎస్ఓ, పిడిఎస్‌యు తదితర విద్యార్థి, మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాధవి(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), మల్లు లక్ష్మి (ఐద్వా), వి.సంధ్య (పిఓడబ్ల్యూ), జాన్సీ (పిఓడబ్ల్యూ). ఎస్.ఎల్.పద్మ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి , ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్‌లు మాట్లాడారు. బండి సాయి భగీరథ్‌పై ఈ నెల 8 వ తేదీన పోక్సో కేసు నమోదైనా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడమేమిటని వారు ప్రశ్నించారు. బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు, పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, దేవాలయ పునర్నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభపతి స్పీకర్ ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా కోట్‌పల్లి మర్పల్లి గ్రామంలో మల్లన్న స్వామి అలయం పునఃనిర్మాణ భూమి పూజలో పాల్గొని తదుపరి మర్పల్లి మండల కేంద్రంలోని లబ్దిదారులు నూతనంగా నిర్మించుకున్నమూడు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం సిసి రోడ్లు ప్రారంభించి ఎంపిడిఓ కార్యాలయంలో 47మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్వర్, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేరాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాచారం సిఐ ధనుంజయ్ గౌడ్ సూచించారు. మల్లాపూర్ గోకుల్‌నగర్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతి కాలనీలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలను సమర్థంగా అరికట్టవచ్చని, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై యువత జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి కాలనీలో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిద్వారా నేరాలను నూటికి నూరు శాతం అరికట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా పోస్టుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు బంగారు నగలతో తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయరాదని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇంటిని అద్దెకు ఇచ్చే యజమానులు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల పూర్తి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, కాలనీల్లో ఎక్కడైనా గంజాయి వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ఇంటి యజమానులు ఊర్లకు వెళ్లే సమయంలో సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటయ్య, గోకుల్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు టి.మల్కయ్య, కృష్ణారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఐసిలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రజలు, యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్‌పై పూర్తిగా సహకరించాలని కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ఎస్ఐసి సంస్థలో సిఐ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఐసి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు యాంటీ డ్రగ్స్‌మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ,సిసి కెమెరాల ప్రాముఖ్యత గూర్చి అవగాహన కల్పించారు. పరిసరా ప్రాంతాలలో ఎలాంటి అనమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఐసి డైరెక్టర్ శాంతి, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సైబర్ క్రైమ్ వారియర్ పిసి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై కొరడా

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని అక్రమ భారీ బహుళ అంతస్తు భవనాలు అనుమతుల్లేని షెడ్ల నిర్మాణాలపై సర్కిల్ అధికారులు కొరాడ జులిపిస్తున్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మ, టెక్ మహీంద్రా, సరేగూడెం, అపర్ణ వెంచర్, బోరంపేట్ విశ్వసాయి టౌన్షిప్ తదితర ప్రాంతాలలో వరుసగా అనుమతులు లేని అక్రమాణాలను తొలగిస్తున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే



చర్యలు తీసుకుని నిర్మాణాలు తొలగిస్తున్నారు.ఇటీవలే దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా వీధుల్లో చేరిన డాక్టర్ ఎస్.వెంకట మనీ కరన్ అనుమతులు లేని అక్రమ నిర్మాణాల పై ఉక్కు పాదం మోపుతున్నారు.అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టాలంటే నిర్మాణాదారులు జంకుతున్నారు. ఇదే విధంగా గండి మైసమ్మ డి.పోచంపల్లి మల్లంపేట్, బోరంపేట్ సింహపురి కాలనీ, బాదురుపల్లి ఇందిరమ్మ కాలనీ, దుండిగల్, గాగిలాపూర్, చర్చి గాగిలాపూర్ తదితర ప్రాంతాలలో సర్కిల్ అనుమతులు లేని నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ కఠిన చర్యలు తీసుకోవాలని సర్కిల్ ప్రజలు కోరుతున్నారు.

## మైనర్ బాలికపై యువకుడు అత్యాచారం

### కేసు నమోదు చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/తాండూరు:** ఓ కామాంధుడు మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో చోటు చేసుకుంది. బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధి జీవన్గీ గ్రామానికి చెందిన నరేష్(25) అనే యువకుడు అదే గ్రామాని కి చెందిన ఏడేళ్ళ మైనర్ బాలికను మభ్యపెట్టి పూరాతనమైన పాడుబడ్డ ఇంట్లో కి తీసుకువెళ్ళి అత్యాచారఒడి గట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బషీరాబాద్ మండలంలోని జీవన్గీ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆరుబయట ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన నరేష్ అనే యువకుడు మైనర్ బాలికపై కన్నేశాడు. మైనర్ బాలికను ఓ పాడుబడ్డ ఇంట్లోకి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మరో పక్క బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# వృద్ధ దంపతులను కట్టేసి నేపాలీ ముఠా దోపిడీ

### మత్తుమందు కలిపిన పదార్థాలు తినిపించి, గేట్లకు తాళం వేసి పరార్

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/జవహర్‌నగర్:** విశ్రాంత ఐపిఎస్ అధికారి భార్యను నేపాలీ ముఠా హత్యోదంతం మరువక ముందే తాజాగా ఓ వృద్ధ దంపతులను కట్టేసి దోపిడీకి పాల్పడ్డ ఉదంతం చోటు చేసుకుంది. దంపతులు వేడుకోవటంతో వారికి ఎలాంటి ప్రాణాపాయం చేయకుండా వదిలేసి బీరువాల్లోంచి, ఇంట్లో అంతా చిందరవందర చేసి దొరికినంతా దోచుకొన్నారు. వెళుతూ ఆ దంపతులకు మత్తు మందు కలిపిన పదార్థాలను తినిపించి ఇంటి బయట గేట్లన్నిటికి తాళాలు వేసి పరారయ్యారు. ఈ సంఘటనలోనూ నేపాలీ ముఠాయే పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొన్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కౌకూర్ గోల్డ్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ (68) భార్య డాక్టర్ విజయలక్ష్మి (58)లు ఉంటున్నారు. కొద్ది కాలం క్రితం ఓ నేపాలీ జంట వీరివద్ద పనిలో చేరి వారి ఇంట్లోనే ఉంటూ నమ్మకంగా పని చేస్తూ వారితో ఒకరిగా కల్సిపోయారు. కొద్ది రోజుల క్రితం నేపాలీ జంట వద్దకు బంధువుగా పరిచయమైన ఓ మహిళ వచ్చింది. సోమవారం రాత్రి నేపాలీ మహిళ జన్మదిన వేడుకలను చేసుకొంటమని వృద్ధ దంపతులనను కోరటంతో వారు అంగీకరించారు.వేడులకంటూ నేపాలీకే చెందిన మరో ముగ్గురు సైతం ఆ ఇంట్లో చేరారు. మధ్యాహ్నం వృద్ధ దంపతులు భోజనం చేస్తుండగా నేపాలీ ముఠా జన్మ దిన వేడకులు చేసుకొంటున్నట్లు నటిస్తూ ఒక్కసారిగా వెనుక నుండి వచ్చిన దంపతులిద్దరిని బెదిరించి చేతులు కట్టేసారు. భయాందోళనలకు గురైన ఆ దంపతులు తమ ప్రాణాలకు ఎలాంటి అపకారం తలపెట్టద్దని మీకు ఏమి కావాలో తీసుకొని వెళ్లమని ప్రాధేయపడ్డారు. ఇదే సమయంలో ఆ ముఠా ఇంట్లో బీరువాలు, కప్‌బోర్డులకు చిందరవందర చేసి నగలు, విలువైన వస్తువులు దోచుకొన్నారు. అనంతరం మత్తు మందు కలిపిన పదార్థాలను దంపతులతో తినిపించి స్పృహ కోల్పోయారని నిర్థారించుకోగానే బయ ట నుండి అన్ని గేట్లకు తాళాలు వేసి పరారయ్యారు. మత్తు మందు పదార్థాల ప్రభావంతో ఆ దంపతులు మంగళవారం మధ్యాహ్యాం వరకు తేరుకోలేక పోయారు. కిటికీల నుండి వచ్చిన వారి అరుపులు విని స్థానికులు ఇంటి తలుపులు తీసారు. ఈ మేరకు దంపతులిచ్చిన ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దోపిడీలో నేపాలీ ముఠాకు చెందిన ఏడుగురు నేరానికి పాల్పడినట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సంఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు.



## కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రిస్మ్ జాన్సన్ లిమిటెడ్ రెడీమిక్స్ ప్లాంట్‌ను యాజమాన్యం అక్రమంగా మూసివేయడం తో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డార ని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ బాబు ఆరోపించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని రెడీమిక్స్ ప్లాంట్ వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టి.సత్య ప్రసాద్ బాబు మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా యాజమాన్యం అన్యాయంగా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తోందని విమర్శించారు. పరిశ్రమ మూసివేతకు సంబంధించిన కార్మిక చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ప్లాంట్‌ను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమ మూసివేతకు కనీసం రెండు నెలల ముందుగా కార్మికులకు, ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని చట్టం పేర్కొంటున్నప్పటికీ, యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా చర్యలు చేపట్టిందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం, లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు వికాస్ రెడ్డి, కార్మికులు నరసింహ, బుల్ ప్రధాన్, వెంకట్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.




## నేపాలీలతో జాగ్రత్త : సిఐ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీవాసులు ఇంటి పని మనుషులు,సెక్యూరిటీ గార్డులుగా నియమించే ముందు పూర్తి వివరాలు సేకరించాలని సిఐ భాస్కర్‌రెడ్డి అన్నారు.జూబ్లీహిల్స్,జవహర్ నగర్ ప్రాంతాలలో నేపాల్‌కు చెందిన వ్యక్తులు పని మనుషులుగా చేరి ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఘటనల నేపథ్యంలో బుధవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సైనిక్ పురి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. నేపాల్ వ్యక్తులను పనిలో నియమించుకునే ముందు వారి పూర్తి వివరాలు సేకరించి స్థానిక పిఎస్‌లో వెరిఫికేషన్ చేయించుకోవాలని,ఇళ్లను అద్దెకిచ్చే ముందు టెనెంట్‌ల నుండి రెంటల్ అగ్రిమెంట్,ఆధార్ కార్డులు తప్పనిసరి పరిశీలించాలని సూచించారు.

## 638 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఈ సీజన్‌లో మేడ్చల్ జిల్లాలో వ్యవసాయదారుల నుండి 638 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. దీనిలోని భాగంగా ఘట్‌కేసర్ మండలంలోని రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో రబి సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఈ మండలంలో ఏదులాబాద్, మాదారం, ప్రతాప్ సింగారం, అంకుషాపుర్, ఐషాపూర్



గ్రామాల్లో మరో ఐదు కేంద్రాలు ఏర్పాటయ్యాయన్నారు. జిల్లాలోని రైతులందరూ తమకు సమీపంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శుభ్రపరచిన ధాన్యం తీసుకొని రావాలని కోరారు.



## నీట్ పరీక్షా పేపర్ లీకేజీ ఘటనపై ఎఐఎస్ఎఫ్ నిరసనలు

### కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/కాప్రా :** నీట్ పరీక్షా పేపర్ లీకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తక్షణమే రాజీనామా చేయాలంటూ ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. పేపర్ లీకేజిని నిరసిస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఈసిఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద ప్లేకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ ప్రతినిధులు ధర్మేంద్ర, సత్య ప్రసాద్‌లు మాట్లాడుతూ గత 3న నిర్వహించిన నీట్ పరీక్షలో లీకేజీతో పాటు భారీ అక్రమాలు బయట పడటంతో పరీక్ష రద్దు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయయన్నారు. పారదర్శకత, డిజిటల్ ఇండియా అంటూ చెప్పుకోనే మోడీ ప్రభుత్వానికి నీట్ లీకేజి ఉదంతం చెంప దెబ్బ లాంటిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్‌కు చెందిన శేఖర్, వికాస్, మురళి, రవళి, కిరణ్మయి. దీప్తి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 'నీట్ పరీక్ష'పై సమగ్ర దర్యాప్తు : సిపిఐ

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** నీట్ పరీక్ష అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేస్తూ బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతీ సంవత్సరం లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అపారమైన శ్రమ, ఖర్చుతో నీట్ పరీక్షకు సిద్ధమవుతుంటే ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాస్ కాపియింగ్, మార్కుల మానిప్యులేషన్ వంటి ఘటనలు విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల విద్యను కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి నెట్టివేస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల ప్రతిభకు న్యాయం జరగాలంటే పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత ఉండాలని, కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను సహించబోమని, అవసరమైతే విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సొంత ఇంటి కల సాకారం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సొంత ఇంటి కల సాకారం అవుతుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ 7వ డివిజన్ పరిధిలో పకీర్ ఫ[illegible]కీర్ తండాలోని వద్యాజ్యోతి నానావత్ బుజ్జి నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి వేముల మహేష్ గౌడ్ పాల్గొని ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల కలల్ని సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు ప్రతి గృహప్రవేశం ఒక పండుగలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హయాంలో అభివృద్ధి శకం మొదలైందని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం అని అన్నారు.ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించి పేదలకు శాశ్వత నివాసాలను కల్పిస్తోందని ఇంటి నిర్మాణంలో దశలవారీగా నిధులు విడుదల చేస్తూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు నానావత్ రూప్ సింగ్ నాయక్, వేముల మమతగౌడ్, బద్దం గోపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వేముల సత్తయ్య గౌడ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పవర్ బోరు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉండరాదన్న లక్ష్యంతో మౌలాలి డివిజన్‌లోని గాంధీనగర్‌లో నూతనంగా పవర్ బోరు పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ గుణాల సునీత శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు మోహన్, శివగౌడ్, సాయిబాబు, ఫణీందర్, మంజునాథ్, గాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, కృష్ణగౌడ్, రామలక్ష్మణ్, సుధాకర్, బాలస్వామి చారి గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటితో కలుషితమవుతున్న 'బైన్' చెరువు

### * మృతి చెందుతున్న చేపలు..
### * ఆందోళన వ్యక్తం చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** చెరువులు, కుంటలు కలుషి తం కాకుండా, కబ్జాకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాని తీసుకువచ్చింది. చెరువులు, కుంటలను ఆహ్లాదకరమైన వాతావరణంలో అభివృద్ధి చేసి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే హైడ్రా లక్ష్యంగా ముందుకువెళ్తుంది. బాచుపల్లిలో మాత్రం అందుకు విరుద్ధంగా చెరువులు, కుంటలు నెలకొన్నాయి. కాలనీలు, హోటళ్లు, హాస్టళ్లు, బార్‌ల నుండి నేరుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుండి మురుగునీటితో చెరువు కలుషితం అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి మండలం, బాచుపల్లిలో అతిపెద్ద బైన్ చెరువు. ఈ చెరువు మత్స్యకారులకు, భూగర్భ జలాలు పెరుగుదలకు బైన్ చెరువే ఆధారం. ఒకప్పుడు బైన్ చెరువు వద్దకు వెళితే ఆహ్లాదకరమైన వాతావరణంతో చెరువు కళకళలాడుతుండేదని గ్రామస్థులు వాపోతున్నారు. నేడు బాచుపల్లి బైన్ చెరువు మురుగునీటి జలాలతో కంపుకొడుతుంది. చెరువు చుట్టూ ఉన్న కాలనీలు, హోటళ్లు, హాస్టళ్లు, బార్‌ల నుండి వెలువడే మురుగునీరు నేరుగా బైన్ చెరువులోకి చేరుతుంది. దాంతో మత్స్యకారులు ఆధారపడే చేపలు సైతం తరుచూ మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు మత్స్య కారులు జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ, నిజాంపేట్ సర్కిల్ అధికారులు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మురుగునీటి కలుషితంతో చెరువు వద్దకు వెళ్లాలంటేనే గ్రామస్థులు జంకుతున్నారు. ఇదిలా ఉండగా బోర్‌లలో భూగర్భ జలాలు సైతం కలుషితమై నీరు దుర్వాసనతో వస్తున్నాయని పలువురు వాపోతున్నారు.



ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బైన్ చెరువులో మురుగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకుని కాపాడాలని కోరుతున్నారు. బాచుపల్లిలోని అతి పెద్ద బైన్ చెరువులోకి నేరుగా మురుగునీరు కలుస్తోం దని, దీంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అవుతున్నాయని మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులకు ఆధారమే బైన్ చెరువు అని, ఇప్పుడు చెరువు పూర్తి గా మురుగునీటితో కలుషితమవుతుందని, జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకుని చెరువులోకి మురుగునీరు కలవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

**రూ.లక్షల విలువైన చేపలు మృత్యువాత...**



బాచుపల్లి బైన్ చెరువులో మురుగు నీరు కలుషితం అవుతుండడంతో లక్షలాది రూపాయల చేపలు మృత్యువాత పడ్డాయని బాచుపల్లి మత్స్యకార సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం నేతలు నందిగామ సత్యానారాయణ మాట్లాడు తూ చేతికి అందివచ్చే చేపలు కాస్త కలుషిత జలాలతో మృతి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి, ఉన్నతాధికారులకు చెరువులోకి డ్రైనేజీ నీటి కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులోకి డ్రైనేజీ నీరు కలుషితం కావడం వలన అందివచ్చిన చేపలు మృతిచెందడం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని మత్స్యకార సంఘం నాయకుడు, మాజీ ఎంపిటీసీ నందిగామ సత్యనారాయణ అన్నారు. మృతి చెందిన చేపల విలువు సుమారు రూ.8 లక్షల నుండి రూ.16 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. చెరువులోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు, ఉన్నతాధికారులు బైరన్ చెరువులోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## మహిళా కానిస్టేబుల్‌ను మోసం చేసిన ఎస్ఐపై కేసు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సురేష్ కుమార్‌పై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. 2018 బ్యాచ్‌కు చెందిన సురేష్‌కుమార్, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్‌తో పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో దగ్గరయ్యాడని సమాచారం. పెళ్లి చేసుకుంటానని హామీ ఇవ్వడంతో ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధం కొనసాగింది. అయితే కొంతకాలం తరువాత పెళ్లి విషయంపై యువతి ఒత్తిడి చేయగా సురేష్ కుమార్ వివిధ సాకులు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఇటీవల ఈ విషయంపై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.



తనను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడనిన అనుమానించిన మహిళా కానిస్టేబుల్ సురేష్ కుమార్‌ను నిలదీయగా, అతను పెళ్లి చేసుకోవడం కుదరదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో బాధితురాలు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు సురేష్ కుమార్‌ను విచారించేందుకు ప్రయత్నించగా అతను ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాడు. బాధితురాలు సమర్పించిన ఆధారాల ఆధారంగా ఉన్నతాధికారులు అతనిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

"గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా 'హ్యాపీ జర్నీ' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత."



## నిర్మాతల మండలికి నట్టి కుమార్ రాజీనామా



తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలిలో సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్న నిర్మాత నట్టి కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన నిర్మాతల మండలికి లేఖ పంపించారు.కౌన్సిల్ ప్రస్తుత పని తీరు పట్ల తీవ్ర నిరాశ, ఆందోళనతో నేను ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. నిర్మాతలుగా, ఎగ్జిబిటర్లుగా మనం పర్సెంటేజ్ విధానాన్ని సరిగ్గా నిర్వహించడంలో విఫలమయ్యాము. కార్యవర్గ సభ్యులతో సరైన సమాచారం పంచుకోకుండానే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడం, గిల్ కార్యకలాపాలు నడపడం జరుగుతోంది. ఈ విధానం కారణంగా, చిన్న నిర్మాతలు తీవ్రంగా నష్టపోతుండగా, ఎగ్జిబిటర్లు పైచేయి సాధిస్తున్నారు. ఈ అసమతుల్యత అనేక మంది నిర్మాతల పతనానికి దారితీసింది. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా నిర్మాతల విషయంలో కార్యవర్గ సభ్యుల భాగస్వామ్యం లేకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారు. నిర్మాతల మండలిలో పరిపాలన, ఖాతాలు, ఆడిటింగ్, ఆర్థిక నిర్వహణలో కూడా పారదర్శకత లోపించింది. సరైన జవాబుదారీతనం లేదు. ఈ నేపథ్యంలో బాధ్యతాయుతమైన ఈ పదవిలో కొనసాగడంలో అర్థం లేదని నేను భావిస్తున్నాను. అందుకే రాజీనామా చేస్తున్నానని తెలియజేస్తున్నాను. నా రాజీనామాను దయచేసి ఆమోదించి, పరిగణనలోకి తీసుకోవాలని నేను మండలిని అభ్యర్థిస్తున్నాను అని నట్టి కుమార్ లేఖలో పేర్కొన్నారు.

## 'హ్యాపీ జర్నీ' ఫస్ట్ లుక్ రిలీజ్

గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా 'హ్యాపీ జర్నీ' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత. ఏడుగురు మహిళల భావోద్వేగ ప్రయాణాలను ప్రధానంగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం చేస్తోంది. అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, పృధ్వీ దండమూడి, వంశీధర్ గౌడ్, రవి శివ తేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రతి పాత్రను ఎంతో సహజంగా, భావోద్వేగాలకు దగ్గరగా తీర్చిదిద్దారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ప్లెజెంట్గా, ఫీల్‌గుడ్ ట్రావెల్ వైబ్‌ను అందిస్తోంది. పారిస్లోని ప్రసిద్ధ లూవ్రే పిరమిడ్, ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్, సాఫ్ట్ సన్సెట్ బ్యాక్డ్రాప్ మధ్య భిన్న తరాల మహిళలు, కొంతమంది యువకులు కలిసి కనిపిస్తున్న తీరు, స్నేహం, ఆప్యాయత, జీవితాన్ని ఆస్వాదించే జర్నీ ని అందంగా ప్రతిబింబిస్తోంది. కథ యూరప్లోని పారిస్, మాంట్పెలియర్ వంటి అందమైన ప్రదేశాల్లో సాగనుంది. పాత్రల మధ్య కెమిస్ట్రీ, సంభాషణలు, ఎమోషన్స్ అన్నీ ఎంతో సహజంగా ఉండనున్నాయి. శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు.



## నాజర్ ప్రధాన పాత్రలో 'ముసలోడికి దసరా పండుగ'

రాజీ నాయుడు సీతమ్మ వాళ్లె ఆశీస్సులతో రమణా ఫిలిమ్స్ బ్యానర్‌పై యువ నిర్మాత రమణ వాళ్లె నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం ముసలోడికి దసరా పండుగ. విలక్షణ నటుడు నాజర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా మే 15న థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా నిర్మాత రమణ వాళ్లె మాట్లాడుతూ ప్రేక్షకులు థియేటర్కు వస్తే రెండు గంటల పాటు కష్టాలన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. సినిమా అవుట్పుట్ పట్ల మేము చాలా కాన్ఫిడెంట్గా ఉన్నాం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుందని నమ్మకంగా చెప్పగలం. ఈ సినిమాను మా పితృ సమానులు దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు అంకితమిస్తున్నాం అని తెలిపారు. ఈ సినిమాలో నాజర్తో పాటు అంజలి (సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేం) , అనిత (నువ్వు నేను ఫేం), కోవై సరళ, శరణ్య, సత్య నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: డి. ఇమాన్, సినిమాటోగ్రఫీ: వి. లక్ష్మీ పతి.




## స్టార్ హీరోలు స్పీడ్‌గా సినిమాలు పూర్తి చేయాలి: బన్నీవాస్

### ఒటిటి విడుదలకు మరింత సమయం తీసుకోవాలి



ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో జరుగుతున్న పరిణామాలపై సోషల్ మీడియా ద్వారా నిర్మాత బన్నీవాస్ స్పందించారు. పరిశ్రమలోని మూల సమస్యలకు పరిష్కారం చూడకుండా వచ్చే ఆదాయంలో ఎవరెంత పంచుకోవాలి అని చర్చించుకోవడం వల్ల ఉపయోగం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. స్టార్ హీరోలు వీలైనంత త్వరగా సినిమాలు కంప్లీట్ చేయాలని, 27 రోజుల ఓటీటీ విండోకు మరింత సమయం తీసుకోవాలని ఆయన సూచించారు. పెద్ద సినిమాల ఆదాయం రూపాయికి సగానికి సగం తగ్గిపోగా, చిన్న సినిమాల ఆదాయం రూపాయికి పావలాకు పడిపోయిందని బన్నీవాస్ ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ రేట్ల పెంపు, ఇతర ధరల పెంపు వల్ల వచ్చిన కలెక్షన్స్ ను గొప్పగా చెప్పుకుంటున్నామని, ఇది ప్రేక్షకుల మీద భారం వేయడమే అని అన్నారు. ఈ పరిస్థితి నిర్మాతలతో పాటు సింగిల్ స్క్రీన్ ఎగ్జిబిటర్స్ నష్టపోతున్నారనేది వాస్తవమని ఆయన చెప్పారు. తినుబండారాల ధరలు కూడా అదుపులో ఉంచాలన్నారు. ఇలాంటి మూల సమస్యలు వదిలేసి తగ్గిపోయిన ఆదాయం మీద పోరాడితే ఏం లాభం అంటూ బన్నీ వాస్ ప్రశ్నించారు.

## సొంతూరికి వెళ్లిన అనుభూతి



హీరో సువిక్షిత్

సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. ఈ చిత్రం 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం హీరో సువిక్షిత్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. కడప జిల్లా రాయచోటి. నాకు వ్యాపారం ఉంది. చిన్నప్పటి నుండి సినిమాలంటే పాషన్.. సినిమాలను చూసి ఇన్స్పయిర్ అయ్యే వాడిని. అనుకోకుండా ఈ సినిమా ద్వారా హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను.రచయిత నారాయణ , అరుణాచలంలో కలిసిన ఓ యాచకుడి జీవిత గాథ ఆధారంగా ఈకథను అనుకుని రాసుకున్నారు. అయితే మొదట ఈ సినిమాను వేరే హీరోతో చేద్దామని ప్లాన్ చేశాం. అయితే కథకు కొత్త హీరో అవసరం కాబట్టి నాకున్న ఇంట్రెస్ట్తో. ఆ పాత్రకు నేను సెట్ అవుతానని భావించి కథానాయకుడిగా నేనే నటించాను. ఈ కథను నేను కూడా విన్నాను. 90 బ్యాక్ డ్రాప్లో నడిచే ఈ కథలో లీడ్ పాత్రకు అప్పట్లో ఎలాంటి అనుభూతి పొందామో తెలుసుకుని నటించాలి. మేము ఏదో తక్కువ థియేటర్స్లో రిలీజ్ చేద్దాం అనుకున్నాను. ఇప్పుడు దాదాపుగా 250పైగా థియేటర్స్లో విడుదల చేస్తున్నాం. 90లో ప్రతి ఒక్కరూ వాళ్ల ఊరిలో తిరిగొచ్చిన ఫీల్ కలుగుతుంది. ఈ సినిమా చాలా ఎమోషనల్గా ఉంటుంది. ఈ సినిమాలో ఎమోషన్ చూసి ఏడ్వకుండా ఎవ్వరూ ఉండలేరు. తప్పకుండా మంచి కథలతో సినిమాలు చేయాలని ఉంది.

## క్రీడా నేపథ్యంలో 'గుర్తింపు'

స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్, స్వస్తిక్ విజన్స్ సంయుక్త నిర్మాణంలో కేజేఆర్ హీరోగా ఎస్కే ప్రశాంత్, అజిత్ బాస్కర్, అరుణ్ మురుగన్ నిర్మించిన చిత్రం 'గుర్తింపు'. ఈ మూవీకి జె.పి. తెన్ పతియాన్ దర్శకత్వం వహించారు. దేశంలోని క్రీడా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ పనితీరు, పేదలు క్రీడలకు ఎంత దూరంలో ఉన్నారు అనే విషయాల్ని ఇతివృత్తంగా తీసుకుని 'గుర్తింపు' సినిమాని తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్ను రిలీజ్ చేశారు.'క్రికెట్ నేషనల్ గేమ్'.. 'హాకీ మన నేషనల్ గేమ్'.. 'మన దేశానికి నేషనల్ గేమ్ అనేదే లేదు. మీరందరూ చూసే పది సెకన్లు కాదు సార్ నా జీవితం. దాని వెనకాల నా 29 ఏళ్ల జీవితం, శ్రమ ఉంది సర్.. మీట్కి వెళ్తే గెలుస్తాం.. కానీ అక్కడి వరకు వెళ్లలేకపోతున్నాం. మన లాంటి వాళ్లకి గేమ్ మామూలు విషయం కాదు అదే మనకు విడుదల', 'స్పోరట్స్ అని కొడితే క్రికెట్ గురించి మాత్రమే న్యూస్ వస్తుంది', 'దేశం కోసం పోరాడే వాళ్లకి మాత్రమే కాదు.. క్రీడాకారులకి కూడా ఎంతో రుణపడి ఉంటుంది. ఈ ట్రైలర్ను గమనిస్తే ఓ పేదవాడు అథ్లెటిక్గా ఎదిగే క్రమంలో ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నాడు.. ఈ ప్రయాణంలో క్రీడా శాఖ మంత్రిని కోర్టు మెట్లు ఎందుకు ఎక్కించాడు.. అసలు అతనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమస్యలు వచ్చాయి.. కోర్టులో కోరుకున్న న్యాయం దక్కిందా? లేదా? అనే ఉత్సుకత కలిగించేలా ట్రైలర్ను కట్ చేశారు. విజువల్గా, సౌండింగ్ పరంగా ట్రైలర్ అదిరిపోయింది. హీరోగా కేజేఆర్ లుక్స్, బాడీ ట్రాన్స్ఫర్మేషన్, పర్ఫామెన్స్ ఈ ట్రైలర్లో అదిరిపోయింది. ఈ మూవీని జూన్లో విడుదల చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈచిత్రానికి సంగీతం గిబ్రాన్ వైబోధ, యాక్షన్ పీటర్ హెయిన్, కెమెరామెన్ విశ్వనాథ్ డీఎఫ్ టెక్, ఎడిటర్ దినేష్ కుమార్, ఆర్ట్ డైరెక్టర్ రాము తంగరాజ్, కొరియోగ్రఫీ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్ఫూర్తి కేతినేని.



## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నీట్ ప్రశ్నా పత్రం లీకేజీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నీట్ యూజీ పరీక్ష 2026 పేపర్ లీక్‌ను, పరీక్ష రద్దును నిరసిస్తూ బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ కూడలి వద్ద కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న పేపర్ లీకేజీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నా పత్రం లీక్‌కు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) అసమర్థత కారణమని, ఇందుకు కారణమైన వారిని శిక్షించడంతో ఎన్‌టిఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, నాయకులు అరుణ్, హరీష్ అరుణ్,రంజిత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## తుమ్మిడిహట్టి బ్యారేజీ స్థల ఎంపికకు ముందు సమగ్ర సాంకేతిక అధ్యయనం

### ప్రభుత్వాన్ని కోరిన తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రాణహితచేవెళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో భాగంగా ప్రతిపాదిత తుమ్మిడిహట్టి బ్యారేజ్ స్థల ఎంపికపై తుది నిర్ణయం తీసుకునే ముందు సమగ్ర సాంకేతిక అధ్యయనాలు నిర్వహించాలని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ (టిఆర్‌ఇఎ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ (ఐఅండ్‌సిఎడి శాఖ)ను టిఆర్‌ఇఎ గౌరవ అధ్యక్షులు జి.దామోదరరెడ్డి, అధ్యక్షులు ఎం.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి లేఖ అందించారు. వర్ధా, వైన్‌గంగా నదుల సంగమ ప్రాంతంలో ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణంపై పలు సాంకేతిక ఆందోళనలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్రతో ఒప్పందం ప్రకారం బ్యారేజ్ పూర్తి జలమట్టం ప్లస్ 148.0 మీటర్లకే పరిమితమైందని, అందువల్ల స్థలాన్ని ఖరారు చేసే ముందు పూర్తి స్థాయి టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీలు అవసరమని తెలిపారు. వర్ధా, వైన్‌గంగా నదుల ప్రవాహ తీరు, వర్షపాతం, క్యాచ్‌మెంట్ ప్రాంతాలు భిన్నంగా ఉండటంతో నీటి వేగం, ప్రవాహ సమయాల్లో గణనీయమైన తేడాలు వస్తాయని ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. దీని వల్ల బ్యారేజ్ వద్ద పెద్ద ఎడిస్, క్రాస్ కరెంట్స్, హెలికల్ ఫ్లోస్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ముఖ్యంగా రెండు నదుల సంగమ ప్రాంతంలో కృత్రిమంగా ఏర్పడే ప్రవాహ మార్పులు నిర్మాణ భద్రతపై ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే తుమ్మిడిహట్టి దిగువన 9.0 కిలోమీటర్ల దూరంలోని బోరేపల్లి ప్రాంతాన్ని ప్రత్యామ్నాయ స్థలంగా ప్రతిపాదించినట్లు లేఖలో వెల్లడించారు. ఆ ప్రాంతంపై సాధ్యత అధ్యయనాలు కూడా ప్రారంభమైనట్లు తెలిపారు.సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి) డిపిఆర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత స్థలంతో పాటు అన్ని ప్రత్యామ్నాయ ప్రాంతాలపై మోడల్ స్టడీలు నిర్వహించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని టిఆర్‌ఇఎ ప్రభుత్వాన్ని కోరింది.



## ప్రపంచం చూపు చైనా వైపు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎంతో లయబద్ధంగా బ్యాండ్ వాయిజ్య ధ్వనులతో ఆ ప్రాంతం మారుమోగింది. కుమారుడు ఎరిక్ ట్రంప్, కోడలు లారా ట్రంప్ విమానంలో డోనాల్డ్ ట్రంప్ వెంట వచ్చారు. ఆయన విడిది ప్రదేశానికి చేరుకునే ప్రయాణ మార్గ ప్రాంతాన్ని ఎంతో సుందరంగా అలంకరించారు. చైనా,అమెరికా పతాకాలను ఆ మార్గంలో అలంకరించారు. ఆకాశహర్మ్యాలన్నీ ఘనమైన కాంతులు విరజిమ్ముతూ ట్రంప్‌కు స్వాగతం పలికాయి. ప్రపంచంలో అత్యంత సంపన్నవంతమైన అగ్రదేశాల నాయకులు ఇద్దరూ ఏడోసారి గురువారంనాడు ముఖాముఖీ సమావేశం జరపడానికి సిద్ధమయ్యారు. రెండోసారి శుక్రవారం కూడా నాయకులు ఇద్దరూ సమావేశమై ప్రపంచ సమస్యలపై చర్చలు జరుపుతారు. ఐతే ఈ పర్యటనకు ముందు ఆదివారం అమెరికా ముఖ్య ఉప పత్రికా కార్యదర్శి అన్నా కెల్లీ మాట్లాడుతూ, చైనా నాయకులను కూడా అమెరికా పర్యటనకు ఆహ్వానిస్తామని చెప్పారు. ట్రంప్‌తోపాటు వెళ్ళిన అమెరికా దిగ్గజ వాణిజ్యవేత్తలలో టెస్లా అధినేత ఎలాన్‌మస్క్,యాపిల్ సిఇఓ టిమ్ కుక్ ఉన్నారు.
వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాలు, ఇరాన్‌యుద్ధం సహా ప్రపంచ సమస్యలపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చిస్తారు. ప్రపంచదేశాల భారీ అంచనాల మధ్య ట్రంప్ పర్యటన ప్రారంభమైంది. గత ఏడాది బుసాన్‌లో కలుసుకున్న సందర్భంగా జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ట్రంప్ ఈ పర్యటనకు వెళ్ళారు.
ఈ పర్యటనకు ముందుగా సోషల్ మీడియా వేదికగా ట్రంప్ స్పందిస్తూ, ప్రధానంగా వాణిజ్య వ్యవహారాలపైనే దృష్టి కేంద్రీకరిస్తామని పేర్కొన్నారు. అమెరికా టెక్ కంపెనీలకు చైనా తలుపులు బార్లా తెరవాలని జిన్‌పింగ్‌ను అడుగుతానన్నారు. జిన్‌పింగ్‌ను అసాధారణ విశిష్టతగల వ్యక్తిగా అభివర్ణించారు. వాణిజ్యం,సాంకేతికత,తైవాన్ అంశాలతోపాటు ఇరాన్ విషయంపై సుదీర్ఘంగా జీ జిన్‌పింగ్‌తో సంభాషిస్తానని చెప్పారు. అమెరికా నుండి చైనాకు 525 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరుగుతాయి. ఐతే వీటిపై టారిఫ్‌ల ప్రభావం ఉన్నందువల్ల ఈ సమస్య పరిష్కారంపై ట్రంప్ ప్రధానంగా దృష్టి పెడతారు. అదేసమయంలో చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ బుధవారం బీజింగ్‌లో మాట్లాడుతూ, ఇరు దేశాలకు సంబంధించిన ప్రధాన సమస్యలతోపాటు ప్రపంచశాంతి,అభివృద్ధిపై నాయకులు ఇద్దరూ లోతైన అభిప్రాయాలు పంచుకుంటారని చెప్పారు. సమానత్వం,గౌరవం,పరస్పర ప్రయోజనాల స్ఫూర్తితో సహకారాన్ని విస్తరించుకోవడానికి, విభేదాలు పరిష్కరించుకోవడానికి,పరివర్తన చెందుతున్న అస్థిర ప్రపంచంలో స్థిరత్వం సాధించేందుకు, భరోసా కల్పించేందుకు అమెరికాతో చైనా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఐతే అమెరికా మీడియా నివేదికల ప్రకారం, వాణిజ్యం,అరుదైన మూలకాల సరఫరా,సరఫరా వ్యవస్థలు,టారిఫ్‌లు,కృత్రిమ మేధ,ఇరాన్ యుద్ధం, తైవాన్‌కు ఆయుధ విక్రయాలు వంటి అంశాలు రెండూ సూపర్‌పవర్స్‌మధ్యా ప్రధాన ఎజెండాగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, దక్షిణ కొరియా వేదికగా అమెరికా,చైనా ప్రతినిధులమధ్య బుధవారం చర్చలు జరిగాయి.
అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్,చైనా ఉప ప్రధాన మంత్రి,ఆర్థిక,వాణిజ్య వ్యవహారాల ప్రధాన ప్రతినిధి హే లీఫింగ్ మధ్య వాణిజ్య చర్చలు జరిగాయి. ఇరు దేశాలకు ఆసక్తి ఉన్న ఆర్థిక,వాణిజ్య అంశాలపై,ఆచరణాత్మకమైన సహకారాన్ని విస్తృతం చేసుకోవడంపై నాయకులిద్దరి మధ్యా నిష్కపటంగా లోతుగా నిర్మాణాత్మక చర్చలు జరిగాయి.

## రెక్కలు

**(మొదటి పేజీ తరువాయి)**

అనియంత్రితంగా పెరగడం వల్ల ఇటీవలి నెలల్లో బంగారం ధరలు బాగా పుంజుకున్నాయి. ముడిచమురు తర్వాత భారతదేశం అత్యధికంగా దిగుమతి చేసుకునే రెండవ వస్తువు బంగారమే. పెరుగుతున్న కొనుగోళ్లు విదేశీమారక ద్రవ్య ప్రవాహాలకు తోడై రూపాయిపై రికార్డు స్థాయి కనిష్ఠానికి ఒత్తిడిని పెంచాయి.పెరిగిన సుంకాల వల్ల దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం ఉంది. మే 13 నుంచి అమలులోకి వచ్చేలా, బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6శాతం నుంచి 15శాతానికి, ప్లాటినంపై సుంకాన్ని 6.4 శాతం నుండి 15.4 శాతానికి ప్రభుత్వం పెంచింది. దీని పర్యవసానంగా బంగారం /వెండి డోర్, నాణేలు, ఇతర సామగ్రి మొదలైన వాటికి కూడా మార్పులు చేశారు. 2024–25లో 11.8శాతంగా ఉన్న మొత్తం దిగుమతులలో బంగారం, వెండి వాటా 14శాతానికి పెరగడంతో 2025–26ఆర్థిక సంవత్సరంలో బంగారం, వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 26.7శాతం పెరిగి 102.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అనవసరమైన విదేశీ మారక వ్యయాన్ని తగ్గించడానికి ఇతర పొదుపు చర్యలతో పాటు, బంగారం కొనుగోళ్లపై నియంత్రణలు విధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చిన కొద్ది రోజులకే ఈ సుంకం పెంపు జరిగింది. చైనా తర్వాత ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారు వినియోగదారు అయిన భారతదేశంలో బంగారు దిగుమతులు ఆభరణాల పరిశ్రమ డిమాండ్ ద్వారా నడపబడుతున్నాయి. ఇటువంటి దిగుమతులలో గణనీయమైన విదేశీ మారక ద్రవ్యం బయటకు వెళుతుంది. ఇదిలా ఉంటే బుధవారం రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే అత్యంత కనిష్ఠ ముగింపు స్థాయికి పడిపోయింది.
మంగళవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.75 వద్ద రికార్డు కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అయితే బంగారం దిగుమతి సుంకాన్ని ప్రకటించిన తర్వాత బుధవారం కొంతమేరకు కోలుకుంది. బుధవారం చేపట్టిన సుంకాల పెంపు ద్వారా బంగారంపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 10శాతానికి రెట్టింపు చేయగా, వ్యవసాయ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ (ఎఐడిసి)ను 5 శాతానికి అంటే 5 రెట్లు పెంచారు. దీంతో బంగారం, వెండిపై వాస్తవ దిగుమతి సుంకం 15 శాతానికి చేరింది. అంతేకాకుండా, దిగుమతిదారులు 3శాతం ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి (ఐజిఎస్‌టి) చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మొత్తం సుంకం గతంలో ఉన్న 9.18 శాతం నుంచి 18.45శాతానికి పెరుగుతుంది. దిగుమతి సుంకం పెంపు వల్ల ప్రతీ 10గ్రాముల బంగారం ధర సుమారు రూ.27,000 మేరకు పెరుగుతుందని ఆల్ ఇండియా జెమ్స్ అండ్ జ్యువెలరీ కౌన్సిల్ (జిజెసి) చైర్మన్ రాజేష్ రోక్డే చెప్పారు. పశ్చిమాసియా సంక్షోభం తగ్గుముఖం పట్టే వరకూ బంగారం దిగుమతి సుంకం అధికంగానే ఉంటుందని తాను భావిస్తున్నానని జ్యువెలరీ రిటైలర్ సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ సువాంకర్ సేన్ తెలిపారు.అసాధారణ బాహ్య పరిస్థితుల నేపథ్యంలో దిగుమతి సుంకం పెంపు ఒక నివారణ చర్య అని, నివారించదగిన దిగుమతి డిమాండ్‌ను నియంత్రించి, విదేశీ ఖాతాపై ఒత్తిడిని తగ్గించడమే దీని ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy**, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao**, E-mail : editorprajapaksham@gmail.com